

దామెర్ల కళ – వారసత్వం...

దామెర్ల రామరాయని జీవితసంగ్రహం

మాకినీడి సూర్య భాస్కర్

రాజమండ్రి చిత్రకళానికేతన్

పురమందిరం, రాజమహేంద్రవరం -533 101, ఆం.ప్ర

Cell: 94908 77211 E Mail: tekimrao@gmail.com

DAMERLA KALA-VAARASATVAM...

MAKINEEDI SURYA BHASKAR

First Edition : 26 January 2019
(commemorating erection and unveiling of Damerla's statue on Godavari bank)

Cover Design, DTP & Page Setting
Makineedi Surya Bhaskar

Painting of Damerla
Sri Guvvala Kennedy

SOUMYA PUBLICATIONS
9-3-6/1A, Saraswathi Nilayam
Gandhinagar
KAKINADA-533 004

Mobile: 89852 17627
e-mail: makineedi.writer@gmail.com

Rs.**150/-**

దామెర్ల రామారావనే
బాల్యావస్థపు కళామౌలిక తత్త్వాన్ని సున్నితంగా చెక్కి అపురూప
కళాఖండంగా శిల్పించిన
ఆస్వాల్డ్ జెన్నింగ్స్ కూల్డ్రే మహాశయుని



మరియు
ఆయన చెక్కిన ఆ అపురూప శిల్పాన్ని ప్రేమతో... బాధ్యతతో... ' '
'గురు'తరంగా భావించి
కాలానికి నిలబెట్టిన మిత్రరత్నం
వరదా వెంకటరత్నం మహోదయుని



దివ్యస్ఫూర్తులకు వినమ్రతాంజలి.

– మాకినీడి సూర్య భాస్కర్



కృతజ్ఞతలు

తెలుగు అకాడెమీ ప్రచురించే 'తెలుగు విద్యావైజ్ఞానిక మాసపత్రిక', మిసిమి, కళాదీపిక పత్రికలకు, సంపాదకులకు...

ఏడు సంవత్సరాలపాటు వారానికో పేజీ కేటాయించి 'కళానుబంధం'లో ప్రతి గురువారం కళల గురించి, చిత్రకారుల గురించి ఎన్నెన్నో వ్యాసాలు, సమీక్షలు, వివిధ శీర్షికలతో నిర్వహింపజేసిన సర్కార్ ఎక్స్‌ప్రెస్ దినపత్రికకు, ప్రత్యేకించి దాని సంపాదకులు శ్రీ గొడవర్తి సత్యమూర్తిగారికీ...

ఆయా పత్రికల్లో దామెర్ల రామారావుగారి గురించి నేను రాసి ప్రచురించిన వ్యాసాలను సంపుటీకరించి, రామారావుగారి విగ్రహావిష్కరణ సమయంలో విడుదల చేదామని సూచన చేసి ప్రోత్సహించిన రాజమండ్రి చిత్రకళానికేతన్ వ్యవస్థాపక కార్యదర్శి, 'రాజమండ్రి కళారత్నం' టేకి మృత్యుంజయరావు గారికీ...

ఈ పుస్తకాన్ని అంకితం తీసుకుందుకు ఆమోదించిన 'కళోద్ధారకులు', ముఖ్యంగా రాజమండ్రి చిత్రకళానికేతన్‌కు పాతికేళ్ళనుంచీ అంతా తానే అయి అవిచ్ఛిన్నంగా అనేక కార్యక్రమాలు నిర్వహింపజేస్తున్న 'కళాబంధు' మాన్యశ్రీ మద్దూరి శివానంద కుమార్ గారికీ...

పుస్తక ముద్రణ బాధ్యతనంతనీ భుజాలపై వేసుకుని ఎంతో శ్రద్ధతో ప్రచురింపజేసిన కీ.శే॥ మాదేటి రాజాజీగారి అన్నగారబ్బాయి శ్రీ మాదేటి రవి ప్రకాశ్ గారికీ...

ఈ పుస్తకం ఇలా రావడానికి సహకరించిన ప్రతివారికీ...

కాకినాడ,
30.12. 2018 — మాకినీడి సూర్య భాస్కర్

అంకితం

కళలను ప్రోత్సహిస్తూ ... పోషిస్తూన్న

కళాబంధు

ముఖ్యంగా రాజమండ్రి చిత్రకళానికేతన్‌కు

పాతికేళ్ళనుంచీ అంతా తానే అయి

అవిచ్ఛిన్నంగా అనేక కార్యక్రమాలు నిర్వహింపజేస్తున్న

మాన్యశ్రీ **శివానంద కుమార్** గారికి



- మాకినీడి సూర్యభాస్కర్



గొనుమీ అంకితము ...

గీ॥ జీవనాధార పుణ్య గోదావరీ న
దీమ తల్లిదౌ యొడిలోన దిద్దబడిన
పూజ్య మద్దూరి వంశాన బుట్టినట్టి
మాన్యుడ, శివానంద కుమార మహిత మాన్య!

ఉ॥ శ్రీకరమైన వంశము నశేషజనావళి మెచ్చు శీలమున్
ప్రాకటమైన దానగుణ భాసితపాణి తలంబు గల్గి శో
భాకర మూర్తివైతివి సభాసముఖమ్మున గౌరవాంజలుల్
చేకొనుమయ్య మా హృదయసీమలు మెచ్చగ నంకితమ్మిదే!

సీ॥ స్వాతంత్ర్య సంప్రాప్త్య సమరాన తాతయ్య
శివరామ కృష్ణుండు శిక్యమూర్తి
న్యాయమే రూపెత్తు నాగభూషణ రావు
తండ్రిగారు తమకు, ధర్మమూర్తి
బారిష్టరుల కుటుంబ మనగ నొప్పుచు
వరలెడు గొప్పదౌ వంశ స్ఫూర్తి
సాహిత్య సౌహిత్య సంసర్గ బుధజన
విభుడవు మీదగు విమల కీర్తి
ఇన్ని మేల్తర ఘనతలు ఇంపుమీర
వంశపు పరంపర యనగ వచ్చె మీకు
వన్నె పెరుగగ జేసితివయ్య, పైన
నింక; నీ మహిత మహత్వమేమి చెబుదు!

సీ॥ చిత్రకళాసేవ చిన్మయ సేవంచు
తెలుపుటే మీదగు దృక్పథమ్ము
వర్ణ వైభవమది పరమ హృద్యమటంచు
తెలియగ జేయుటే తెంపు మీకు

బహువిధ రేఖల భవ్య మార్గములన్ని
ఆదరించుటె మీకు ఆత్మవిద్య
చిత్రకళారూప చిత్రపుభలన్నిటి
వివరించుటే మీకు వేడుకగును
తెలుగు బిడ్డలు కళలలో వెలుగులీన
చక్కగా తీర్చి దిద్దెడు చక్కనయ్య!
కార్యశాలలు పోటీలు క్రమముగాను
నిర్వహించు సర్జకశీల నిపుణ మతివి!

ఉ॥ దానములున్న వెన్నియొ నిదానము తోడుత గూర్చు సప్తసం
తానములందు లెక్కగొన తానమునందిన 'చిత్రవిద్య' సం
ధానమునందె మీ ధన నిధానము, వన్నెయు వాసి మీరగా
జ్ఞానము పంచువాడవుగ! జ్ఞాననిధీ! గొనుమీ నమస్సులన్!

సీ॥ వీరేశలింగ పురీ మందిరానికి
ధర్మకర్తగుచును తనరునెవడు
శ్రీవిరించీ జరావృద్ధాశ్రమంబుకు
కార్యదర్శి యగుచు కనునదెవడు
మద్దూరి లక్ష్మినామాఖ్య దాతృత్వ సం
స్థ కధిపతిగ యొప్పి సాగునెవడు
రాజమహేంద్రి చిత్రకళా నికేతన
జవ జీవములనగ సరి మరెవడు
త్యాగరాజ నారాయణ దాస సేవ
సమితి కార్యదర్శిగ నొప్పు సరసుడెవడు
అట్టి సంఘసేవాతత్పరాభిదాన,
అంజ లింతును మనసుతో మహితమాన్య!

గీ॥ విజయ నగర గాంధర్వంపు విద్యలోన
ఖండవీణ వాదము నందఖండ ప్రతిభ

గాత్ర సంగీత మంద్రగగామి యౌచు
బహుమతులనెన్నొ పొందిన పరమ పూజ్య!

గ్రంథమునకు కూడును సార్థకత్వ మరయ
సరియ, 'దామెర్ల కళ-వార సత్వ'మనెడు
పుస్తకమ్ము మీకీయగ పులకలౌదు
రమ్ము కానుకగా తీసికొమ్ము ఆర్య!

చిత్ర కళారంగ మందున చిన్మయుందు
ఆంధ్ర చిత్రకళోద్దీప వైతాళికుండు
రామరాయని యందపారమగు భక్తి
కలుగు మీకంకితమన లోకమ్ము మెచ్చు!

కాకినాడ,   బుధజన విధేయుడు
26-01-2018   **- మాకినీడి సూర్య భాస్కర్**
(గణతంత్ర దినోత్సవం)   94915 04045



రాజమండ్రి చిత్రకళానికేతన్ రజతోత్సవ ప్రారంభ వేడుకల్లో...

స్వీకర్త పలుకులు

పుస్తకం ఒక భూషణం!
పుస్తకాలు నిత్య పఠనాలు.
పుస్తకాలు విజ్ఞానుల మస్తకాలు!
పుస్తకాలకు మనం దగ్గరయ్యేకొద్దీ,
అజ్ఞానాంధకారానికి దూరమౌతాము.
పుస్తకాలు వ్రాసేవాళ్లు కవులు, రచయితలు
పుస్తకాల్లో మనకూ ఓ నాలుగు పేజీలు ఉండాలన్న
సంకల్పం ప్రతి ఒక్కరికి ఉండాలి. మనిషి కీర్తిశరీరుడయ్యాడంటే ఇదేనేమో! పుస్తకాల్లోకి ఎక్కినవారిని మహానుభావులంటారు. చెరగని వారి ఘనతను చరిత ఎప్పటికీ గుర్తు పెట్టుకుంటుంది. దాన్ని చదివిన వారు తమ కర్తవ్యం ఏమిటో నిర్ణయించుకుంటారు. మరచిన వారు స్ఫురణకు తెచ్చుకుంటారు. ఏ దిక్కూతోచక సందిగ్ధంలో పడ్డవారు చైతన్యాన్ని పొందుతారు.

అందుకే అన్నారు పుస్తకాన్ని మించిన మంచి స్నేహితుడు లేడని! సమాజ హితం కోరిన వారు పుస్తకాలను పంచడం ఉభయతారకం అంటాను నేను. జన్మభూమికి ఖ్యాతి తెచ్చిన దామెర్ల వారన్న నాకు అత్యంత పూజ్య భావము. వారి కళాప్రస్థానమే పుస్తకరూపంలో నన్ను వరించినప్పుడు... స్వీకరించటంలో అమితానందం పొందుతున్నాను. కృతికర్త అయిన శ్రీ మాకినీడి సూర్యభాస్కర్ గారు రచనా రంగాన అన్ని శాఖల్లోను గడించిన ఖ్యాతిని గతంలో పలుమార్లు విన్నాను. వారి స్వీయ కృతమయిన ఈ గ్రంథాన్ని స్వీకరించే భాగ్యం మహాదృష్టంగా భావిస్తున్నాను.

ఈ పుస్తకాన్ని వెలుగులోనికి తీసుకొచ్చేందుకు కృషిచేసిన రాజమండ్రి చిత్రకళా నికేతన్ సభ్యులకు నా ఆశీస్సులు. సదా కళాసంక్షేమాన్ని కాంక్షిస్తూ... లోకా సమస్తాస్సుఖినోభవంతు...

మీ

– మద్దూరి శివానంద కుమార్

ముద్రణ వ్యయాన్ని భరించిన వదాన్యులు...

శ్రీయుతులు **A.V.V.S కామరాజు**
G.M, ONGC(Retired)గారికి

ఆంధ్రప్రదేశ్ ఆర్ట్ అసోసియేషన్స్ గిల్డ్ వారికి

భవాని జ్యూయలర్స్
శ్రీ వరదా ప్రకాశరావు & సన్స్ వారికి
గుండువారి వీధి, రాజమండ్రి

దుద్దుపూడి జ్యూయలర్స్
దుద్దుపూడి ఆదినారాయణ & సన్స్ మరియు
దుద్దుపూడి చినవరాహాలు & సన్స్ వారికి
మెయిన్ రోడ్, రాజమండ్రి

శ్రీ శుభోదయ జ్యూయలర్స్
శ్రీ కాకినాడ వెంకటేశ్వర రావు గారికి
వ్యవస్థాపక ధర్మకర్త, వల్లీ దేవసేన సమేత సుబ్రహ్మణ్యేశ్వర
స్వామివారి దేవస్థానం,
గోదావరి గట్టు, టి.నగర్, రాజమండ్రి
శ్రీ పి. రమేష్
డైరెక్టర్, డ్రీమ్ చిల్డ్రన్స్ ఆర్ట్ అకాడెమీ, విజయవాడ
మరియు
శ్రీయుతులు దేవు గంగాధరాచారి గారికి
శ్రీ వరదా విశ్వనాథం గారికి
శ్రీ తాడోజు హరికృష్ణ గారికి–
తమ తోడ్పాటును అందించిన మీ సహృదయతకు వినమ్ర పూర్వక కృతజ్ఞతాక్షరాలను సమర్పించు కుంటున్నాము.



విషయ సూచిక

Estd. 1992 | Rg.No. 20/1725, 1993

RAJAHMUNDRY CHITRA KALANIKETAN

వ్యవస్థాపక కార్యదర్శి

టేకి మృత్యుంజయ రావు BFA



చిత్రకారులు
యూనివర్సిటీ బంగారు పతక విజేత
కేంద్రీయ విద్యాలయ చిత్రకళ అధ్యాపకులు

కార్యదర్శి తొలి పలుకులు...

"వన్నె చెరగని గని - దామెర్ల చిత్రకళా నిధి"

రాజమండ్రి చిత్రకళా నికేతన్ 25 సంవత్సరాలు పూర్తి చేసుకుని రజతోత్సవ ముగింపు వేడుకలు జనవరి 26, 27 తేదీల్లో జరుపుకుంటున్న శుభ తరుణం ఇది. ఇందులో భాగంగా 'కళా తపస్వి' దామెర్ల రామారావు గారి స్మృతి చిహ్నంగా వారి విగ్రహాన్ని ఆవిష్కరించుకుని, నిత్యం జనసంచారమున్న గోదావరి తీరాన ఆ నిత్యస్మరణీయుని సదా దర్శించుకునే భాగ్యం కల్పించుకుంటున్నాం. అలాగే రామారావుగారి జీవిత విశేషాలను, రాజమండ్రిలో కాలంతో సమాంతరంగా కొనసాగిన చిత్రకళోద్యమ చరిత్రను తెలిపే 'దామెర్ల కళ–వారసత్వం' అనే గ్రంథంగా శ్రీ మాకినీడి సూర్యభాస్కర్ గారు రచించగా ఆవిష్కరించుకుంటున్నాం. వీరు కవి–చిత్రకారులు, కళావిమర్శకులు, బహు గ్రంథకర్త. దామెర్ల రామారావు గారి జీవిత చరిత్రను 'దామెర్ల–కళావారసత్వం'గా అభివర్ణించి, ఓ రామాయణ కావ్యంలా మలిచిన తీరు ప్రశంసనీయం. రామారావు జీవించి చేసిన పనిని మరణించి ఎలా కొనసాగించారో ఈ పుస్తకం చదివిన మనకు అర్థమవుతుంది. ఆత్మశక్తి అనండి లేదా, సంకల్పబలం అనండి నాడు వారు ఆరంభించి వెళ్ళిన దారుల్లోనే నాటి మన గురువులు, నేటి మా అడుగులు పయనిస్తూనే ఉన్నాయి. ఇది నిరంతర ప్రస్థానం.

రామారావు గారు జె.జె స్కూల్ ఆఫ్ ఆర్టు విద్యార్థిగా, బెంగాలీ శైలి అధ్యయన

కర్తగా, మద్రాసు స్కూల్ ఆఫ్ ఆర్ట్స్ పరిశీలకునిగా తనకు తానుగా తన చిత్రాలకు ఓ నూతన రూపునిచ్చారు. తెలుగు జాతి సంస్కృతి, సాంప్రదాయాలు ఉట్టిపడేలా 'ఆంధ్రశైలి'కి రూపకల్పన చేసారు. వారు జీవించిన కాలం 28 సంవత్సరాలు. విద్యార్థి జీవన అనంతరం పని చేసిన కాలం 3 సంవత్సరాలు. ఇటువంటి రియల్ హీరోస్ జీవితగాథలు నేటి యువతకు ఆదర్శం కావాలి. తెలియ చెప్పాల్సిన బాధ్యత మనందరిది.

విద్యార్థి దశలోనే అంతర్జాతీయ ఖ్యాతి గడించిన దామెర్ల వారి చిత్రాలపై ప్రపంచ స్థాయి పరిశోధన జరగాల్సివుంది. ఇతర భాషల వారికి మన తెలుగువాడి ఘనతను చాటేందుకు కృషి చేయాలి. ఇక్కడ ఇప్పుడున్న పరిస్థితైతే నగర ప్రజలకే తెలియని దుస్థితి. ప్రభుత్వం పర్యాటకశాఖ ద్వారా ఆర్టుగ్యాలరీని ప్రపంచ చిత్రపటంలో ఉంచినట్లయితే, పర్యాటక కేంద్రంగా విలసిల్లుతున్న రాజమహేంద్రవరం ఖ్యాతికి మరోకోణంలో "పూర్వం సాంస్కృతిక రాజధానిగా విలసిల్లుతుండేదని"భవిష్యత్తు తరాలకు తెలియ చెప్పి, పునరుద్ధరించుకునే అవకాశం ఉంది.

ప్రముఖుల జీవిత చరిత్రలను చలన చిత్రా(బయోపిక్)లుగా మలుస్తున్న తరుణంలో నవరసాలు నిండుగా ఉన్న దామెర్ల రామారావుగారి జీవితం ఓ అద్భుత చిత్రం కాగలదు. 25 ఏళ్ళక్రితం 'రిథమ్ ఆఫ్ లైఫ్' అంటూ ప్రఖ్యాత దర్శకులు శ్రీ సంజీవ రెడ్డిగారు నూతన ఉత్సాహంతో, ఉన్నత లక్ష్యాలతో లఘుచిత్రాన్ని నిర్మించగా, అనాడే ఉత్తమ పురస్కారాలను అందుకున్నది. ఇలాంటి పనులు నూతన కళాకారులను తయారు చేయటంలో దోహదపడగలవని నా విశ్వాసము. శ్రీ కల్క్యావతారం గారు, లలితకళా అకాడమి నాడు రూపొందించిన CDలు, పోస్టర్లు మాత్రమే రామారావు చిత్రకళా పరిశోధకులకు, రచయితలకు అందుబాటులో ఉన్నాయి. శ్రీ వరదా వెంకట రత్నంగారు దుమ్ముతాకని విధంగా చూసుకుంటే, వారి శిష్యులు రాజాజీగారు రామారావు చిత్రాలు కంటిముందు శిథిలమవుతుంటే చూస్తూ ఉండలేక చిత్రాలను జాగ్రత్త చేసేందుకు రూపొందించిన రసాయన రహిత ప్రత్యేక విజ్ఞానాన్ని ఆ వయస్సులో పొందివచ్చారంటే వారి జీవితాలను వెచ్చించేంత విలువైన చిత్రాలు వారివని అర్థమవుతుంది.

దామెర్ల ధర్మపత్ని సత్యవాణి గారు జీవిత సర్వస్వంగా, పరమావధిగా భావించి ఎంతో అపురూపంగా చూసుకున్న దామెర్ల కళాసంపదను, వారసత్వ ఆస్థిగావచ్చిన ప్రాంగణాన్ని ఆంధ్రజాతి కళావికాసానికి అంకితమిచ్చారు. నాటివారు అడుగడునా త్యాగాలే చేసారు. వారి నమ్మకాన్ని వమ్ముకానివ్వకుండా ప్రభుత్వం, ప్రజలు వ్యవహరించాల్సి ఉంది. ఇలా చేసినప్పుడే మన నిబద్ధత, జాతి సంస్కృతి, సంస్కారం

ప్రపంచానికి, భావితరాలకు ప్రకటితమవుతాయి!

ఆచార్యులు వరదా వెంకట రత్నం, రాజాజీ గార్లు ఆ తరువాతి కాలంలో వచ్చిన అంతటి కళా ప్రాభవాన్ని పొంది ఉన్నప్పటికీ, కోల్పోయిన మిత్రుని జ్ఞాపకాలను నిలబెట్టేందుకుగాను ఎన్నోత్యాగాలు చేసారు. తమ గురువు గారయిన వరదా గారి త్యాగాన్ని కొనసాగించటంలో రాజాజీ గారు తమ అస్థిత్వాన్నే వదులుకున్న మహానుభావులు. ఇటువంటి త్యాగధనులను కన్న భూమికి మనం వారసులమని గర్విద్దాం! వారి త్యాగాలే జగతికి చాటుదాం!!

నాలాంటి కళాకారులెందరో పురుడుపోసుకున్న దామెర్ల రామారావు స్కూల్ ఆఫ్ ఆర్టు నేడు ఆనవాలుకైనా మిగలలేదు. ఏనాటికైనా రాజమహేంద్రవరంలో పూర్వుల ఆశయాలకు జవాబుగా ఇక్కడ లలిత కళల కళాశాల స్థాపన జరగాలి. రామారావుకు సమకాలికులైన ప్రముఖ చిత్రకారులు నందలాల్ బోసు, వెంకటప్పవంటి వారి చిత్రాలను జాతీయ సంపదగా గుర్తించటంవలన వాటిని నేటికీ సజీవంగా చూడగలుగుతున్నాం. ఆ రోజు మన దామెర్ల చిత్రాలకూ రావాలి.

అంతర్జాతీయ గుర్తింపు సాధించి, కళతో అనంత సంపదలను సొంతానికి సంపాదించుకోగలిగేంత ప్రతిభ చేతుల్లో ఉంచుకుని, తాను నమ్మిన సిద్ధాంతానికై ఆంధ్రస్కూల్ ఆఫ్ ఆర్టును స్థాపించి, ఆరోగ్యాన్ని లెక్కచేయక, ఆయుషును ఫణంగా పెట్టిన ఆ అమరుని విగ్రహాన్ని గోదావరమ్మ గట్టున మనం నిలుపుకుంటున్న శుభ తరుణంలో, వారి కళా వైభవ ప్రస్థానాన్ని చాటే పుస్తకావిష్కరణ మహోత్సవంలో నా ఆకాంక్షను ప్రకటిస్తున్నాను. “ఆ మహానుభావుని శిలా విగ్రహాన్ని మన నూతన రాజధాని ఆయిన అమరావతిలో ఏర్పాటు చేయాలి. ప్రతి యేటా దామెర్ల రామారావు జయంతిని ప్రభుత్వం ‘ఆంధ్ర చిత్రకళా దినోత్సవం’గా జరపాలి”.

గురువుల లక్ష్య సాధనకే రాజమండ్రి చిత్రకళానికేతన్ స్థాపించబడింది. ఎందరో ప్రముఖులను సన్మానించుకుని, చిత్రప్రదర్శనలను, కార్యశాలలను నిర్వహించి కళాక్షేత్రంలో ఇన్నాళ్ళు చైతన్యాన్ని నింపింది. ఏటేటికీ లక్ష్యాలు పెరుగుతున్నాయి కాని, అనుకున్నంత మార్పు రావటం లేదు. మనకున్న పరిథి అల్పం. పాతికేళ్ళుగా అదే ప్రారంభస్ఫూర్తితో సంస్థను నేటికీ సజీవంగా కొనసాగేలా వెన్నుదన్నుగా నిలిచి నడిపిస్తున్న దక్షుడు మా అధ్యక్షులు శ్రీ మద్దూరి శివానంద కుమార్ గారు. వారి కంటే ఇంకెవ్వరు అర్హులు ఈ గ్రంథాన్ని స్వీకరించేందుకు! సంస్థ ఏది కోరినా వెంటనే ఆమోదాన్ని తెలిపే వారి సహజ నైజానికి ధన్యవాదములు.

ముద్రణ వ్యయాన్ని భరించిన వదాన్యులు శ్రీయుతులు A.V.V.S కామరాజు

G.M, ONGC(Retired), శ్రీ వరదా మురళి, శ్రీదుద్దుపూడి వరాహాలు, శ్రీ కాకినాడ వెంకటేశ్వర రావు గారు, శ్రీయుతులు దేవు గంగాధరాచారి గారు, శ్రీ వరదా విశ్వనాథం గారు మరియు అంధ్రప్రదేశ్ ఆర్ట్ ఆసోసియేషన్స్ గిల్డ్ తమ తోడ్పాటును అందించినందుకు వారికి హృదయపూర్వక కృతజ్ఞతలు, అక్షర నమస్సులు తెలియచేసుకుంటున్నాను.

ఈ గ్రంథాన్ని ఎంతో అద్భుతంగా, సమగ్రంగా రచించి రాజమండ్రి చిత్రకళా నికేతన్ సంస్థాధ్యక్షులకు కానుకగా ఇచ్చిన శ్రీ మాకినీడి సూర్యభాస్కర్ గారు కళామతల్లి ఋణం తీర్చుకున్నారు. వారి కర్తవ్య నిర్వహణ, కృషి అజరామరంగా నిలుస్తాయి. ఈ పుస్తక స్వీకర్త శ్రీయుతులు మద్దూరి శివానంద కుమార్ గారి ప్రాభవం మరింతగా తోడై రాజమహేంద్రి ఖ్యాతి నేల నలుచెరగులా వ్యాపించగలదని నా ప్రగాఢ నమ్మకము.

ఈ పుస్తక ముద్రణలో సాంకేతిక సహకారాన్నందించిన మిత్రుడు, ప్రముఖ చిత్రకారుడు శ్రీ ఆత్మకూరు రామకృష్ణకు మరియు ప్రచురింపజేసిన శ్రీ మాదేటి రవి ప్రకాశ్ గారికీ హృదయపూర్వక కృతజ్ఞతలు. నా కుటుంబ సభ్యులకు, తలపెట్టే ప్రతి కార్యానికీ సహాయ సహకారాలు అందిస్తున్న రాజమండ్రి చిత్రకళానికేతన్ సభ్యులందరికీ, ప్రత్యేకించి శ్రీ పి.ఎస్. ఆచారి, శ్రీ ఎన్.ఎస్. శర్మ, శ్రీ తారా నగేష్, శ్రీమతి ఎన్. పద్మ గార్లకు నా నమోవాకాలు. కీ.శే॥ గంథం నాగసుబ్రహ్మణ్యం (సమాచారం), మేడపాటి సీతారామాచార్యుల గార్లకు కూడ నా అంజలి. ఈ పుస్తకం రూపు దిద్దుకోవటంలో సహకరించిన ప్రతి ఒక్కరికి పేరు పేరునా ధన్యవాదములు.

సంస్థ కార్యదర్శిగా నాదో విన్నపం: ఇలాంటి ఎన్నో పుస్తకాలు తేవాలన్నది మా ప్రయత్నం. అక్షరానికి క్షరంలేదు. అక్షరాల సమూహం పుస్తకం. పుస్తకం విజ్ఞానుల మస్తకం. మస్తకం మథించినప్పుడే మార్పు సాధ్యం. మార్పు వచ్చిననాడే పురోభివృద్ధి. అభివృద్ధి జరిగినప్పుడే అంతటా వెల్లివిరుస్తాయి శాంతి సౌభాగ్యాలు. దీన్నే మనం ఆశిద్దాం, సాధిద్దాం. ఇటువంటి పుస్తకాలను చదవండి, చదివించండి.

గుంటూరు పట్టణం — **టేకి మృత్యుంజయ రావు**

12-01-2019

T. Mruthyunjaya Rao BFA
Rajamahendra Pura Mandiram (Town Hall)
Rajamahendravaram - 533 101 (A.P)
Cell: 94908 77211 E Mail: tekimrao@gmail.com



ఆత్మకూరు రామకృష్ణ

ATMAKURU
Ramakrishna

J N T U Gold Medalist, Master of Fine Arts [B H U], World Records Winner

రంగుల రాయునికి
రసరమ్య కావ్య నీరాజనం

అందరూ విన్న విషయాలే... అందరూ కన్న విషయాలే... కానీ, గతానికి తిరిగిన మలుపులకు... నిజాన్ని కథలు కథలుగా వింటూ ముక్కున వేలేసుకోవటం తప్ప మరో మార్గం తోచదు జనావళికి. అందుకే అది అయ్యింది చరిత్ర. తర్క వితర్కాలకు అందని ఊహాతీతమైనది. విధి వంచన వాస్తవాలకు అందనిది. అందునా ప్రతిభావంతుల, ప్రభావశాలుర జీవితాలను స్పృశించినప్పుడు...ఇదే జరుగుతుంది. నిస్తేజంగా ఉన్న జాతి యావత్తు ఉలిక్కిపడి నిద్రలేస్తుంది.

శ్రీ మాకినీడి సూర్యభాస్కర్ గారి వంటి బహుముఖ ప్రజ్ఞాశాలి-అపర కళా గాంధర్వ మూర్తి, కీర్తి శరీరుడైన దామెర్ల రామారావు వంటివారి జీవితాన్ని బృహత్తర రచనగా మలిచేందుకు పూనుకున్నప్పుడు అందులోని వైవిధ్యమే వేరుగా ఉంటుంది.

"రచయితగా మూడు పదుల సాహిత్య ప్రస్థానాన్ని అవిశ్రాంతంగా ఉరకలెత్తిస్తున్నవారు మాకినీడి. "రామారావు నుండి రామారావు దాక"అన్న పుస్తకాన్ని వ్రాయగలిగిన వీరికి ఒక్క రామారావు గురించే వ్రాయటం పెద్దవిషయమేమి కాదు" అని అనుకోవటం లోకసహజం. కాని, అందుకు భిన్నం. ఎంత తెలిసిన విషయాన్నయినా సంపూర్ణ అధ్యయనం చేయకుండా ఒక్క అక్షరం కూడ వ్రాయరు. ఇది రచనా వ్యాసంగంపై వారికున్న నిబద్ధతకు

తార్కాణం. చరిత్రకారునికి ఇది ప్రధాన లక్షణం. ఓ నూతన విద్యార్థిలా ఎన్నోపుస్తకాలను తిరగేసి, పెద్దల వ్రాతల నుండి, వారి మాటల నుండి జ్ఞాపకాలను తోడుకొని, సందర్భాలను సన్నివేశాలుగా కూర్చుకొని రసవత్తర కావ్యంగా ఈ పుస్తకాన్ని మలచారు మాకినీడిగారు.

దామెర్ల జీవితం నవరస కావ్యం. చిత్రకారుడు కూడా అయిన రచయిత శ్రీ మాకినీడి సూర్యభాస్కర్ గారి చేతుల్లో రూపొందటం వలన ఇందులో కళకు సంబంధించిన విషయాలను లోతుగా, మరింత విశ్లేషణాత్మకంగా వివరించడమైంది. ఆంధ్ర రాష్ట్రంలో నేడు మనకున్న కళావిమర్శకుల్లో వీరు అగ్రగణ్యులు. ఎంతటి వారయినప్పటికి 'సమకాలీన సాహిత్య, కళా విమర్శలు' చేసినప్పుడు విమర్శను ఎదుర్కోవలసి వుంటుంది సాక్ష్యాలు, ఆధారాలు సజీవంగా ఉంటాయి కాబట్టి. కాని, చరిత్రను పరామర్శ చేసేటప్పుడు ఆత్మసాక్షి పర్యవేక్షణ సాగుతుంటుంది. సొంత ఇజాలను ప్రక్కన పెట్టి అంతఃకరణ శుద్ధితో వ్రాయాల్సి ఉంటుంది. అభిమానాలకు తావు అసలే ఉండదు. ఈ విషయంలో కృతకృత్యులయ్యారు రచయిత.

100 సంవత్సరాల క్రితం చిరుతప్రాయంలోనే చరితార్థతను పొందిన ధన్యజీవి దామెర్ల. అట్టివారి చరిత్రను వ్రాయవలసి వచ్చినప్పుడు నూటపాతికేళ్ళ వెనుకటి కాలమాన పరిస్థితులను అవలోకించందే ఈ కార్యం పూర్తికాదు. నాటి రామారావు అనుభవించిన గోదారి తీర అలల సమీర స్పర్శను, సాయం సంధ్యవేళల్లో చెంపలను నిమిరే లేలేత కిరణ స్పర్శను, నీటిలోన ఈదులాడే చేపపిల్లల సొబగులను నీటిపై తేలుతూ సాగే పడవలపై శ్రమైక్యజీవన సౌందర్య చిహ్నంగా సాగే పట్టపోళ్ళ జీవన రాగాలను, ఏటిగట్టున కదలాడే జనజీవన సంస్కృతీ సంప్రదాయాలను, మమతానురాగాలను ఆస్వాదించిన హృదయం మాత్రమే వ్రాయగలదని మన 'మాకినీడి' కలం నిరూపించుకున్నది.

అప్పట్లో నడుస్తున్న ప్రపంచకళా చైతన్యాన్ని నాటితరం అందుకున్నంత వేగంతో, సంపూర్ణ స్పష్టతతో నేటితరం అర్థం చేసుకోవటంలోను, కొనసాగించటంలోను వెనుకబడ్డదన్న విషయాన్ని రామారావుగారి జీవితాన్ని అవలోకించిన తరువాత స్పష్టంగా మనకు అర్థమౌతుంది. ఇన్ని ఆధునిక మాధ్యమాలున్నా కొనసాగించ లేక పోయామన్నది కంటి ముందున్న నగ్నసత్యం.

రామారావు గారు మరో ముప్పై ఏళ్ళు జీవించి ఉండి ఉంటే ఆంధ్ర

రాష్ట్ర చిత్రకళా చరిత్ర మరోలా ఉండేదనిపిస్తుంది. రాజమహేంద్రవరంవైపు చూసిన ప్రపంచాన్ని కన్ను మరల్చకుండా చేసేసి ఉండేవారు... అన్నది నిర్వివాదమైన విషయంగా దామెర్ల రామారావు గారి భగ్నజీవన సందేశమై నిలిచింది.

ఈ పుస్తకం నిండా కళాపూర్ణుడైన రామరాయుని యువ యువోల్లాస విజయగాథలే నిండి ఉన్నాయి. అవి ఊపందుకుంటున్న క్షణంలో ఓ మేలి మలుపు వద్ద విధి ఆలపించిన విషాదగీతం, మరుక్షణంలో మనలను తాత్త్విక స్పృహలోనికి జారిపోయేలా చేస్తుందీ గాథ! రచయిత ఈ సందర్భాన్ని అంతే సూక్ష్మంగా స్పృశించారు. "మాకినీడి విమర్శనా దృష్టిలో అక్షరాలు కావ్యగౌరవాన్ని పొందుతాయి" అని ఓ కవి ఓ సందర్భంలో అన్నమాటలు గుర్తుకు వస్తాయి. అట్టి పట్టున్న విమర్శకుడు కథను నడిపిస్తున్నప్పుడు... ఆ కథనం ఎలా ఉండబోతుందో అన్న ఉత్సుకత కలగడం సహజం కదా! నూటికి నూరు పాళ్ళు సఫలం అయ్యారు రచయిత. ఇక చిత్రకళ విషయానికివస్తే వారు చూపిన ఉత్సాహం రెట్టింపవుతుంది. మన చేదోయి మధ్య నున్న ఈ పుస్తకమే ఇందుకు సాక్ష్యం. ప్రతి చిత్రకారుడు చదివి స్ఫూర్తిని నింపుకోవాల్సిన పుస్తకం.

చిత్ర వర్ణనకు, చిత్రకళా విమర్శకు రచయితలు వాడే భాష, పరిభాషా విశేషాలను మనం ఈ పుస్తకంలో చూడగలం. ఓ కళా(చిత్ర)కారుని సృజనను మరో కళా(రచనా)కారుడు చూసే దృష్టికోణాన్ని అక్షరబద్ధంచేసి హృదయాన్ని ఎలా వినిపిస్తారో ఈ పుస్తకంలోని పుటపుటా పలుకుతుంది అక్షరమయమై!

జీవితంలో ఎదురైన ఒక్కొక్క సంఘటనను ఒక్కొక్క అపురూప చిత్రంగా దృశ్యమానం చేసిన రామారావు గారి చేతి కుంచె-కళ్యాణ శుభవేళ కన్యకామణి సత్యవాణి గారి తొలిముస్తాబును చూసి 'పెళ్ళికూతురు'గాను, నీళ్లోసుకున్న నాడు 'సీమంతం'గాను, వర్ణాంచితం చేసింది. కృష్ణలీలలు, రాగోదయంలాంటి చిత్రాలను చూసినప్పుడు అందమైన జీవితంలో పండించుకున్న అనుభవాలకు ఆనవాళ్ళుగా ఈ చిత్రాలు నిలుస్తాయి అనిపిస్తుంది. అర్ధాంతరంగా ముగిసిన జీవితం పూర్తిగా అనుభవానికే వచ్చి ఉంటే ఇంకెంతటి దృశ్య కావ్యాలు మన కళ్ళకు విందు చేసేవోకదా! ఆధునిక సంస్కారులకు జీవన పరమార్థాన్నో, నిజ మార్గనిర్దేశాన్నో చేసేవోకదా!! అనిపిస్తుంది. ఈ విషయాలన్నిటినీ రచయిత సవిస్తరంగా తెలిపారు. రామారావు అల్పాయుషత్వ నష్టం తనది కాదు మనది,

మనుష్య జాతిది.

పాశ్చాత్య చిత్రకళా వైభవానికి దీటుగా ప్రాచ్య కళావైభవాన్ని నిలిపి భారతీయ అస్థిత్వాన్ని చాటాలన్న రామారావు గారి తపనను పాఠకులకు అర్థమయ్యేలా చెప్పేందుకు రచయిత అంతే తపనతో ఈ రచనను చేసారు. గతంలో రామారావు గారి గురించి కూ౹ర్డ్ మహాశయుడు వ్రాసినా, ఆచార్య రాజాజీ వ్రాసినా... వాటన్నిటికన్నా భిన్న దృక్కోణాన్ని మాకినీడి సూర్యభాస్కర్ గారు ఎన్నుకున్నారు. తన రచనలో వైవిధ్యాన్ని ఆవిష్కరించేందుకు కవికొండల వెంకటరావు గారు ఓ సందర్భంలో చెప్పిన ఏకవాక్యాన్ని 'పూలమాలలో అంతర్లీనంగా పూలన్నింటిని పెనవేసుకున్న దారంలా' ఈ కథనానికి సంకల్పబలాన్ని ఇచ్చిందంటూ రచయిత నిర్మొహమాటంగా చెప్పుకున్నారు ప్రారంభంలోనే!

"కులములోన ఒక్క గుణవంతుడుండిన

కులము వెలయు వాని గుణము చేత" అన్నాడు వేమన.

వాడు అల్పాయుషుతో జీవించినా వంద వత్సరాల వంశచరిత్రను పరిశోధించే పరిస్థితి కల్పించిన వాడు ఘనుడు, ఘనుడుకాదే అనేలా చేసాడు దామెర్ల రామారావు. మాకినీడి, దామెర్ల వంశవృక్షాన్ని మనకు పరిచయం చేసిన తీరు అమోఘం; చదువుతున్నప్పుడు ఎక్కడో చదివిన విషయం గుర్తుకొస్తుంది– "ఈ భూమిపై ఆత్మ జీవాత్మగా అవతరించేందుకు తన కర్మఫలాలకు అనువైన తల్లిదండ్రులుగా జీవిస్తున్న అత్మలను ఎన్నుకుంటుందట". దివి నుండి భువికి అరుదెంచిన ఓ దివ్యాత్మ ఎన్నుకున్న దామెర్ల వారి కుటుంబ పరిచయం ఎంతో సముచితం కదా మరి! సాధారణంగా రచనాప్రారంభం రామారావు ఎవరికి పుట్టాడు?, ఎప్పుడు పుట్టాడు?, ఎలా పెరిగాడు? అన్న వొరవడిలో సాగుతుందన్న ఊహకు ఆశనిపాతం తప్పదు. రచయిత ఎత్తుగడ భిన్నంగా మొదలై ఆద్యంతము చదివిస్తుంది. అద్భుతం అని తేలుస్తుంది.

"Fine Art is a Fine Business"

ఈ విషయాన్ని ముందుగా అర్థం చేసుకున్నది, అందిపుచ్చుకున్నది పాశ్చాత్య దేశాలు. భారతీయులకు కళలు ఆధ్యాత్మిక (*Eternael*) సంబంధాలు. ఆత్మోన్నతి కారక సాధనాలు. అందుకే కళలన్నీ అంతర్లీనంగా దేవాలయ వ్యవస్థలో మిళితమై ఉంటాయి. అందుకే కళలను దైవదత్తాలని భావించే తత్వం

మన సంస్కృతిలోని భాగం అయింది. ఆత్మచింతన సన్నగిల్లినప్పుడు మానవుడు ఐహిక సుఖాలవేటలో విరామాన్ని కోల్పోతాడు. శాశ్వతానందాన్ని జారవిడుచుకుంటాడు. అందుకే రచయిత వివేకానందుని మాటలను ప్రస్తావిస్తూ పాశ్చాత్యుల భౌతికవాదం, మన ఆధ్యాత్మిక వాదంతో సమన్వయపడి, యువతకు ఆదర్శప్రాయం కావాలన్న గొప్ప సందేశాన్నిచ్చారంటూ, ఆ ఆదర్శాన్ని చిత్రకళా రంగంలో దామెర్ల రామారావుగారు సాధించారని సాధికారకంగా తెలియజెప్పారు.

స్వాతంత్ర్య సమర వేడి తాకని చిత్రకళోద్యమంలోని చిత్రకారుడు రామారావు. కళ కళకోసమే నడిచిన వేళ... లక్ష్యసాధనలో కూలిన యోధుని గాథ. విధిది ప్రతినాయక పాత్ర. అపజయం ఆ వ్యక్తిది కాదు, వ్యవస్థది.


కళావారసత్వం...కళోద్యమం - ఇది తీరనిదాహం. నేటికీ రాజమహేంద్రావనిని పట్టి పీడిస్తున్న ఆరని మంటై జ్వలిస్తూనే ఉంది. రామారావు మరణానంతరం తరాలు మారుతున్నా ఆ వచ్చేతరం ఈ బాధ్యతను తమ భుజస్కంధాలపై వేసుకుంటున్నా నేటికీ గలగలల గోదారిగట్టున ఎడారే మిగిలింది. మోడువారిన కళావారసత్వ వనంలో వసంతం పూయించేందుకు ప్రయత్నించిన గురుపరంపరకు స్థానం లేకుండా చేసింది పాలక విధానం. వందలకొద్ది కళాకారులు పుట్టుకొస్తున్నా వారికి మార్గ నిర్దేశనం కొరవడింది. ఇది జరుగుతున్న చరిత్ర. గడచిన చరిత్రను స్పష్టంగా మాకినీడిగారు విశదపరిచారు ఈ పుస్తకంలో. ఆలకిద్దాం, అవలోకిద్దాం!

తడియారని తూలిక రచిస్తూనే ఉంది. తరిస్తూనే ఉంది ఈ పుణ్యభూమి. ఓ సాంస్కృతిక కేంద్రంగా విలసిల్లిన రాజమహేంద్రి నేటికీ తన ఉనికిని చాటే ప్రయత్నం అదను దొరికినప్పుడల్లా చేస్తూనే ఉంది. చేస్తూనే ఉంటుంది.

'కళాసాహితీ చక్రవర్తి' శ్రీ మాకినీడి 70వ రచనకు ముందుమాట వ్రాసే భాగ్యం దొరకటం చిత్రకళామతల్లి నాకిచ్చిన వరంగా భావిస్తున్నాను. రజతోత్సవ ముగింపు సంబరాలు జరుపుకొను శుభవేళ దామెర్ల రామారావును, ఆ తదనంతరం విచ్చేసిన గురు పరంపర కళావారసత్వంపై పుస్తకాన్ని ముద్రించి చరితార్థతను గాంచిన రాజమండ్రి కళా నికేతన్ ధన్యతనొందింది. శుభాకాంక్షలు తెలుపుకుంటూ...

విజయవాడ — మీ

09-01-2019 — **- ఆత్మకూరు రామకృష్ణ**



ది డేన్సర్

దామెర్ల కళ – వారసత్వం...



ఒక సంఘర్షణ ...
ఒక సమన్వయం
వెరసి ఒక చారిత్రక సందర్భం

ప్రాచ్య సంవిధానంలో రేఖాప్రాధాన్యం ఎక్కువ.

అసలు చిత్రకళ అనేది ప్రాచ్యదేశాల్లోనే కాదు, పాశ్చాత్య దేశాల్లో సైతం రేఖీయంగానే ఆరంభమైంది. చారిత్రకంగా మధ్యమ యుగాలవరకు ప్రపంచ మంతటా అలాగే కొనసాగింది. రేఖలతో చిత్రాలు రచించి, వాటిమధ్య రంగులను పూసే విధానమే అమల్లో ఉండేది.

చిత్రానికి రెండే ఆయతనాలు – పొడవు, వెడల్పు మాత్రమే ఉండేవి. పారిశ్రామిక యుగంలో కలిగిన పునరుజ్జీవనంలో భాగంగానే ఐరోపీయ కళలో వర్ణప్రాధాన్యం పెరిగింది. రంగుల్ని యథేచ్ఛగా మిళితం చేస్తూ పూసే విధానంలో భిన్న వర్ణకాంతుల్ని కలిగిస్తూ వెలుగు నీడల సయ్యాటకు తెర తీసింది, పాశ్చాత్య విధానం. ఫలితం, సమతలంగా ఏకరీతిని ఉండే వర్ణ లేపనం ఎత్తుపల్లాల తారతమ్యం గోచరించే విధంగా మారి చిత్రానికి లోతు అనే మూడో ఆయతనాన్నిచ్చింది. అయితే ప్రాచ్య సంవిధానంలో మూడో ఆయతనం లేదని కాదు. రేఖ తీరునుబట్టి, రేఖాపాతాన్ని బట్టి, ఒకచోట లావుగా, ఒకచోట సన్నగా రేఖను కావలసిన రీతిలో గీసి మూడో ఆయతనాన్ని

సాధించేవాడు ప్రాచ్య కళాకారుడు. రంగుల వెలుగునీడల చిత్రణరీతి వల్ల పాశ్చాత్య చిత్రకళలో వాస్తవికత బాగా పెరిగింది. ప్రాచ్యకళ ఎప్పటిలానే అలానే నిసర్గంగానే ఉండిపోయింది. వాస్తవికతకు దూరంగా నీటి రంగుల మాధ్యంలోనే ప్రాచ్యకళ సాగింది. ఒక్క మాటలో చెప్పాలంటే వాస్తవానుభూతికంటే వ్యంజన అధికంగా ఉండేది ప్రాచ్యకళ అయితే, తైలవర్ణాల మాధ్యంలో పూర్తి వాస్తవికత ఉట్టిపడేలా కృతకమైపోయింది పాశ్చాత్య కళ.

బ్రిటిష్‌వారు భారతదేశాన్ని పూర్తిగా ఆక్రమించేనాటికి భారతీయ చిత్రకళ స్పష్టమైన ప్రాచ్య పాశ్చాత్య ప్రభేదాత్మకంగా చీలిపోయిన పరిస్థితిలో పడిపోయింది.

ఆంధ్ర ప్రాంతపు చిత్రకళకు సంబంధించి విజయనగర రాజ్య పతనం వరకు జరిగిన అభివృద్ధి బ్రిటిష్‌వారి రాకతో ఆగిపోయింది. బ్రిటిష్ రాజ్య వ్యాపన కాలంలో భారతదేశంలోని సామాజిక రాజకీయ ఆర్థిక సాంస్కృతికాదిగా గల అన్ని రంగాలవలెనే కళారంగం కూడ స్తంభించిపోయింది. బ్రిటిష్‌వారు దేశాన్ని పూర్తిగా ఆక్రమించుకుని సుప్రతిష్ఠమయ్యేంత వరకు చిత్రకళకు గ్రహణమే పట్టింది. అంటే, సుప్రతిష్ఠమయ్యాకా బ్రిటిష్‌వారి వల్ల భారతదేశ చిత్రకళ అంతవరకు ఉన్న స్థితినుంచి ఉన్నత స్థితికి చేరిందని కాదు. బ్రిటిష్ రాజ్యం పూర్తిగా వ్యవస్థాపితమయ్యేసరికి భారతదేశంలో అన్ని రంగాలూ ఒకేసారిగా పెద్ద కుదుపుకు గురయ్యాయి. ఈ కుదుపుతో ఎన్నో మార్పులు వచ్చాయి. ఈ మార్పుల్లో మంచివీ ఉన్నాయి, చెడువీ ఉన్నాయి. కళారంగంలో అయితే, ఈ మార్పులు ఒక సంఘర్షణకు దారి తీశాయి.

ఒకపక్క విదేశీ పరిపాలన సాగుతుంటే, మరో పక్క స్వాతంత్ర్యం కోసం స్వదేశీ ఉద్యమం ఆరంభమైంది. నిజానికి ఇదో సంధికాలం. రెండు వైరుధ్యాల సంగమకాలం. ఆధునిక ఆంధ్ర చిత్రకళ వికసనానికి పూర్వ నేపథ్యం ఇదే.

బ్రిటిష్‌వారి పాశ్చాత్య సభ్యతా సంస్కారాలతో పాటు, సంస్కృతీ సంప్రదాయాలు కళారంగంలోకీ ప్రవేశించాయి. చిత్రకళారంగంలో కూడా పాశ్చాత్య విధానం బయలుదేరింది. రాజా రవివర్మ హిందూ దేవతామూర్తులను, చారిత్రక పురుషులను అచ్చమైన మానవ రూపాల్లో అత్యంత స్వాభావికంగా



వాస్తవికత ఉట్టిపడేలా చిత్రించనారంభించారు. చిత్రకళకు సంబంధించి ఈ కాలాన్ని ఒక సంధి యుగంగా భావించాలి.

ఈ సమయంలోనే బ్రిటిష్ ప్రభుత్వం ముంబాయిలో 'సర్ జె.జె. స్కూల్ ఆఫ్ ఆర్ట్స్'ను ప్రారంభించి పూర్తి పాశ్చాత్య రీతుల్లో నడిపింది. ఆ స్కూలు పరిపాలన నుంచీ, చివరికి కళాబోధన వరకూ అంతా పాశ్చాత్యమే. చిత్రకళలో ఆసక్తి కలవారెందరో దేశం నాలుగు మూలలనుంచీ ముంబాయి చేరి జెజె స్కూలులో కళాభ్యసనం చేశారు.

పంతొమ్మిదో శతాబ్ది చివరి దశాబ్దాల్లో భారతజాతి స్వాతంత్ర్యం కోసం పోరాటాన్ని ముమ్మరం చేసింది. సామాన్య ప్రజల్లో సైతం కరడుగట్టిన జాతీయతాభావం పురులు విచ్చుకొంది. బ్రిటిష్ రాజ్యాన్ని వ్యతిరేకించే విధానంలో భాగంగా విదేశీవస్తు బహిష్కరణ, సహాయ నిరాకరణ వంటివి ఆదర్శాలయ్యాయి. పాశ్చాత్య సంస్కృతిపట్ల విరోధమూ, దేశీయమైన సంస్కృతిపట్ల అనురక్తీ అధికం కాజొచ్చాయి.

ఈ తరుణంలో బెంగాలు సాంస్కృతిక రంగంలో నవజాగరణ మొదలైంది. కవులు, చిత్రకారులు భారతీయ సంస్కృతిపట్ల మొగ్గు చూపనారంభించారు. చిత్రకళారంగంలో అవనీంద్రుడు, గగనేంద్రుడు, వంటి వంగ కళాకారులు పాశ్చాత్య శైలిని కాదని భారతీయ శైలిని అనుసరిస్తూ, అజంతా, మొగలాయీ, రాజపుత్ర శైలుల్ని ఆదర్శంగా తీసుకున్నారు. హావెల్ పాశ్యాత్యుడైనా, ఈ విషయంలో మార్గదర్శనం చేసి భౌతికాతీతమైన తన సద్విచక్షణను చూపినందుకు ఆయనను అభినందించి తీరాలి. ఈ నేపథ్యంలో వెలసిన రవీంద్రుని శాంతినికేతన్‌లో ప్రాచ్యశైలీ ఇతివృత్తాలకు ప్రాధాన్యతనిస్తూ, భారతీయాత్మను ప్రతిఫలిస్తూ కళాభ్యసనం జరిగేది.

సమకాలీనంగా ఆంధ్ర ప్రాంతపు చిత్రకళలో ప్రాచ్య పాశ్చాత్య కళాసమన్వయం అద్భుతంగా సాగింది. అప్పట్లో, రంగమేదైనా, ప్రాచ్య పాశ్చాత్య సమన్వయం అనేది ఒక ఆదర్శంగా లక్ష్యంగా ఉండేది. స్వామి వివేకానంద ఈ సమన్వయాన్ని గట్టిగా వాంఛించారు. పాశ్చాత్యుల భౌతికవాదం, మన ఆధ్యాత్మికవాదంతో సమన్వయపడి, యువతకు ఆదర్శప్రాయం కావాలని ఆయన



కలలు కన్నారు.

అయితే కొన్ని చారిత్రక తప్పిదాల వల్ల ఆంధ్ర ప్రాంతంలో ప్రాచ్య పాశ్చాత్య కళాసమన్వయమైతే జరిగిందిగాని, పూర్తి స్థాయిలో భారతీయమైన కళాసంవిధానం యొక్క పరిణామక్రమం ఆగిపోయింది. ఆంధ్ర ప్రాంతమనే కాదు, దేశం మొత్తంగా ప్రతి రంగమూ భారతీయమైన సహజ పరిణామాన్ని పాక్షికంగానే తప్ప పూర్తిస్థాయిలో అందుకోలేకపోయింది. ఫలితంగా వేరే క్రమంలో పరిణమిస్తూ ముందుకు సాగింది.

తమిళనాట నెలకొల్పబడ్డ 'మద్రాసు స్కూల్ ఆఫ్ ఆర్ట్స్' చిత్రకళా రంగంలో ప్రాచ్య పాశ్చాత్య సమన్వయాన్ని మధ్యేమార్గంగా చేపట్టింది. ఇటు ప్రాచ్య శైలి, అటు పాశ్చాత్య శైలి – రెండింటి సమ్మేళనంగా రూపొందింది. ఇటువంటి సమన్వయ భావననుంచే ఆంధ్ర చిత్రకళ ఆధునికతను సాధించగల భావధారను అందుకోగలిగింది.

బందరులో వెలసిన జాతీయ కళాశాల కూడ ఇతోధికంగా ఆధునికాంధ్ర చిత్రకళకు దోహదపడింది. శాంతినికేతన్ తరహాలో భారతీయ శైలి చిత్రణకు అధిక ప్రాధాన్యతనిచ్చింది.

ఈ నేపథ్యంలో దామెర్ల రామారావు కళాదృష్టి ఆంధ్ర చిత్రకళకు ఆధునికతను కూర్చడంలో విజయవంతమైంది. ఈ పరిణామానికి నవ వంగ శైలికి చెందిన శాంతినికేతన్, బందరు జాతీయ కళాశాలలు ఒకవైపు, పాశ్చాత్య శైలికి చెందిన ముంబాయి జె.జె. స్కూల్ మరోవైపు ఆంధ్ర చిత్రకళను విభిన్నంగా వికసింపజేస్తుంటే, మద్రాస్ స్కూల్ ఆఫ్ ఆర్ట్స్ ఈ రెండు సంప్రదాయాలను సమన్వయపరచి ఆధునికాంధ్ర చిత్రకళను ఒక మలుపు తిప్పింది. ఈ మూడు స్కూళ్ళ ప్రభావంతో పాటు, రాజమహేంద్రిలో దామెర్ల స్థాపించిన చిత్రకళాశాల ముఖ్యంగా తన వంతుగా ఆధునికాంధ్ర చిత్రకళ పునరుజ్జీవనానికి దోహదపడి, ఒక ప్రత్యేకతను సంతరింపజేసింది.

ఇదీ సందర్భం. దామెర్ల జీవితం ఈ సందర్భాన్ని దోహదపరచడంలోనే సమాప్తమైంది. అందుకే 'ఆధునికాంధ్ర చిత్రకళా వైతాళికుడు' అయ్యారు దామెర్ల రామారావు.



దామెర్ల వంశం – కుటుంబ నేపథ్యం

గోదావరి ప్రాంతాల్లో ఇప్పుడుంటున్న బ్రాహ్మణు లందరూ ఇంచుమించుగా వలస వచ్చిన పూర్వీకులు గలవారే. చోళరాజులతో పాటు కావేరీతీరం నుండి వలస వచ్చినవారు వావిళ్ళ, చెళ్ళపిళ్ళ, చర్ల, తాతా, పురాణపండ, వేదులాదిగా గల వంశజులు. నేరుగా గోదావరి తీరానికి రాకపోయినా, ముందస్తుగా ఎక్కడో ఒకచోట స్థిరపడి, ఆ తర్వాత గోదావరి ప్రాంతాలకు వచ్చినవారు కొందరు. చర్లవారు బహుశా అలా కావేరీ తీరంనుంచి వచ్చి ప్రస్తుతపు ఖమ్మం జిల్లా చర్లలో విడిది చేసినవారు కావచ్చు.

దామెర్లవారు కూడ అలా వచ్చినవారే. వీరి మొదటి ఆవాస ప్రాంతం ఏదో తెలియదుగానీ, గోదావరి ప్రాంతానికి ఖమ్మం జిల్లా నుంచి వలస వచ్చారు. రామారావుగారి సోదరుడు వీర రాజారావు కుమారుడు నానీ అని పిలువబడే వెంకట రామారావు కథనం ప్రకారం, దామెర్లవారు ఖమ్మం జిల్లాలోని దామెర అనే గ్రామంనుండి గోదావరీ తీరానికి వలస వచ్చారు.

“Our family lore states that one of our ancestors moved from Damera to Rajamahendra varam. He was said to be very religious and believed that he will go to heaven if he dies at a place where a river is an uttaravaahini.” అంటారాయన.


ఆయనకు తెలుసున్నంతవరకు, చరిత్రలో దామెర్లవారి ప్రస్తావన మొదటిసారిగా క్రీ.శ 1600ల్లో వచ్చిందంటారు. చెన్నపట్నంలో ఫోర్ట్ సెయింట్ జార్జి కాని, మరే ఇతర నిర్మాణార్థమో దామెర్ల కులజుడు ఒకాయన బ్రిటిష్‌వారికి కొంత భూమిని దానం ఇచ్చినట్లుగా తెలుస్తుంది. ఆయన మన దామెర్ల కుటుంబానికి చెందినవారో కాదో కూడ తెలియదు. అంతే కాకుండా, ఆయన బ్రహ్మజుడో, చెట్టియారో కూడ తెలియదు. దామెర్ల ఇంటిపేరుతో బ్రాహ్మణులు కాకుండా వేరే కులజులున్నట్లు కూడ తెలుస్తోంది.

“ఖమ్మం నుంచి అశ్వారావుపేట వెళ్ళే మార్గమధ్యంలో ఉంది దామెర గ్రామం” అని చెబుతూ, రాజమండ్రి వద్ద గోదావరి దక్షిణం నుండి ఉత్తరానికి ప్రవహించదని అందరకూ తెలిసిందేనంటూ, బహుశా తమ పూర్వీకుడికి ఎవరో తప్పుగా చెప్పి ఉండవచ్చునని ఊహిస్తున్నారు నానీ.

కాని దామెర గ్రామం ఖమ్మం జిల్లాలో లేనేలేదు. ఆయన ఎలా పొరబడ్డారో ఏమో! దామెర పేరుతో రెండు గ్రామాలు వరంగల్ జిల్లా ఆత్మకూరు మండలంలోను, కరీంనగర్ జిల్లా ఎల్కతుర్తి మండలంలోనూ ఉన్నాయి. అయితే, రాజమండ్రికి ముందు దామెర్లవారికి అమలాపురంతో సంబంధాలుండి ఉండవచ్చు. అమలాపురానికి గోదావరి ఉత్తర దిశలో ఉందన్న విషయం కాదనలేనిది.

రామారావుగారి పినతల్లి కుమారుడు కవికొండల వేంకటరావు. ‘రామారావు కళారాధన’ అనే వ్యాసంలో ఆయన ఏమంటారంటే, “మా మేనమామలు రాణ్మహేంద్రవరానికి అమలాపురం తాలూకావాకలగరువు నుండి వచ్చా”రని. అలాగే దామెర్లవారూ వచ్చి ఉండవచ్చు. ఇదో ఊహ మాత్రమే. తమ పూర్వీకుడి గురించిన సాక్ష్యాధారాలు ఏమీ లేవంటూ, అలా సాక్ష్యాలతో చెప్పదగిన ఆధారం ఐదు తరాల క్రితం ఉన్న తన ముత్తాత సీతారామయ్యగారంటారు నానీ. గట్టి సమాచారంతో చెప్పగల పూర్వీకుడు రామారావు తండ్రి డా॥ వెంకట రమణారావు.





డా॥ వెంకట రమణారావు


ప్రశంసించదగ్గ విషయమేమంటే, ఆయన వైద్యవిద్యను తనకు తానుగా నేర్చుకున్నారు. ఒక భిషగ్వరుని వద్ద ఆయుర్వేదం నేర్చుకున్నారు. ఒక హకీమ్ దగ్గర యునానీ పద్ధతి వైద్యం తెలుసుకున్నారు. ఇక అల్లోపతీని తనకు తానుగా పుస్తకాలు చదివి నేర్చుకున్నారు. ఇప్పటికీ వైద్య విద్యార్థులు చదివే గ్రే రాసిన అనాటమీ గ్రంథాన్ని ఆయన చదివారంటారు నానీ.

ఆయన చేసే వైద్యం గమ్మత్తుగా ఉండేది. జబ్బు త్వరగా తగ్గాలంటే ఏ వైద్య విధానం మంచిదో తనకున్న పరిజ్ఞానంతో నిర్ణయించుకుని అలా మందులు ఇచ్చేవారు. ఒక్కోసారి మూడు విధానాలనూ కలిపి కూడ వైద్యం చేసేవారు. పాములోళ్ళతో ఆయన పరిచయాలు చేసుకునేవారు. మందుల్లో ఉపయోగించడం కోసం కావలసిన పాము విషాన్ని వారిని రప్పించి తీయించేవారు. వీరేశలింగం అనుయాయి.



శ్రీమతి గాడిచర్ల లక్ష్మీ దేవమ్మ

డాక్టరుగారి భార్య అంటే, రామారావు తల్లి శ్రీమతి లక్ష్మీదేవమ్మ, రామయ్య పంతులుగారి కుమార్తె. మాతామహుడి పేరు రెండో అబ్బాయికి పెట్టుకోడం కుటుంబంలో పరిపాటి. ఆ విధంగానే రామయ్య పంతులుగారి పేరును రెండవ కుమారునికి 'రామారావు'గా పెట్టారు. సుమారు 80 వత్సరాలు జీవించి 1915లో రామయ్యపంతులుగారు కాలం చేశారు. ఆజానుబాహువైన వీరినే తన ద్రోణుడి చిత్రానికి దామెర్ల మోడల్ చేసుకున్నారు.




దామెర్ల వెంకటరావు


దామెర్లవారి కుటుంబంలో అప్పట్లో బాగా చదివినవారిగా గౌరవం పొందినవారు ప్రొఫెసర్ దామెర్ల వెంకటరావు. వీరు ఎం.ఏ చేసి ఎల్.టి



(లాంగ్వేజి ట్రైనింగ్) పొందారు. అప్పట్లో బి.ఎడ్., లేదు. రాజమండ్రి ప్రభుత్వ ట్రైనింగ్ కళాశాలలో చరిత్ర ఆచార్యులుగా పనిచేసి, చివరికి 'హెడ్ ఆఫ్ ది డిపార్టుమెంట్'గా పదవీ విరమణ చేశారు. మొదట్లో స్కూల్స్ ఇనస్పెక్టర్‌గా కూడ ఆయన పనిచేశారు. దూర కుగ్రామాలను దర్శించడానికి గుర్రంమీద స్వారీ చేసుకుంటూ వెళ్ళేవారు కాని ఎప్పుడూ డ్యూటీ విస్మరించలేదని ప్రతీతి.

ఈయన ప్రజాభిప్రాయ సేకరణలు చేయడంలో దిట్ట. రాజమండ్రి, కొవ్వూరుల మధ్య రైలు వంతెన వేయడానికి ఖరారైన సమయంలో ప్రజల అభిప్రాయాలు సేకరించి దాన్ని రోడ్ కమ్ రైలు వంతెనగా మార్పించిన సామాజిక కార్యకర్త. దేనినైనా సమభావంతో తీసుకోగల స్థితి ఈయన సొత్తు. నలుగురు పిల్లలు, అమితంగా ప్రేమించిన భార్య చనిపోతే కూడ చలించకుండా నిశ్చల తత్వాన్ని చూపిన ధీరుడు. ఇంతకీ ఈయన ఎవరనుకుంటున్నారు? మన రామారావుగారికి సొంత అన్నగారు. అన్నదమ్ముల్లో అగ్రజులు. ఈయన కూడా స్వయంగా చిత్రకారులు.


దామెర్ల వెంకటరావు


రామారావు


వీర రాజారావు


ప్రబోధ్ చంద్రుడు


కమలారత్నం


సత్యవాణి


కృపాకరం


శకుంతల

దామెర్ల సోదరుడు వీర రాజారావుగారి కుమారుడు, నానీ అని పిలువబడే వెంకట రామారావు, అంతర్జాలంలో తమ కుటుంబ సభ్యుల వివరాలతో పాటు ఛాయాచిత్రాలు కూడ పొందుపరచారు. అక్కడినుండి సేకరించినవే ఈ ఫొటోలు. వారికి కృతజ్ఞతలు – మాకినీడి సూర్య భాస్కర్

రెండవవారు రామారావు. మూడవవారు వీర రాజారావు. నాల్గవవారు ప్రబోధ్ చంద్రుడు. ఈయనకు కూడా చిత్రకళలో అభినివేశముంది.

కోడళ్ళు వరుసగా – కమలారత్నం (వెంకటరావు), సత్యవాణి (రామారావు), కృపాకరం (వీర రాజారావు), శకుంతల (ప్రబోధ్)


డాక్టరుగారి కూతుర్లు, అంటే రామారావుగారి అక్కచెల్లెళ్ళు ఐదుగురు. వరుసగా భాస్కరమ్మ ఆదుర్తి, బుచ్చికృష్ణమ్మ దిగుమర్తి, ఉపనిషద్ దేవి మల్లిమడుగుల, విష్ణుభక్తి దేవి తురగా కాగా ఐదవ కుమార్తె వివరాలు తెలియరాలేదు.

శ్రీమతి భాస్కరమ్మ (16-8-1884/17-8-1977) రాజమండ్రిలోనే పుట్టి, టీచర్‌గా పనిచేసి బాలికోన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయగా రిటైరై రాజమండ్రిలోనే చనిపోయారు. ఈమెది బాల్యవివాహం. పుష్పవతి కాకుండనే భర్త చనిపోయారు. ఆ కష్టంలో పుట్టిల్లే ఆమెకు బాసటైంది. తండ్రి డా॥ రమణారావు ఆమెను చదివించగా, ఆ చదువే ఆమెకు జీవనోపాధి అయింది. ఇరవయ్యో శతాబ్ది తొలి సంవత్సరాల్లో తండ్రి ప్రగతిశీల దృక్పథమూ, తనయ దృఢసంకల్పమూ చాలాచాల అరుదు. అవే ఆమె జీవితానికి ఆలంబనమయ్యాయి. ఈ ఉదంతం ఆ రోజుల్లోనే దామెర్ల వంశపు ప్రగతిశీల దృక్పథాన్ని, ముందు చూపును పట్టిస్తుంది.


రెండవ కుమార్తె శ్రీమతి దిగుమర్తి బుచ్చికృష్ణమ్మ. స్వాతంత్ర్య


భాస్కరమ్మ ఆదుర్తి


బుచ్చికృష్ణమ్మ


ఉపనిషత్ దేవి


విష్ణుభక్తిదేవి





ది.హనుమంతరావు


కోదండ రామస్వామి


సుబ్రహ్మణ్యం

సమరయోధుడు దిగుమర్తి హనుమంతరావుగారిని వివాహమాడారు. దంపతులిద్దరూ స్వాతంత్ర్య సమరం కోసం సంతానాన్ని కూడా వద్దనుకున్నారు. నెల్లూరు జిల్లాలోని పల్లెపాడులో గాంధీజీ సూచనల మేరకు స్థాపించిన ఆశ్రమాన్ని చూసుకుంటూ ఉండేవారిద్దరూ. ఈ ఆశ్రమం అంటే గాంధీజీకి ఎంతో ఇష్టం. 1922నుండి ఈ ఆశ్రమానికి హెూస్టెస్‌గా ఉన్నారు, బుచ్చికృష్ణమ్మ.

1926లో భర్త చనిపోయాకా, బుచ్చికృష్ణమ్మ చిత్రకళ పట్ల ఉన్న ఆసక్తితో రాజమండ్రిలోని రామారావు ఆర్టు స్కూలును చూసుకోవడం కోసం వచ్చేసారు. కస్తూరిబాయి చనిపోయినప్పుడు ఆమె జ్ఞాపకార్థం ప్రారంభింపబడిన ట్రస్టుకు పనిచేయాలనుకున్నారు బుచ్చికృష్ణమ్మ.

ఆంధ్రలో సీతానగరం ప్రధానకేంద్రంగా మొదలైన కస్తూరిబా మెమోరియల్ ట్రస్టుకు మొదటి సంచాలికగా పనిచేశారు. ఆ తరువాత ఖాదీ మరియు గ్రామ పరిశ్రమల బోర్డుకు పనిచేశారు.

బుచ్చికృష్ణమ్మకు చిత్రలేఖనం అంటే ఆసక్తి. రామారావుతో కలిసి బాల్యమంతా బొమ్మలు వేయడంతోనే గడిపారు. చిత్రకళాప్రదర్శనల్లో విరివిగా బహుమతులు సాధించి మంచి చిత్రకారిణిగా పేరు గడించారు.

ఎనిమిదో తరగతితో చదువు మానేసి హిందీ విశారద అయ్యారు. బొబ్బిలి, పెద్దాపురం జమీందార్ల కుమార్తెలకు చిత్రలేఖనం, హిందీ నేర్పారు. ఎన్నో పెన్సిల్ స్కెచ్చులు, నీటిరంగుల చిత్రాలు వేసి, మంచి చిత్రకారిణిగా గుర్తింపు పొందారు. 21-8-1900 నాడు జనించిన ఈమె 2-1-1991న కాలంలో కరిగిపోయారు.

మూడవ, నాల్గవ కుమార్తెలు ఉపనిషత్ దేవి మల్లిమడుగుల, విష్ణుభక్తి దేవి తురగా కాగా ఐదవ కుమార్తె వివరాలు తెలియరాలేదు. అల్లుళ్ళు- దిగుమర్తి హనుమంతరావు (బుచ్చికృష్ణమ్మ), కోదండ రామస్వామి మల్లిమడుగుల (ఉపనిషద్ దేవి), సుబ్రహ్మణ్యం తురగా (విష్ణు భక్తి దేవి).

దామెర్ల కుటుంబానికి కళాబీజాలు తల్లివైపునుంచి వచ్చాయనే చెప్పుకోవాలి. మేనమామ గాడిచర్ల సత్యనారాయణ చిత్రకారుడూ, ఆర్టు టీచరూ. రామారావు, బుచ్చి కృష్ణమ్మలకు చిత్రకళలో తొలిగురువు ఈయనే. ఈయన బహుమతిగా ఇచ్చిన రంగులతోనే రామారావు తన కళాభ్యసనానికి రంగులు



పులిమారు. అంతకు ముందు గోడలమీద మసిబొగ్గుతో బొమ్మలు వేస్తూండేవారు.

"శ్రీ గాడిచర్ల సత్యనారాయణ గారు తన నలభై ఎనిమిదో ఏట నాట్యం ప్రారంభించి అందు ప్రావీణ్యత సంపాదింప యత్నిస్తూ వున్నాడూ అంటే కళపట్టున మా తల్లి వంకవారికున్న పరాకాష్ట ఎట్టిదో ఊహించుకొనుడు" అంటారు కవికొండల వెంకటరావు. మేనమామ కళా నైపుణ్యాన్ని ప్రస్తుతిస్తూ 'అంబుదంబు' అనే ఖండకావ్యంలో కవికొండల చక్కని పద్యం ఒకటి రాశారు.

"జాము ప్రొద్దుండగా గళాశాల విడిచి
గౌతమీ తీరమందున గౌతుకమున
బడవలను బండ్ల జూచుచు నడచుచుండ
వంతెనకు బైని గనబడు పర్వతముల
మేత మేయంగ దిగు నాలపోతనంగ
వెల్ల వన్నెలతో నీవు విశ్రమింప
గాంచితిని నేను, మఱియును గాంచి వ్రాసె
మేలురంగుల పటము నా మేనమామ!" అంటారు కవికొండల.

మేనమామల పోలికలు మేనల్లుళ్ళకు బాగా వస్తాయి. గాడిచర్లవారి చిత్రకళా నైపుణ్యం రామారావుకు సరే, అన్నగారైన వెంకటరావుకు కూడ అమోఘంగా సంక్రమించింది. ఆయన ఫ్రీ హేండులో సిద్ధహస్తుడు. ఆయన నైపుణ్యాన్ని తెలిపే సంఘటన ఒకటుంది.

జూలియస్ సీజర్ నాటకం వేయించడం కోసం కూల్డ్రీదొర వెనుక తెరల చిత్రణ (బ్యాక్ డ్రాప్ పెయింటింగ్) చేయిస్తున్నారు. ఒక చిన్న నమూనా చిత్రాన్నిచ్చి, దాని సహాయంతో వెనుక తెరంతా నిండిపోయేలా చిత్రించమని రామారావుకు ఆదేశించారు. కాని రామారావు అంత పెద్ద కాన్వాసుమీద నిండుగా చిత్రాన్ని గీయడంలో విఫలం అయ్యారు. గమనిస్తూ పక్కనే ఉన్న వెంకట్రావు టకటకా ఆ చిత్రం స్కెచ్‌ను వెనుకతెర మీద గీశారు, ఎంతో అలవోకగా, మరెంతో సునాయాసంగా! కూల్డ్రీ, రామారావులు విస్తుపోయి చూస్తూ ఉండిపోయారు. ఆ సంఘటన గురించి చెబుతూ కూల్డ్రీ, 'విథిన్ నో టైమ్!, వెంకట్రావు ఆ చిత్రంతో వెనుక తెరను నింపేశా"రని అభివర్ణించారు. అలాంటిది వెంకటరావుగారి




చిత్రకళాభినివేశం!

దామెర్ల సోదరి శ్రీమతి బుచ్చికృష్ణమ్మ, భార్య శ్రీమతి సత్యవాణులు పేరు పొందిన చిత్రకళా మణిదీపాలు.

దామెర్ల వంశానికి పారంపర్యంగా అబ్బిన చిత్రకళా నైపుణ్యాన్ని విశదపరుస్తూ రామారావు జీవితాన్ని ఒకే ఒక వాక్యంలో చెప్పారు కవికొండల వెంకటరావు…"వంశ చిహ్నమైన యీ లలిత కళకు ఆంధ్రత్వం ఆపాదించడ" మంటూ. నిజంగా రామారావు జీవితం మొత్తంలోనే ఇదెంతో మేలైనది, కీలకమైనదీ.

మేలైన ఈ తీరును ఆవిష్కరించడానికే మిగిలిన పుటలను వినియోగిస్తాను. 'దామెర్ల కళ – వారసత్వం' అనే ఈ పొత్తాన్ని రాయడానికి ఇదే నాకు సంకల్పమైంది.



రచయిత గీసిన
దామెర్ల రేఖాచిత్రం

రామారావు మేనమామ గాడిచర్లవారి పేరు రెండు రకాలుగా సూచించబడింది. కొందరు రామ్మూర్తి అని రాస్తే కవికొండల వేంకటరావు తన వ్యాసంలో సత్యనారాయణగా పేర్కొన్నారు. నేను కవికొండలవారిదే ప్రామాణికంగా భావించాను. ఎందుకంటే గాడిచర్ల వీరికీ మేనమామే. లేకపోతే రామ్మూర్తి, సత్యనారాయణలనే ఇద్దరు మేనమామలున్నారో తెలియదు

– మాకినీడి



రామారావు బాల్యమూ – కళాసక్తి

"వేదంలా ఘోషించే గోదావరి అమరధామంలా శోభిల్లే రాజమహేంద్రి" శతాబ్దాల చరిత కలిగిన రాజమహేంద్ర పురం అనాదిగా కళలకు కాణాచి. ప్రాచీన యుగంలో తొలి తెలుగు ఇతిహాస రచన ఇక్కడే జరిగింది. ఆధునిక యుగంలోనూ తొలి తెలుగు నవల వంటి కొన్ని ప్రక్రియలు ఇక్కడనే పురుడు పోసుకున్నాయి.

ఇటువంటి రాజమండ్రిలో వంకాయలవారి వీథిలోని దామెర్ల వారింట వెంకటరమణారావు, లక్ష్మీ దేవమ్మ దంపతులకు 1897 మార్చి 8న రెండవ కుమారునిగా రామారావు జన్మించారు. తల్లిదండ్రుల ఇరువైపుల బంధువులూ కళాసంప్రదాయం కలవారే; ముఖ్యంగా తల్లివైపు. కడసారపు మామయ్య గాడిచర్ల సత్యనారాయణ చిత్రకారుడే కాక చిత్రకళ నేర్పే ఉపాధ్యాయుడుగా కూడ పనిచేస్తుండేవారు. అందువల్ల చిత్రకళను ఏ విధంగా పిల్లలకు బోధించాలో నేర్పాలో ఆయనకు బాగా తెలిసిన విషయం. ఇకనేం,బొమ్మలు

వేయడం ఇష్టపడే చిన్నారి రామారావును ఆయన బాగా ఆకర్షించారు. అన్ని వేళలా ఆయనతో కలిసిమెలిసి ఉండడంవల్ల చిన్నతనంనుంచే చిత్రకళ పట్ల అమితాసక్తి కలిగింది. ఆరేళ్ళ వయసునుండే గోడమీద బొగ్గుతో బొమ్మలు వేస్తూండేవారు. మేనమామ నీటిరంగుల్ని బహుమతిగా ఇచ్చారొకసారి. అప్పట్నించీ కాగితంమీద రంగులతో చిత్రాలు వేయడం ఆరంభించారు. పదేళ్ళ వయసు వచ్చేసరికి చక్కని ప్రకృతి చిత్రాలను అలవోకగా వేయగలనేర్పు సాధించారు రామారావు. రమణీయమైన దృశ్యాలు అందరి అభినందనలకూ పాత్రమయ్యేవి. ఆ విధంగా సొంత మేనమామే రామారావుకు తొట్టతొలి గురువయ్యారు.

చిత్రకళమీది ఆసక్తితో చదువుపై శ్రద్ధ పెట్టలేకపోయేవారు రామారావు. బడికి వెళ్ళాలంటే అనిష్టం. కనుక బద్ధకం. అదే చేలగట్లమ్మటో, గోదారి గట్టుమీదో అయితే గంటలకు గంటలే సునాయాసంగా గడిపేసేవారు. ప్రకృతిని చూస్తూ తన్మయత్వం చెంది, ఆ అందాలను అప్పటికప్పుడే స్కెచ్చులుగా రూపొందించి భద్రపరచుకునేవారు. లాంచీలో తిరుగుతూ లయమయమైన గోదావరి ప్రవాహపుగతిని కాగితంమీదికి మళ్ళించేవారు.

మంచి విద్యార్థి కాని రామారావు, కుటుంబ ద్రవ్యాన్ని బొమ్మలు గీయడానికి ఖర్చు పెట్టేసేవారు. ఇంకొకరైతే ఏమోకాని, తండ్రి రమణారావు ఎప్పుడూ ఏమీ అనలేదు. కానైతే చదువును కూడ అశ్రద్ధ చేయవద్దని మందలిస్తూండేవారు. అన్నగారు చక్కగా చదువుకుంటుంటే, తమ్ముడు కూడ చదువుకుంటే బాగుంటుందని ఆయన ఉద్దేశం. కాని రామారావుకు అదేమీ పట్టేది కాదు. అయితే, అతనిలోని దాగిన ప్రతిభని గుర్తించి, అతని దారికి అతన్ని వదిలేసారు చివరికి తండ్రిగారు.

ఇరవయ్యో శతాబ్ది తొలి సంవత్సరాల్లో రాజమండ్రి సాంఘికంగా, ఆర్థికంగా, రాజకీయంగా, సాంస్కృతికంగా ముఖ్య కేంద్రమైంది. డ్రామా కంపెనీలకు కేంద్రస్థానమైంది. నాటకం సర్వసాధారణమైన ప్రజారంజక వినోదంగా మారింది. అసలు నాటకాలతో పాటు డబ్ చేసిన ఆంగ్ల నాటకాలు కూడ బాగా ప్రదర్శింపబడేవి. ప్రదర్శనను ఆకర్షవంతం చేయడానికి వెనుకతెర మీద రంగురంగుల ఆకర్షణీయమైన చిత్రాలను సెట్టింగులుగా ఉపయోగించడం (బ్యాక్‌డ్రాప్ పెయింటింగ్) అప్పుడప్పుడే మొదలౌతోంది. మనదేశంలోనూ చిత్రకళ ఔపయోగిక కళగా, వ్యాపార కళగా మారనారంభించింది.





- ఏ.ఎస్. రామ్

ప్రసిద్ధ రంగస్థల నటుడు,ఒక నాటక సంస్థకు యజమాని ధరణిప్రగడ సూరయ్య. బెంగుళూరులో స్థిరపడ్డ ఏ.ఎస్. రామ్‌ను నెలకు 150 రూపాయల జీతం, 400 రూపాయల అడ్వాన్స్‌తో ఒప్పించి రాజమండ్రి తీసుకువచ్చారు. వెనుక తెర (బ్యాగ్రౌండు) చిత్రాలను వేయడంలో రామ్, ఆయనకాయనే సాటి.ఆ రంగంలో 'నంబర్ వన్'గా పేరు గాంచారు ఏ. శ్రీరాములు నాయుడు. ఈయన నెల్లూరు మండలంనుంచి వచ్చినవారు. మద్రాస్ ఆర్ట్స్ స్కూలునుంచి చిత్రకారుడైనవారు. బొంబాయి వెళ్ళి నాటక తెరలు చిత్రించడంలో ప్రసిద్ధుడైన ఖాదర్ బక్ష్ శిష్యరికం చేసి, ఆ కళలో ప్రావీణ్యం పొందారు.

రామ్ పనితనానికి పరీక్ష పెడుతూ, ఆకాశమంత నాలుగు కాన్వాసుల్ని రంగు చేయించారు సూరయ్య. ఊర్లోని నాలుగు ప్రధాన కూడళ్ళలో వాటిని అమర్చారు. అంత పెద్ద చిత్రాల్ని చూడడం ప్రజలకదే తొలిసారి. తండోపతండాలుగా వచ్చి చూసారు. చుట్టుపక్కల ఊర్లనుంచి ఆర్టిస్టులు కూడ వచ్చి చూసి వెళ్ళారు. నాటక సంఘాలవారు ఊపిరి పీల్చుకున్నారు. హిందూ థియేట్రికల్ కంపెనీ యజయాని కృత్తివెంటి నాగేశ్వరరావు పంతులు దగ్గర నాటకాల వెనుక తెరల్ని చిత్రించడమే ఏ.ఎస్. రామ్‌కు శాశ్వత ఉద్యోగమైంది.

ఆ రోజుల్లో రాజమండ్రి పిల్లగాళ్ళను చిత్రకళ ఆకర్షించడం వెనుక వెనుకతెరల చిత్రకారుడి ప్రభావం చాల ఉంది. అటువంటి పిల్లల్నందర్నీ చేరదీసి రామ్ వారిచేత వెనుకతెరల చిత్రణలో సాయం పొందేవారు. కుంచె ఇచ్చి రంగులోముంచి తెరమీద పామమనడమే పిల్లలకు ఆనందంగా ఉండేది. దానికితోడు రామ్, పాటలుపాడుతూ లయబద్ధంగా అడుగులేస్తూ పిల్లల్ని బాగా ఆకర్షించేవారు. ఆయనలా గెంతులేస్తూ, పాటలు పాడుతూ బొమ్మలు వేయడం కలలా అనిపించేది పిల్లగాళ్ళకు.

రామ్ చిత్రాలు పెద్దలకు చర్చనీయాంశమయ్యేవి. అతను వేసే చిత్రాలు ఛాయాచిత్ర వాస్తవికతతో (ఫొటో రియలిజం) ఉండేవి. అవి అసలు కళే కాదని

అభిప్రాయపడేవారు ఆనాటి మేధావులు. కవికొండలవారి కొన్ని వాక్యాలు ఈ అభిప్రాయానికి అద్దం పడతాయి. “...ఆ కాలంలో ఒకానొక వ్యక్తి – పేరెందుకు లేండి, తాను జనరంజక నటుడవడమే కాకుండా మనోరంజకంగా నాటకపు తెరలు తయారుచేస్తూ వుండేవాడు– చింతామణీ నాటకశాలలో అనుకుంటాను, హాస్యరసమైన పాటలుకూడా పాడుతూ వుండేవాడు, నాకూ బాగా జ్ఞాపకం. ‘లోటా’ అని ఒక టుమ్రీ విసరి గెంతుతూ దేకుతూ ఓ రాత్రి కడుపుబ్బ నవ్వించాడు. తాను చేసిన రంగుతెరల రంగస్థలం మీద ఆ వ్యక్తి నిలబడి సొంత నటనాకౌశల్యము చూపిస్తూ వుంటే పిల్లకాయల్లో అనేక మందికి ఆ పోకడగా కుంచె ప్రాముదామని, ఆ సోకుగా రాగం విసురుదామని యూహలు పుట్టేవి...”

దేశీయ విద్యాలయంలో చిత్రకళ పట్ల ఆసక్తి ఉన్న పిల్లలకు రామ్ ఛాయాచిత్ర వాస్తవికతలో తర్ఫీదిచ్చారు. ఆ విద్యాలయంలో చిత్రకళాధ్యాపకులు గాడిచర్ల రామ్మూర్తి, ఈరంకి వెంకటశాస్త్రులు కూడ అదే పద్ధతిలో బొమ్మలు వేయడాన్ని బోధించేవారు. ఆ విధంగా ఫొటోలకు నకళ్ళు తీయడమే చిత్రకళ అనే పరిస్థితి దాపురించింది. రామారావు, వరదా వెంకటరత్నం, ఎస్.ఎన్. చామకూర్, సి.బి. రావు, వి.వి. భగీరథి, దాసరి అచ్చిరాజు, అతని సోదరుడు దాసరి రంగయ్య– వీరంతా రామ్‌కు వెనుక తెరలు చిత్రించడంలో సహాయపడేవారు. ఛాయాచిత్ర వాస్తవికతకు చెందిన మౌలిక విషయాల బోధనే తప్ప పిల్లల సృజనను పట్టించుకోలేదు రామ్. వీరంతా కేవలం కాపీయిస్టులుగా మిగిలిపోయారు. అయితే ఈ తర్ఫీదు– రేఖల, రంగుల, వివిధ మాధ్యమాల అవగాహనను బాగా కలిగించింది. ఎందరో యువకుల్లో కళాభినివేశాన్ని, తృష్ణను పెంపొందించారు రామ్. అయితే ఈ ముగ్గురు ఉపాధ్యాయులూ పిల్లలకు చిత్రకళపట్ల ఆసక్తిని పెంచి, దాన్ని వృత్తిగా స్వీకరించేందుకు సన్నద్ధులను చేశారు.

రామారావుకు పది, పదకొండేళ్ళ ప్రాయం వచ్చేనాటికి ఊర్లో పరిస్థితి ఇదీ. చిత్రకళంటే ఎంతో ఆసక్తి ఉన్న రామారావు, రామ్‌కు ఆకర్షితుడు కాకుండా ఉండగలరా? ఆకర్షితులయ్యారు. ఆ ఆకర్షణలో పడి ఛాయాచిత్ర వాస్తవికతలో కొట్టుకుపోయారు. చిన్నవయసు, ఏం తెలుస్తుంది? అదే కళ అనుకున్నారు.

అయినా ఆయన చిత్రాల్లో వింత ఆకర్షణేదో నెలవై ఉండేది. కొండలు కోనలు, చెట్లు గట్లు, పుట్టలు మెట్టలు తిరుగుతూ ఎన్నో బొమ్మలు ప్రకృతికి నకళ్ళుగా చిత్రించేవారు. రామారావుకు తోడు సోదరి బుచ్చికృష్ణమ్మ. బొమ్మారు



కట్టమీదకు పోయి, అక్కడి ప్రకృతి దృశ్యాలను పోటీపడి మరీ బొమ్మలు కట్టేవారిద్దరూ. కలిసి తిరుగుతూ, గోదావరి అందాలకు పరవశులై జమిలిగా చిత్రించేవారు.

రామారావు ప్రకృతి పారవశ్యాన్ని ప్రత్యక్షంగా గమనించిన బాపిరాజు, "రాము ఆనందం పట్టపగ్గాలు లేవు. కాని అతడు ఆనందపూర్ణుడైనప్పుడు సంచలిత రహిత మునీశ్వరునివలె అయిపోతా"దన్నారు. ప్రకృతిని అంతగా ప్రేమించే మనిషి కళాకారుడు కాక ఏమౌతాడు?

రామ్ అవసరార్థం అతనివద్ద శిక్షణ పొందినవారు, వారి కుటుంబ ఆర్థిక పరిస్థితిని బట్టి తరవాతి జీవితాన్ని కొనసాగించారు. పైకి చదువుకోలేని దాసరి అచ్చిరాజు, రంగయ్య, అమజాల రామమోహన్ వెనుక తెరల చిత్రకారులుగా స్థిరపడ్డారు. ఆర్థికంగా వెసులుబాటున్న క్రియాశీలురు మాత్రం చిత్రకళను ఇంకా నేర్చుకోవాలన్న తపన కనబరచారు. అటువంటి తరుణంలో వారికోసమే అన్నట్టుగా కూల్డ్రీ రాజమండ్రి వచ్చారు.


Damerla Rama Rao sketched by his teacher Oswald Couldrey

కూల్డ్రీ రచించిన రామారావు మూర్తి చిత్రం (స్కెచ్)



ఆస్వాల్డ్ జెన్నింగ్స్ కూడ్లీ (1882–1958)



ముంబాయికి ముందు కళాభ్యసనం

1909లో ఇండియన్ సివిల్ సర్వీసులకు ఎంపికైన ఆస్వాల్డ్ జెన్నింగ్స్ కూజ్లీ (1882–1958) విశాఖ డివిజన్ విద్యాశాఖాధికారిగా వచ్చారు. రాజమండ్రి ఆర్ట్స్ కళాశాలకు నాలుగో ప్రిన్సిపాల్‌గా (1909–1919) చేశారు. చేరేటప్పటికి ఆయన వయసు 27 సంవత్సరాలు. ఆయన స్వయానా చిత్రకారుడు, నటుడు, కవి, రచయిత,గాయకుడు. కావడంవల్ల ఆనాటి రాజమండ్రి కళాసాంస్కృతిక రంగాన్ని బాగా ప్రభావితం చేశారు.

స్వయంగా చిత్రకారుడేమో, కూజ్లీ భారతీయ చిత్రకళ పట్ల ఆసక్తి కనబరచి, అధ్యయనం చేశారు. కళాకౌశలం మెండుగా ఉందంటూ, అయితే, ఈ కౌశలం కేవలం భారతదేశానికి మాత్రమే చెందినదిగా భావించారు. అది ప్రపంచ కళతో పోల్చదగినది కాదన్నారు. యూరపీయ కళాసౌందర్య తత్త్వాలకు భారతీయ చిత్రకళ ఎంతో దూరమని అభిప్రాయపడ్డారు. ఒక రకంగా దీన్ని పాలకదృక్పథంగా భావించవచ్చు. ప్రపంచ కళాస్థాయికి భారతీయ చిత్రకళ ఎదగవలసి ఉందన్నదే ఆయన అభిప్రాయం. ప్రాచీన

భారతీయ చిత్రకళ సృజనశీలకంగాను, సంవిధాన పరంగానూ గొప్పదనేవారు. ప్రాచీన కాలంలోని భారతీయ శిల్పులు అత్యుత్తమ కళాకారులంటూనే, ఈ 19, 20 శతాబ్దాల భారతీయ కళాకారుడు ప్రపంచ కళతో పోటీ పడాలంటే తప్పనిసరిగా మారాలని వాంఛించారు. తన అభిప్రాయానికి తగ్గట్టుగా పాశ్చాత్య కళ మౌలిక అంశాలపట్ల అవగాహన కూర్చి, రాజమండ్రి కళాసక్తులైన కుర్రకారుని త్రిమితీయ ప్రకృతి చిత్రణలోకి మళ్ళించారు. కాని ఎన్నో మంచి విషయాలు కూడ వారికి బోధించారు కూల్డ్రీ. వాటి ప్రభావం రామారావుమీద బాగా సోకింది.

రామారావు సోదరుడు వెంకటరావు కూల్డ్రీవద్ద చదువుకుని, ఆ తర్వాత కళాశాలలో ట్యూటరయ్యారు. ఆయన రామారావును కూల్డ్రీకి పరిచయం చేయడానికి తీసుకెళ్ళారు. అప్పటివరకు వేసిన రామారావు చిత్రాలే అతణ్ణి కూల్డ్రీకి గొప్పగా పరిచయం చేశాయి. ఆ బాలకుడి చిత్రకళా కౌశలానికి ఉబ్బి తబ్బిబ్బయ్యారు కూల్డ్రీ. ఆనాటినుంచీ రామారావు కూల్డ్రీకి అత్యంత ప్రియమైన శిష్యుడు. నిజానికి రామారావు ఆయనవద్ద చదువుకున్నదే లేదు.

1909 నుంచి 1919 వరకు పదేళ్ళు కూల్డ్రీ రాజమండ్రి కళా సాంస్కృతిక రంగాన్ని ఎంతో ప్రభావితం చేశారు. వేరే మాటల్లో చెప్పాలంటే, తొమ్మిదేళ్ళు ఆయన రామారావుకు గురుత్వం వహించి తీర్చిదిద్దారు. ముఖ్యంగా చిత్రకళ పునరుజ్జీవన కర్తలుగా దామెర్ల రామారావును, అడవి బాపిరాజును మలచింది కూల్డ్రీయే. కళావిశిష్ట మర్మాలను విప్పిచెప్పి వారికి సమకాలీన కళను ఆకళింపు జేశారు. వీరికోసమే అన్నట్టుగా ఆయన రాజమండ్రిలో ఒక చిత్రకళాభ్యసనశాలను నెలకొల్పారు.

'ఆస్వాల్డ్ కూల్డ్రే గురువు' అనే వ్యాసం ఒకటి రాశారు అడివి బాపిరాజు. కిన్నెరలో ప్రచురింపబడింది. ఈ వ్యాసంలో కూల్డ్రీ రామారావుకు ఇచ్చిన తర్ఫీదు రేఖామాత్రంగా గోచరిస్తుంది. బాపిరాజు, రామారావు, రామారావు పినతల్లి కొడుకు కవికొండల వేంకటరావు కూల్డ్రీ మెచ్చిన శిష్యులు. బాపిరాజు, కవికొండల కళాశాలలో చేరడంతో విద్యార్థులుగా కూల్డ్రీకి ప్రత్యక్ష శిష్యులే. కాని దామెర్ల మాత్రం అలా కాదు. హైస్కూలు స్థాయిలోనే చదువును ఆపేసి, చిత్రకళకే అంకితమైపోయారు.



కూల్డ్రీ ఇండియా వదిలేసి ఇంగ్లండు వెళ్ళాకా, భారతదేశంలోని తన అనుభవాలను 'సౌత్ ఇండియన్ అవర్స్' (దక్షిణభారత క్షణాలు)గా రచించి, ఆక్స్‌ఫర్డ్‌లో అచ్చు వేయించారు. అందులో ఆయన రాజమండ్రి జీవితానికి సంబంధించిన అనుభవాల్ని కథలుగా, గాథలుగా చిత్రీకరించారు. ఆయన శిష్యులు ఎందరో ఈ గ్రంథంలో పాత్ర ధారులయ్యారు.

చాల గొప్ప విషయం ఏమిటంటే, కూల్డ్రీ తన పుస్తకాన్ని "నాకు గురువులైన ముగ్గురు శిష్యులకీ" అంటూ అంకితమిచ్చారు. ముగ్గురితోనూ కలిసి గోదావరి తీరంలో వ్యాహ్యాళిగా సంచరిస్తూ ఎన్నెన్నో విషయాలు చెప్పేవారు. ఆ సంగతులు ముగ్గురు శిష్యులకీ ఆత్మకు పట్టాయి. "ఆయన చేయి పట్టుకుని నడిపించుకు పోతోవుంటే" కవికొండల గోదావరి పాటలు పాడేవారు. రామారావు గోదావరి బొమ్మలు వేసేవారు. బాపిరాజూ గోదారిని తలపోస్తూ కంఠం విప్పేవారు. "గోదావరి ప్రక్క వ్యవసాయం చేసే కాపూ, గోదావరిమీద పడవ నడిపే నావికుడూ, గోదావరికి నిజమైన బిడ్డలు సుమా!" అంటూ, శిష్యులవైపు చూసి "మీరు ఎప్పటికైనా నిజమైన తెలుగుబిడ్డలు కావాలంటే గోదావరిలో ఈతన్నా నేర్చుకోవాలి సుమండీ!" అని చిరునవ్వు నవ్వేరట కూల్డ్రీ ఒకసారి. ఈ మాటల్లో కళాకారుడు నేటివిటీకి ప్రాముఖ్యత ఇవ్వాలని చెప్పకనే చెప్పినట్లయింది. ఇలా ఉండేవి కూల్డ్రీ పాఠాలు. ముగ్గురికీ గురువుపట్ల ఎనలేని గురి. ఆయన మాట వేదవాక్కు. ఆదర్శవంతమైన శిష్యులు కనుకనే, ముగ్గురూ గొప్పవారయ్యారు.

ఆదివారం సాయంత్రపు నడకల్లో బొమ్మూరు కొండ లేదా నాగలంక (గోదావరి తీరంలో పచ్చికబయళ్ళు) దృశ్యసౌందర్యాన్ని, ధవళగిరి పొలాల్ని చూపుతూ ఎన్నో విషయాలు చర్చించేవారు. విద్యార్థులందరినీ పడవల్లో పట్టిసం, పిచికల్లంక తీసుకెళ్ళి, లంకల్లో విడిదులు చేయించి, ఆటపాటలతో, విందువినోదాలతో వారి బ్రతుకుల్లో మధురానుభూతుల్ని నింపిన గొప్ప గురూత్తముడు కూల్డ్రీ.

తన శిష్యుల్ని ఒక్కోసారి ఒక్కోలా పిలిచేవారు కూల్డ్రీ. బాపిరాజును 'బాపూ!', 'బాపీ!' అని, ఒక్కోసారి పూర్తిగా 'బాపిరాజూ!' అనీ పిలుస్తుండేవారు.



రామారావును 'రామ్/మూ!', 'రామం!' అని, ఒక్కోసారి పూర్తిగా 'రామారావూ!' అనీ పిలుస్తుండేవారు. కవికొండల్ని 'కవీ!', 'కవికొండలా!' అని, ఒక్కోసారి వర్ధ్నువర్తూ!' అనీ పిలుస్తూండేవారు. ఒక్కో పిలుపూ ఒక్కో మనోవృత్తిని శబ్దించేదంటారు బాపిరాజు.

ఒకసారి అలా తిరుగుతూ, ఓ ఇంటిముందాగి, "రామ్! మీ సింహద్వారాలు ఎంతో అందమైనవి. ఆ నల్లచేవ కఱ్ఱలో పద్మాలు, లతలు, చిలుకలు, జామకాయలు, దానిమ్మపండ్లు, హంసలు, సింహాలు, మకరాలు, ఏనుగులు ఎంత శ్రుతియుక్తంగా ఉత్తమ శిల్పవిన్యాసం చెక్కుతారోయి..." అన్నారట. అలా అనేసి ఒదిలేస్తే ఏముందీ? దాన్నుంచి ఓ పాఠంనేర్పాలి మరి. వెంటనే, "కొంచెం పెద్దసైజులో మంచి సింహద్వారం పూర్ణంగా రచియించి నాకిస్తావా?" అని అడిగారట.

ఇంకేముంది! రామారావు, ఇద్దరు వేంకటరావులు, బాపిరాజూ, ఇంకొందరు కూల్డ్రీ ప్రియశిష్యులూ ఊరంతా తిరిగి గుమ్మాలు, ద్వారబంధాలు, పక్క పట్టీలు, గడపలు, అడ్డపట్టీలు అన్నీ పరిశీలించడం మొదలెట్టారు. రకరకాల సింహద్వారాల్ని గుర్తించారు. "ఇప్పుడు రాజమహేంద్ర నగరము మీరు నిజంగా చూస్తున్నార"ని కూల్డ్రీ అన్నారట. వాస్తు దారుశిల్పాన్ని ఆవిధంగా శిష్యులకు అవగతం చేశారు కూల్డ్రీ. అంతే కాదు, ఊరూ, తీరూ, ఊర్లోని ప్రజానీకపు తీరుతెన్నులుకూడ వారికి అవగతం అయ్యాయి.


ప్రకృతి చిత్రాలతోపాటు సజీవచిత్రణకు సంబంధించిన స్కెచ్చులు వేయడంలో తర్ఫీదునిచ్చారు రామారావుకు కూల్డ్రీ. కళాశాలకు అప్పట్లో మన పెద్దపండుగ సెలవులకు బదులు మైకేల్‌మాస్‌కూ, క్రిస్మస్‌కూ పదిహేనేసి రోజులు సెలవులిచ్చేవారు. ఎండకాలం సెలవులు సరేసరి. సెలవులు వస్తున్నాయంటే చాలు, ఎక్కడికో ఒక చోటకి ప్రయాణం కట్టించేవారు కూల్డ్రీ. ఆ విధంగా రామారావుకు, బాపిరాజుకూ అజంతా, ఎల్లోరా గుహలు, సాంచి, భువనేశ్వరం, మహాబలిపురం, అమరావతి వంటి పురాతన పవిత్ర కళాప్రదేశాలెన్నో తిప్పి చూపించారు. ఇదంతా వారికి విద్యలో భాగమే. ఒకసారి క్యాంపులో భోగీరానది గట్టున కూర్చొన్నప్పుడు ఎన్నో విలువైన విషయాలు చెప్పార్ట కూల్డ్రీ. ఇటాలియన్



కుడ్య చిత్రలేఖన విధానానికీ, అజంతా కుడ్య చిత్రలేఖన విధానానికీ తేడాలు విడమరచి తెలియజేశార్ట. "మాకు పాశ్చాత్య శిల్ప రహస్యం అంతా బోధించారు. రాముకు బొమ్మలు వేసే విధానం నేర్పినారు. నాకు బి.యే పూర్తిచేస్తే గాని నేర్పనన్నారు"–ఇలా ఎన్నో విషయాలు చెప్పారు, కూర్జ్ గురూత్వం గురించి బాపిరాజు. ముఖ్యమైన విషయం ఏమిటంటే, "మేము భారతీయులమని ఆయన మాకు నేర్పినారు. పాశ్చాత్యవిధానాలు అన్నీ భారతీయ జీవితానికి శ్రుతి కావన్నా"రని తెలుపుతారు బాపిరాజు. సొంత జాతీయతనీ, నేటివిటీని శిష్యుల నరనరానా నింపారు కూర్జ్. అదే తరువాతి రోజుల్లో రామారావుకు తన కళాసంవిధానంలో మార్గదర్శి అయిందంటే అత్యుక్తి కాదు.

అజంతా, ఎల్లోరాలు చూడ్డానికి వెళ్ళినప్పుడది వర్ష కాలం. అందువల్ల సామాన్లు స్టేషన్‌లోనే ఉంచి స్కెచ్ పుస్తకాలు పట్టుకుని గుహలకు బయలుదేరారు. బలహీనంగా ఉన్న 'రాము' తనతో నడవలేక వెనుకబడడాన్ని గమనించిన కూర్జ్, శిష్యుణ్ణి తన భుజాలపై ఎత్తుకుని అజంతా అంతా తిప్పి చూపించారు. అటువంటిది ఆయన శిష్యవాత్సల్యం.

భారతదేశంలో గడిపిన రోజుల్లో తన జీవితంలో సాక్షాత్తూ తానెంతో అభిమానించిన శిష్యుల ఇండ్లలో, ఛాందసులైన వారి పెద్దలనుంచి తనకెదురైన అస్పృశ్యతకు బాధపడ్డా, ఆ బాధను శిష్యులమీద ఏ విధంగానూ, ఎంతమాత్రమూ ప్రసరింపనీయని గురుసత్తముడు కూర్జ్. సౌత్ ఇండియన్ అవర్స్‌లో 'సామాజిక స్పర్శ' అధ్యాయంలో ఈ విషయాన్ని రాశారు. భారతదేశపు ఆనాటి నిజ స్థితి గతులకు అద్దం పట్టారు.



భారతీయ సామాజిక కళాజీవితాన్ని ఎంతో అభిమానించి, అవగాహన చేసుకున్నవారు కూర్డీ. తెలంగాణా గురించి రాస్తూ అక్కడి ప్రజాజీవితంలో భాగమైన 'మోటబావి'ని వర్ణించారు. మోట కొట్టేటప్పటి పశువులు, మనుషులు, పాటలు, రాగాలు, శబ్దాలు...అన్నీ కూర్డీను ఆకర్షించాయి. దాన్ని అద్భుతంగా చిత్రించారు. ఏ తెలుగు చిత్రకారుడూ అప్పటికి పట్టుకోని ఈ దృశ్యాన్ని కూర్డీ కుంచె శాశ్వతం చేసింది. ఇలాంటి సందర్భాలతో శిష్యులకు చెప్పకుండానే సందేశాలందించేవారు.

కాపీ చిత్రాలు వేయకూడదని, వస్తువుల్నిగాని ప్రకృతినిగాని చూసి లేదా ఊహించి చిత్రించాలన్నది కూర్డీ మొదటగా చెప్పిన పాఠం. అప్పటివరకు రామ్‌వద్ద రామారావు నేర్చుకున్నది నకళ్ళు తీయడమే. కూర్డీ పాఠానికి ప్రభావితుడై, ఒకసారి రామారావు గుడ్డగొడుగును ఒక జత బూట్లతో పోలుస్తూ తాను చిత్రించిన స్టిల్‌లైఫ్ చూపించగా, 'బూట్లకు బదులుగా దేశవాళీ తాటాకు గొడుగును, కిర్రు చెప్పుల్ని చిత్రించవలసిందిగా' సూచించారు. ఈ రకమైన విమర్శే రామారావుకు చిత్రకళలో తనదైన దేశవాళీ దృష్టిని కలుగజేసింది. అలాగే, కవికొండల వేంకటరావు తన మొదటి పద్యాన్ని 7-9-1910న ఆంగ్లంలో రాసిచూపించినపుడు కూడా, వెంటనే, ఇక రాయబోయే కవిత్వాన్ని తెలుగులో రాయమని సూచించారు.

ఆనాటినుండీ రామారావు కాపీ చిత్రణకు, నకలు సృజనకు స్వస్తి చెప్పి, సొంత భావాలతో తనదైన కళను చిత్రించి గురువుకు చూపేవారు. మంచి బహుమతితోపాటూ గురువుగారితో కలిసి తేనీటి పానం చేసే అవకాశాన్ని సంపాదించేవారు.

తన శిష్యులకు ఎప్పుడూ దేశీయతనీ, జాతీయతనీ గుర్తుచేస్తూ ఎంతో మంచి సూచనలు చేసిన కూర్డీదొర అనుకోకుండా ఒక చారిత్రక తప్పిదానికి కారణమయ్యారా? 'మెమొరీస్ ఆఫ్ దామెర్ల రామారావు' అని ఎంతో విలువైన వ్యాసాన్నొకటి రాశారు కూర్డీ. ఆ వ్యాసంలో రాసిన సమాచారం ప్రకారం, 1914లో కళాశాలలో జూలియస్ సీజర్ నాటకంలో రెండు దృశ్యాల ప్రదర్శన ఏర్పాటుచేశారాయన. సీజర్ హత్య చేయబడిన సెనేట్ హాలు, పాంపీ విగ్రహ నేపథ్యాల నమూనాలు తయారుచేశారు కూర్డీ. వాటిని వెనుకతెరలుగా




చిత్రించవలసి ఉండగా, ఆ చిత్రీకరణను రామారావుకు పురమాయించారు. ఆ సందర్భం గురించి చెబుతూ, *"I was surprised at Ram's mastery of the technique of screen-painting. ...Mr. Ram had clearly a strong natural artistic gift, but he studied, of course, the taste for exuberant decoration then current in theatrical circles"* అంటారు. ఏ.ఎస్. రామ్ విషయంలో ఏదైతే కూడదని రాజమండ్రి పెద్దలు భావించారో అదే చేశారు కూర్డీ కూడా – వెనుక తెరల చిత్రీకరణ. ఈ విషయంగురించి చెబుతూ, "వ్యాపార దృక్పథం ఉన్నవారిచేత కాక, కళ కోసం ఆరాటపడే అనాసక్త యోగదృష్టి గల తరుణ దక్షులచే" తనకు కావలసిన రీతిలో జూలియస్ సీజర్ తెరలు రాయించాలనుకున్నానని సమర్థించుకున్నారు. అయితే రామ్‌లాగా కూర్డీ వెనుక తెరల చిత్రణ ఒకటే పురమాయించలేదు. ఏదో అవసరార్థం రెండు చేయించారంతే. అయినా తాను పొరపాటు చేసానని ఒప్పుకున్నారు.

రామారావు చిత్రణ గొప్పతనాన్ని తెలియజెప్పే సంఘటనొకటి ఒకసారి జరిగింది. కూర్డీ మిత్రుడు, ఆయన చిత్రించిన 'కశ్మీర్' చిత్రపటాన్ని తనకివ్వమని అడుగుతారు. ఈయనకేమో ఇవ్వాలని లేదు. అందుకు, దానికి నకలు తీసిస్తానని, దానితో తృప్తిపడమని మిత్రుణ్ణి ఒప్పించారు. నకలు తీసే పనిని రామారావుకు అప్పగించారు. యథాతథంగా రామారావు దాని నకలు తయారుచేశారు. మిత్రుడికి రెండూ చూపారు కూర్డీ. ఆశ్చర్యపోవడం అతని వంతయింది. పైగా, రామారావు నకలు కాపీయే బాగుందని, దాన్నే తీసుకున్నాడాయన. బొమ్మ వేయడంలో అంతటి నేర్పుండేది రామారావుకు. అదీ అతి చిన్న వయసులోనే ఆ నేర్పు అతని సొంతమైంది. ఇరవై ఏళ్ళ వయసు వచ్చేసరికే ప్రసిద్ధ చిత్రకారునిగా పేరు పొందడమే కాకుండా తన కళాఖండాలను ప్రపంచవ్యాప్తంగా ప్రదర్శనలకు పంపుతూండేవారు రామారావు. రామారావు చిత్రకళానైపుణ్యాన్ని తెలిపే వ్యాసాలు రాసి బిబ్బీస్ జర్నల్, రాయల్ ఎకాడెమీ వార్షిక సంచికల్లో ప్రచురించేవారు కూర్డీ.

క్రిస్మస్ శుభాకాంక్షలు తెలుపుతూ గ్రీటింగ్ కార్డులు స్వయంగా చిత్రించి ఇచ్చేవారు కూర్డీకి రామారావు. నాలుగు సంవత్సరాలు నాలుగు ప్రకృతి చిత్రాల కార్డులు ఇచ్చినట్లుగా గుర్తుచేసుకుంటూ, వాటి వైశిష్ట్యాన్ని, చిత్రించిన తీరునీ సూక్ష్మవివరాలతో వర్ణించారు కూర్డీ. లోపాలు కూడ అప్పుడే చెప్పినట్లుగా



తెలిపారు. నీటిలో ప్రతిఫలించే తాటిచెట్లు ఈజిప్టు ఖర్జూర చెట్లను పోలి ఉండడం, కుర్ర చిత్రకారుడి పుస్తకజ్ఞానాన్ని తెలుపుతుందంటారు. తరువాత సంవత్సరం కార్డు 'వెన్నెల్లో గబ్బిలం'. ఒకే రంగు సెపియతో చిత్రించబడింది. దీనిలో భారతదేశపు తాటిచెట్లయితే వచ్చాయి కాని, బొమ్మకు కట్టిన లలితమైన లతలతో కూడుకున్న బోర్డరు నప్పలేదంటారు. మూడో కార్డు బొంబాయి దగ్గర ఏదో కొండగ్రామం అనుకుంటానంటూ, రామారావు ల్యాండ్‌స్కేపుల్లో తనకెంతో నచ్చిన చిత్రంగా చెబుతారు. రామ్ తానే తరహా (స్కూల్ ఆఫ్ పెయింటింగ్) చిత్రాలు వేయాలో స్పష్టత పొందలేదంటూ, దానికి పాక్షికంగా తనే కారణమని అంగీకరిస్తారు. ఇలా అంగీకరించే పెద్ద మనసు కలిగిన గొప్ప వ్యక్తి కూర్మీ.





ముంబాయి కళాభ్యసనం

రామారావును ముంబాయి జంషెడ్జీ జిజియాభాయ్ స్కూలాఫ్ ఆర్ట్సుకు పంపారు కూర్డీ. తండ్రి వెంకట రమణారావుగారికైతే పంపడం ఇష్టంలేదు. చిత్రకళ శిష్టాచార పరాయణులు నేర్చుకునే కళ కాదని ఆయన నమ్మకం. కానీ ఆయన్ని ఒప్పించి, తన సొంత ఖర్చుతో పంపడానికి అంగీకారం పొందారు కూర్డీ.దాంతో తండ్రిగారే రామారావును 1916 జూలై నెలలో ముంబాయి తీసుకెళ్ళి అక్కడి కళాశాలలో చేర్పించారు. ఈ విధంగా ఒక కళాశాలలో పద్ధతిప్రకారం నేర్పబడే కళాభ్యసనం రామారావుకు లభించింది.

జె.జె. కాలేజి అప్పటి ప్రిన్సిపాల్ సిసిల్ బర్న్స్ (1863–1929) కూర్డీ మిత్రులే. ఆయన రామారావు చిత్రాలను, స్కెచ్చులను చూసి ఎంతో ఆశ్చర్యపోయారు. నేరుగా మూడో సంవత్సరంలోకి ప్రవేశాన్ని కల్పించారు. ప్రవేశ పరీక్ష లేదు. మొదటి రెండు సంవత్సరాల అధ్యయనంగాని, పరీక్షలుగాని లేకుండా సరాసరి మూడో సంవత్సరంలోకి

ప్రవేశార్హత పొందడం, అదేమంత చిన్న విషయం కాదు. గ్రీకు మోడళ్ళ సహాయంతో 'యూరపీయ అకడెమిక్ ఆర్ట్'ను ప్రాకృతిక చిత్రణ ప్రాధాన్యతతో జె.జె కళాశాలలో నేర్పేవారు. అంతే కాకుండా, దేనిలోనైతే శిక్షణ పొందారో అది తప్ప అన్యమైనదాన్ని ఆమోదించలేనంతటి గట్టి నియమ నిబంధనలతో కూడిన శిక్షణ ఉండేది. రాజమండ్రి విద్యార్థులకు ఇదేమీ కొత్తగాను, కష్టంగానూ తోచేది కాదు. ఎందుకంటే ఈ రీతిలో వారు అప్పటికే కూల్డ్రీ దగ్గర బాగా శిక్షితులయ్యారు. వీరు అక్కడి అధ్యాపకుల్ని బాగా ఆకట్టుకున్నారు కూడా. అందరిలోకీ రామారావును మరీ మెచ్చేవారు.

హ్యూమన్ మోడల్, స్టిల్లైఫ్, ఎనాటమీల్లో రామారావు ఎక్కువ సాధన చేసేవారు. సాయంత్రాలప్పుడు క్రాఫర్డ్ ఎల్. ఫ్లోరా ఫౌంటెయిన్ మార్కెట్ దగ్గర




Damerla Rama Rao 1897 - 1925 | J.J.School of Arts, Bombay | Water Colour 1918

1918లో రామారావు చిత్రించిన జె.జె. కళాశాల ప్రాంగణ దృశ్యం

స్కెచ్చులు వేసేవారు. సెలవురోజుల్లో నాసిక్, కళ్యాణి, కర్జా వంటి ప్రాంతాలకువెళ్ళి అక్కడి దృశ్యాల్ని చిత్రిస్తూండేవారు. ఇటువంటి సందర్భంలోనే ఓసారి ప్రముఖ చిత్రకారుడు రవిశంకర్ రావెల్‌తో పరిచయం కలిగింది. ఆ పరిచయాన్ని చివరికంటా నిలుపుకున్నారు రామారావు.



భావనగర్ మహారాజు దివాన్ పట్వారీ సాహెబ్ కళాశాల వార్షిక దర్శనానికై వచ్చారు. రామారావు చిత్రణాభివ్యక్తిని మెచ్చి, వారి కుటుంబ వ్యక్తుల రూపచిత్రాలు రచించేందుకు రావాల్సిందిగా ఆహ్వానించారు. విశ్వకవి రవీంద్రనాథ్ టాగూర్ దక్షిణామూర్తి విశ్వవిద్యాలయంలో ప్రసంగం ఇవ్వడానికి భావనగర్



రామారావు గీసిన రవీంద్రుని స్కెచ్

పాడైపోయిన స్కెచ్ (ఒకటో బొమ్మ); కంప్యూటర్ సహాయంతో మెరుగుపరచిన స్కెచ్ (రెండో బొమ్మ)
ఇంటాక్ సంస్థ రామారావు చిత్రాల మెరుగుదల మహత్కార్యాన్ని చేపట్టింది.
రామారావు గీసిన స్కెచ్‌మీద రవీంద్రులు తన సంతకం చేసి తేదీ వేశారు. కాని తేదీ కత్తిరింపబడింది.

వచ్చారు. ఆ సందర్భంగా ఇద్దరూ కలిశారు. రవీంద్రుడు ఉపన్యాసం ఇస్తుండగా రామారావు ఆయన రూపచిత్రాన్ని పెన్సిల్ స్కెచ్ చేసి ఆయనకు బహుమతిగా ఇచ్చి ఆశీస్సులు పొందారు. రామారావును శాంతినికేతన్ రావాల్సిందిగా ఆహ్వానించారు రవీంద్రులు.

1918 సెలవుల్లో రావెల్, బథెకాలతోపాటు పదిహేను రోజులు గుజరాత్ పర్యటన చేశారు రామారావు. 'కథియవాడ్ గొల్లపడుచులు', 'గిర్నార్ అడవులు' అనే చిత్రపరంపరను నీటిరంగుల్లో ఈ పర్యటనలోనే చిత్రించారు. ఈ సమయంలోనే వాషింగ్టన్, గ్రిఫిత్, ది హెడ్, ముంబాయి ప్రభుత్వ పురస్కారం, మేయో బంగరు పతకాలను సాధించారు.

1919 జూన్ నెల రామారావు జీవితంలో ఒక ముఖ్య ఘట్టం. చిత్రకళాభిమానియైన దిగుమర్తి శ్రీనివాసరావు రెండో అమ్మాయి సత్యవాణిని వివాహమాడారు. ఒకరకంగా బాల్యవివాహంగానే చెప్పుకోవాలి. వివాహసమయానికి ఆమె వయసు కేవలం పదకొండేళ్ళు.

దామెర్ల చిత్రాల్లో 'పుష్పాలంకరణ'కు ఒక ప్రత్యేకత ఉంది. తన భార్య శ్రీమతి సత్యవాణికి జరిగిన సీమంతాన్ని కనులారా తిలకించి, పులకించి ఆ తర్వాత చిత్రించిన సమూహ చిత్రపటం కావడమే ఆ ప్రత్యేకత. మరో ప్రత్యేకత ఏమంటే, స్వయానా భార్య మోడల్ కావడం. ఈ చిత్రమనే కాదు, శ్రీమతి సత్యవాణి, రామారావు చిత్రాలకెన్నింటికో మోడల్‌గా ఉపయోగపడ్డారు. రామారావు స్త్రీల ముఖాలన్నిటిలోనూ ఆమె పోలికలే కనబడతాయి. శరీర ప్రమాణాలు మాత్రం మారుతుంటాయి. రామారావు కళాసాధనకు ఆమె ఎంతగానో తోడ్పడ్డారు. భర్తకు తగిన భార్య ఆమె.

శ్రీమతి సత్యవాణి కూడ స్వయంగా చిత్రకారిణి. 'సిద్ధార్థుని నిర్వికారత', 'నిశ్చింత భావము' 'తల్లి' వంటి అనేక చిత్రాలను ఆమె సృజించారు. 'ఉత్తర హిందూస్థానము'నకు చెందిన 'గొల్లపిల్ల', శ్రీకృష్ణుడు చెల్లెలు సుభద్రకు బాణవిద్య నేర్పే 'విలువిద్య' – ఈ అన్ని చిత్రాలు ఆమెకు పేరు తెచ్చాయి. అన్నీ అప్పట్లో ఆంధ్రభూమి మాసపత్రికలో ముద్రణ పొందాయి. తొలిచూలు సంతానం కుమారుడు, పుట్టిన ఆరునెలలకే చనిపోవడం, తరువాత భర్త మరణంతో సత్యవాణి చిత్రరచనకు దూర మయ్యారు.

భార్య సత్యవాణితో పాటు మరో మోడల్ రామారావు కొన్ని చిత్రాలకు ప్రాణం పోసింది. ముఖ్యంగా నగ్న చిత్రాలకు ఈమె మోడల్‌గా పని చేసింది. పేరు నూకాలు. గోదావరి ఒడ్డున సోడాలు అమ్మేది ఆమె. పురుషచిత్రణకు మోడల్‌గా ఉపయోగపడినవారు రాములు అనే నాయీబ్రాహ్మణ యువకుడు.

రామారావుకు జీవితంలో స్థిరపడే రెండు అవకాశాలు వచ్చాయి. తాను చదువుకున్న కళాశాల జె.జె. స్కూల్లో ఇనస్ట్రక్టర్‌గా చేరమని కళాశాల యాజమాన్యం కోరింది. అలాగే 'లక్నో స్కూల్ ఆఫ్ ఫైన్ ఆర్ట్స్ కళాశాల' వైస్‌ప్రిన్సిపాల్‌గా పదవీబాధ్యతలు చేపట్టమన్నారు. కాని వాటిని తృణప్రాయంగా వదిలేసి, కళాబోధనకు కాక పూర్తిగా కళాసృజనకే అంకితమవ్వాలనుకున్నారు రామారావు.



దామెర్ల సత్యవాణి గారి చిత్రాలు




విలువిద్య



గొల్లపిల్ల



నిశ్చింత భావము



రామారావు సత్యవాణి
దంపతులు




రామారావు చిత్రించిన
దామెర్ల సత్యవాణి
వర్ణచిత్రం




రామారావు తొలిదశ చిత్రాలు

పాశ్చాత్య శైలికి చెందిన వెలుగు నీడల త్రిమితీయ చిత్రణ
వీటిలో రేఖాచిత్రణ మచ్చుకైనా కనబడదు




THE BREAKERS Water Colour 1917




TREES & ROOTS Water Colour 1918






WATERFALLS Water Colour 1921



THE LAKE Water Colour 1921



GIRNAR LANDSCAPE Water Colour 1921



NEAR POND Water Colour

ముంబాయి తర్వాత


1920లో జె.జె. స్కూల్ శిక్షణను ముగించుకుని ప్రథమశ్రేణిలో ఉత్తీర్ణులై రామారావు రాజమండ్రి చేరుకున్నారు. తదుపరి 1920 ఉత్తరార్ధంనుంచి సుమారు 1922 చివరి వరకు దేశపర్యటన చేశారు. ఈ కాలం ఆయన జీవితంలో ఎంతో విలువైనది. పిఠాపురం రాజావారి ధనసహాయంతో (ఫెలోషిప్), మూడు నెలలు శాంతినికేతన్ వెళ్ళి గడపడానికి సావకాశం కలిగింది. శాంతినికేతన్ సందర్శించి, అక్కడ బెంగాల్ స్కూల్ నిర్వహిస్తున్న 'నవ వంగ జాగరణ' తీరుతెన్నులు పరిశీలించారు. అవనీంద్రుని నాయకత్వంలో బెంగాలు స్కూలు చిత్రకళలో భారతీయతకు పెద్దపీట వేయడాన్ని గమనించారు. కలకత్తాలోని ఓరియంటల్ సొసైటీ నిర్వహించిన కళాప్రదర్శనలో తానూ పాల్గొన్నారు రామారావు. తనవి రెండు చిత్రాలు – 'ఋష్యశృంగ

బంధనం', 'తూర్పు కనుమల్లో గోదావరి' అనే వాటిని ప్రదర్శించారు. ఋష్యశృంగ చిత్రానికి 'ఇండియా వైస్రాయి నగదు బహుమతి' లభించింది. చిత్రకళాప్రదర్శనను దర్శించిన అప్పటి వైస్రాయి లార్డ్ రీడింగ్, రామారావు చిత్రాలు చూసి పరవశమొంది, ఆయనతో పరిచయం చేసుకున్నారు. 'గోదావరి లోయ సౌందర్యం' చిత్రాన్ని కొనుగోలు చేశారు.

గుజరాత్ మిత్రుడు బథేకా వద్ద ఆరు నెలలుండి ఎన్నో చిత్రాలు సృజించారు. 'బావి వద్ద' అనే సమూహ చిత్రపటాన్ని ఈ కాలంలోనే చిత్రించారు. ఈ సమయంలో వేసిన చిత్రాలు, స్కెచ్చులను ఆ తరువాత అహమ్మదాబాదులో ప్రదర్శించి ఎన్నో ప్రశంసలందుకున్నారు.

1922వ సంవత్సరం రామారావు జీవితంలో చాల ముఖ్యమైన సంవత్సరం. దేశం నాలుగు చెరగులా పర్యటించి, ఎందరో ప్రముఖ చిత్రకారులను కలిసి వారి చిత్రణ రీతులను పరిశీలించారు. ఈ పర్యటన ఫలితంగా ఆయనకొక దర్శనమైంది. అదే చిత్రకళలో ప్రాక్పశ్చిమ సమన్వయం. ఈ దర్శనమే రామారావును ఆ కాలంలో మేటి చిత్రకారునిగా మార్చింది. అంతే కాకుండా ఆయన్ను ఆంధ్రచిత్రకళకు వైతాళికుణ్ణి చేసింది.

ఈ సంవత్సరంలోనే తన చిత్రరాజం 'సిద్ధార్థ రాగోదయం' చిత్రించారు. శ్రీలంకకు చెందిన కళాపిపాసి ఒకరు ఈ చిత్రాన్ని కొనుగోలు చేశారు. ఈ చిత్రమంటే రామారావుకు ఎంతో ఇష్టం. అనేకానేక మార్పులతో






రెండు విధాలుగా వేసిన 'నందిపూజ' చిత్రం



వివిధ ప్రయోగాలతో ఈ చిత్రాన్ని పలురీతులుగా చిత్రించారు తదుపరి. ఇదనే కాదు, తన చిత్రాలను కొన్ని కొన్ని మార్పులతో మళ్ళీ మళ్ళీ చిత్రించేవారు.



పెళ్ళికూతురు **నీటి రంగులు**

ప్రాక్పశ్చిమాల కళాసమన్వయం – రామారావు కళాపరిణామం

జె.జె. స్కూలు కళాకారులు సర్వత్రా మంచి కళాకారులని పొగడబడినా, వారికి బెంగాలు నవజాగరణ కళాకారులనుంచి సవాలు ఎదురైంది. అందువల్ల నవజాగరణ కళను పట్టించుకోవలసిన అవసరం కలిగింది. ఆంధ్ర జాతీయ కళాశాలను సందర్శించి, అక్కడి కళారీతులను పరిశీలించాకా ఈ ఆలోచనలు మరింత పదునెక్కాయి. అంతే కాకుండా ఈ నేపథ్యాన్ని బాగా అర్థం చేసుకున్న రామారావు, జె.జె. స్కూలు మిత్రులతో 'ఆంధ్ర సొసైటీ ఫర్ ఇండియన్ ఆర్ట్' అనే సంస్థను 1923లో స్థాపించారు. అప్పటికే భారతదేశం వదలి లండన్ వెళ్ళిపోయిన గురువు కూల్డ్రీ అధ్యక్షుడిగా, రాజమండ్రి వదలి లాహొూర్ వెళ్ళిన ఏ.ఎస్. రామ్ ఉపాధ్యక్షుడిగా, రామారావు సోదరుడు వెంకట్రావు కార్యదర్శిగా ఈ సంస్థ ఉనికిలోనికి వచ్చింది. దీనికి అనుబంధంగా చిత్రకళ పాఠశాలను కూడ నెలకొల్పారు. తరువాత ఈ పాఠశాల విద్యార్థులే ఎంతో ప్రాచుర్యం పొందిన చిత్రకారులయ్యారు.

భారతీయమైన కళారూపాన్ని ఏర్పరచడంతోపాటు ప్రాంతీయంగా ప్రజల్లో కళపట్ల అవగాహన కలిగించడం ఈ సంస్థ లక్ష్యాలుగా నిర్దేశింపబడ్డాయి. నిజానికి ఇదెంతో కష్టసాధ్యమైన పని. వీరంతా యూరపీయ వెలుగునీడల వాస్తవ చిత్రణకు సంబంధించిన విజ్ఞానాన్ని నరనరానా జీర్ణించుకున్నవారు. దాన్ని కాదని, వేరే పద్ధతుల్లోకి మళ్ళడం కష్టమే కదా! అయితే కష్టపడ్డారు. ఒక దిశానిర్దేశం చేసుకున్నారు. ఫలితంగా భావంలో పూర్తిగాను, రూపంలో పాక్షికంగాను భారతీయతను రక్షించగల ఆంధ్ర చిత్రణరీతిని రూపొందించగలిగారు. ఒక ఆదర్శంగా తీసుకుని, పట్టు వదలకుండా నవజాగరణ కళాకారులకు దీటుగా కళారూపాలను సృజించ నారంభించారు.

అంతేకాకుండా, చిత్రకళలో ఆసక్తి ఉన్నవారిని ఆర్టుస్కూళ్ళకు పంపించడం కాకుండా, ఈ సంస్థ సభ్యులు తామే వారికి శిక్షణ ఇవ్వడానికి సిద్ధపడ్డారు. భారతీయ మౌలిక కళాంశాలను చిత్రణలో చేరుస్తూ ఒక కరిక్యులం కూడ సిద్ధపరచుకున్నారు. ఐరోపీయ అకడెమిక్ కళలోని చిక్కుల్ని, సంకటాల్ని పరిహరించి, భారతీయతను పరిపోషించే విధంగా ఈ తర్ఫీదు (కరిక్యులం) ఉండేది. లైఫ్ స్టడీ, స్కెచ్చింగ్, నేచర్ పెయింటింగ్ అనేవి ముఖ్యమైన అంశాలు. వీటిలో సరైన తర్ఫీదు పొందారనుకున్నాకనే సృజన సంయోజనలకు (క్రియేటివ్ కాంపోజిషన్స్) అనుమతించేవారు. ఇంచుమించు అన్ని పట్టణాల్లోనూ కళాసక్తి ఉన్నవారు ఈ విధంగా చిత్రకళను అభ్యసించేలా రంగాన్ని సిద్ధపరచారు. సొసైటీ శిక్షణ తరువాత విద్యార్థుల్ని మద్రాసు ప్రభుత్వ టెక్నికల్ బోర్డు పరీక్షలకు కూర్చోబెట్టేవారు. ఈ పరీక్షల్లో ఉత్తీర్ణులైనవారికి కళాబోధనలో ఆరువారాల శిక్షణాతరగతులు నిర్వహించి, బోర్డు సర్టిఫికెట్టు ఇచ్చేది. ఈ సర్టిఫికెట్టుతో వివిధ ఉద్యోగాలు లభించేవి. ఆర్టు టీచర్లుగానే కాకుండా, క్రాఫ్ట్స్‌మన్, సర్వే ట్రేసర్స్ వంటి సంబంధిత ఉద్యోగాలు కూడ వీరు పొందగలిగేవారు. ఈ విధంగా ఈ సొసైటీ ఎందరినో చిత్రకళను వృత్తిగా చేసుకోడానికి ప్రేరేపించింది.

సొసైటీ చిత్రకళాభ్యసనలో భాగంగా దేశంలో కళాభివృద్ధిగురించి చర్చలు, వాదోపవాదాలు క్రమం తప్పకుండా సాగేవి. ఈ చర్చలకు విద్యార్థులతోపాటు చిత్రకళలో ఆసక్తి ఉన్న పట్టణ పౌరులు కూడ పాల్గొనే అవకాశమిచ్చింది సొసైటీ.



ఊర్లోని కళాకారులు కూడ తాము చేస్తున్న పనిని గురించి, వేస్తున్న బొమ్మల గురించి తెలియజేస్తూ చర్చల్లో పాల్గోడానికి ఇష్టపడేవారు.

దేశంలోనే ప్రముఖ చిత్రకారులైన అవనీంద్రనాథ్ టాగూర్, నందలాల్ బోస్, వెంకటప్ప, అబ్దుల్ రహమన్ చుగ్‌తాయ్, దేవీప్రసాద్ రాయచౌధురి వంటివారితో రామారావుకున్న అనుభవాలు కూడ ఈ చర్చల్లో చోటు చేసుకునేవి.

ఆంధ్ర జాతీయ కళాశాలకు చెందిన అడవి బాపిరాజు, గుఱ్ఱం మల్లయ్య తదితరులు సొసైటీని విరివిగా దర్శిస్తూ వారి ఉద్దేశ్యాలను పంచుకునేవారు. వీరు అవనీంద్రుని భావజాలంతో ఏకీభవించేవారు. ఎందుకంటే, ఆ కళాశాల ప్రిన్సిపాల్ ప్రమోద్ కుమార్ ఛటోపాధ్యాయ నవబెంగాల్ స్కూలుకు చెందినవారు కావడమే. ఇక్కడి కళాభ్యసనం మౌలికంగా ప్రాచ్యశైలితో కూడుకుని, భారతీయ సంస్కృతికి పెట్టింది పేరుగా ఉండేది. అడివి బాపిరాజుతో పాటు, కౌతా సోదరులు, గుఱ్ఱం మల్లయ్య, వేలూరి రామమూర్తి, కేశవరావు వంటివారిని మంచి చిత్రకారులుగా తీర్చిదిద్ది ఆంధ్ర చిత్రకళారంగానికి అందించారు ఛటర్జీ.

దానికి విరుద్ధంగా, జె.జె స్కూలునుంచి ఒక అకడెమిక్ ఆర్టిస్టుగా తయారై బయటికి వచ్చారు రామారావు. చిన్నప్పట్నించీ మేనమామ, ఏ.ఎస్. రామ్, కూల్డ్రీల వద్ద నేర్చుకున్నదంతా దీనికే దోహదపడింది. వాస్తవికతకు ప్రాముఖ్యమిచ్చే చిత్రణరీతికే చిన్ననాటినుంచీ అలవాటు పడ్డారు. ప్రత్యేకించి భారతీయ కళ అవసరాన్ని గుర్తించనంతవరకు ఆయన చిత్రణ పరాయి శైలిలోనే సాగింది.

కూల్డ్రీ పాశ్చాత్యశైలి చిత్రణనే నేర్పినా, రామారావు భారతీయతని అర్థం చేసుకునే విధంగా ఎన్నో విషయాలు సందర్భానుసారంగా చెప్పేవారు. తన శిష్యుల్ని భారతీయులుగా ఉండమని ప్రోత్సహించేవారు. ఆయన బోధనల సారమే రామారావు ప్రాచ్యశైలి చిత్రణను అర్థం చేసుకుని, దానివైపుకు మళ్ళింపజేసిందంటే అతిశయోక్తి కాదు.

భారతీయమైన ఇతివృత్తాలను తీసుకుని తనకు చేతనైన పాశ్చాత్య శైలిలో చిత్రించనారంభించారు రామారావు. అంటే ఆధునిక శైలిలో భారతీయాత్మను కొత్తకోణంలో ఆవిష్కరింపజేశారన్న మాట. 'సిద్ధార్థ రాగోదయం', 'పుష్పాలంకరణ' వంటి భారతీయమైన ఇతివృత్తాలకు అసంఖ్యాకంగా రూపకల్పన చేశారు.



ఈ రకంగా ప్రత్యేకమైన, తనదే ఐన శైలిని ఏర్పరచుకుని ఆంధ్రచిత్రకళను ప్రాచ్యపాశ్చాత్య సమన్వయంగా తీర్చారు, దామెర్ల. అదే 'ఆంధ్ర శైలి'గా పేరొందింది.

స్థిరీకరింపబడిన పాత ఛాందస చిత్రణ స్థానంలో నూతన రీతి చిత్రణను ప్రవేశపెట్టి సమకాలీన చిత్రకళను విప్లవీకరించారు. బహుశా వాస్తవరీతి చిత్రకళలో రాజా రవివర్మ తరువాతి స్థానాన్ని ఆక్రమిస్తూ, రామారావు ఎక్కువగా స్త్రీల స్వాతంత్ర్యాన్ని, పౌరాణిక పవిత్రతను కళాప్రకాశం ఉట్టిపడేలా చిత్రించారు. కాని, చిత్రకళ పునరుజ్జీవన దశలో రామారావు చాల కీలకమైన పాత్ర పోషించారు. అంతే కాకుండా, నగ్నచిత్రణకు సైతం ఆద్యులయ్యారు రామారావు. ఆనాటికి



ఆంధ్ర చిత్రకళ చరిత్రలో నగ్నతను చిత్రీకరించిన మొట్టమొదటి చిత్రకారుడు రామారావు. ఇది ఆయన విప్లవ ధోరణికి ప్రతీక.



నగ్నరూపాన్ని చిత్రించడమన్నది అస్సలు కలలో కూడ చేయరాని పని. అటువంటిది 'నగ్న సుందరి' (నిరంబరి, అమాయిక) అనే చిత్తరువును రచించి సంచలనం సృష్టించారు.

రామారావు తొలిదశ చిత్రాలు ప్రాచ్యరీతికి దూరంగా, పాశ్చాత్య విధానానికి దగ్గరగా ఉండేవి. రవివర్మ చిత్రాలు జనప్రసిద్ధినొందినా, కళావిమర్శకుల మన్నన పొందలేదు. ఇంచుమించు అదే తీరులో చిత్రించినా రామారావు చిత్రాలు విమర్శకుల దృష్టిని ఆకర్షించడానికి కారణం, బహుశా ఆనాడు భారతదేశంలో ఉన్నటువంటి ఆంగ్లేయుల ఆదరణకు పాత్రం కావడమే

అనిపిస్తుంది. కూల్డ్రీ స్వయంగా గురువు కావడం ఇందుకు బాగా దోహదం చేసింది. అలాగే ముంబాయి జెజె. పాఠశాల అధ్యాపకులు రామారావు చిత్రాలను బాగా మెచ్చుకోవడమూ కారణం కావచ్చు. 1924లో లండన్‌లో జరిగిన బ్రిటిష్ ఎంపైర్ ప్రదర్శనశాలలో రామారావు చిత్రాలను చూసిన విదేశీయులు విస్తుపోయారు. వాటిని ఏడాది పాటూ గ్యాలరీలో ఉంచారు. ఇంగ్లండ్ (లండన్), కెనడా (టొరొంటో, వెంబ్లీ) వంటి విదేశాల్లో సైతం రామారావు చిత్రాల ప్రదర్శనలు జరిగాయి.

ఇదే రీతిలో పాశ్చాత్య పద్ధతిలో కొనసాగి ఉంటే ఈరోజు రామారావును మనమింతగా గౌరవించవలసిన అవసరం ఉండేదే కాదు. కూల్డ్రీ బోధనల వల్లనైతేనేమి, నవవంగ సంప్రదాయులతో పోటీపడటానికైతేనేమి, ఆనాడు ప్రాచుర్యంలోనున్న చిత్రకళను భారతీయం చేయడమే రామారావు చేసిన మహత్కార్యం. అందుకే ఆధునిక ఆంధ్ర చిత్రకళకు ఆద్యులయ్యారు.

ఈ మహత్కార్యంలో భాగంగా ప్రాచ్యరేఖను చిత్రణలోనికి తీసుకువచ్చారు. బాగా ప్రసిద్ధి చెందిన రామారావు చిత్రాలు సిద్ధార్థ రాగోదయం, పుష్పాలంకరణ, శ్రీరామ వనవాసం, బావివద్ద వంటివన్నీ ఈ కోవ లోకే వస్తాయి.

రామారావు మలిచిత్రాల్లో రూపాన్ని చాల సన్నని చక్కని రేఖ ఆకృతిస్తూ ఉండడం గమనార్హం. రేఖ ప్రాచ్యరీతి చిత్రీకరణలో మౌలికమైన అంశం. మందం అవసరమైన చోట నొక్కబడుతూ, కావలసిన తావుల్లో పెంచబడుతూ సాగడమే కాకుండా, స్ఫుటమౌతూ, అస్ఫుట మౌతూ...దృఢమౌతూ, అదృఢ మౌతూ... ఒకోచోట కత్తుల్లా దూసుకుపోతూ, ఒకోచోట పాతమై జారుతూ, వివిధ రకాలుగా, రీతులుగా సాగుతూ రేఖ ప్రాచ్యవిధాన చిత్రణలో మూడో ఆయతన్నాన్నిస్తుంది. అలాగే దూర సమీపాల ఆభాసనూ కలిగిస్తుంది.

ఇక వర్ణలేపనం విషయానికొస్తే, ప్రాచ్య చిత్రణలో రేఖల మధ్య రంగు ఏ వెలుగునీడలూ లేకుండా సమరీతిగా పరచుకుంటుంది. అదే పాశ్చాత్య పద్ధతిలో అయితే, రంగులు ఎక్కడికక్కడ కావలసిన మోతాదుల్లో మిశ్రితమౌతూ వెలుగునీడలు సృజింపబడతాయి. ఇది ముఖ్యంగా చిత్రానికి మూడో ఆయతనమైన లోతును ఇస్తుంది. దానితో పాటూ దూర సమీపాల ఆభాస కూడ రంగును తీవ్రతల



మార్పుతో పులమడంవల్ల ఏర్పడుతుంది. మరో ముఖ్య విషయం పృష్ఠ నేపథ్యం (బ్యాగ్రౌండ్). ప్రాచ్య విధానంలో సాధారణంగా సజాతీయంగా పులమబడ్డ నీలం రంగు పృష్ఠ దృశ్యాన్ని నింపుతూ ఉంటుంది. అయితే, చిత్రానికి సరిపోయే విధంగా నీలం రంగు తీవ్రతలో మార్పులు ఉండవచ్చు. పాశ్చాత్య విధానంలో పృష్ఠనేపథ్యం దూరంగా కనిపించే ఆకాశం, స్పష్టాస్పష్టంగా కనిపించే చెట్లు, కొండలు వంటి ప్రాకృతిక స్వరూపాలతో నింపబడుతుంది.

రామారావు తన చిత్రాల్లో రేఖను, రంగును కొద్ది మార్పులతో ఉపయోగిస్తూ లోతును, దూరసమీపాల ఆభాసను చూపారు.

ఏకరీతి మందంతో సాగే రేఖ వస్తువుకు ఆకారమిస్తూనే, లోవివరాల వైనాన్ని కూడ విశదపరుస్తూంటుంది. అయితే, ఏకరీతి మందంతో ఉండడంవల్ల మూడో ఆయతనాన్ని రామారావు రేఖ చూపదు. పైగా రేఖ చాల నాజూకుగా, రంగు విషయంలో చాల తేలికగా ఉంటుంది. ఇంచుమించు వంగశైలికి దగ్గరగా రామారావు తన రేఖను స్థిరీకరించుకున్నారు.

మనుషుల శరీరాన్నంతకీ రేఖతో ఆకృతిస్తారు కాని, ముఖాన్ని మాత్రం వదిలేస్తారు. ముఖాన్ని స్పష్టీకరిస్తూ ఎటువంటి బయటిరేఖలూ (అవుట్ లైన్స్) ఉండకపోవడం రామారావు చిత్రాల్లో చూస్తాం. అందువల్ల ముఖాకృతులు పాశ్చాత్య రీతిలో ఉంటూ, పృష్ఠనేపథ్యంలో అస్పష్టంగా మిళితమైపోతాయి.

వెలుగునీడలు చూపుతూ లోతును వర్ణవిన్యాసమే సాధిస్తుంది. అలాగే పృష్ఠనేపథ్యం విషయంలో పాశ్చాత్యరీతిని అవలంబించారు రామారావు. ఏదోక ప్రకృతి దృశ్యమే పృష్ఠతలాన్ని నింపుతుంది. సిద్ధార్ధ రాగోదయం చిత్రంలో మాత్రం పాశ్చాత్యరీతి పృష్ఠనేపథ్యం ఉండదు. సిద్ధార్ధుడికి వివిధాంగనలను పరిచయం చేయడం ఈ చిత్రంలో వస్తువు. అందువల్ల గృహాంతర్గతమైన నేపథ్యం సరిపోతుంది. అందుకే వివిధ రకాలైన తెరలతో బాహ్యాన్ని మూసేయడం ఈ చిత్రంలో చూస్తాం. సిద్ధార్ధుణ్ణి తండ్రి శుద్ధోధనుడు బయటి ప్రపంచం చూపకుండా పెంచడం కూడ బహుశా కీలకమైన కారణం కావచ్చు.

రామారావు చిత్రరీతిని విమర్శకులు 'ఆంధ్ర శైలి' అన్నారు. ఈ శైలి గురించి మాదేటి రాజాజీగారి అభిప్రాయం తెలుసుకోవడం సందర్భోచితం.




"...ఈ ఆంధ్రశైలిలో ఆకృతులు పాశ్చాత్య రీతిలో చిత్రితమయే విధంగా అత్యంత వాస్తవరూపాలే అయినా – రంగుల్లో, భావనల్లో మాత్రం భారతీయ శైలుల్లో గోచరించే చదునుతనంలో ఉంటాయి. వెలుగునీడలు లేకుండా చిత్రాల్లో పాత్రల వస్త్రధారణ, వారి చీర మడతలు రాఫెల్ చిత్రాల్ని జ్ఞప్తికి తెస్తాయి. ప్రకాశవంతము – స్వచ్ఛమూ అయిన వర్ణన విధానము – పంపకమూ – బింకమైన సన్నటి రేఖాపాటవమూ – ఆకృతుల సమతూకపు అమరిక – అతనికి కుంచెపై వర్ణాలపైగల ప్రభుతను తేటతెల్లం చేస్తా"యంటారు రాజాజీ.




విష్ణుప్రియ — నీటి రంగులు


గురువులు



ఎ. శ్రీరాములు నాయుడు




ఆస్వాల్ట్ జెన్నిఫర్స్ కూల్డ్రీ




సిసిల్ ఎన్. బర్న్స్

దబ్ల్యు ఇ. గ్లాడ్‌స్టన్ సాల్మన్



మిత్రులు



రవిశంకర్ రావెల్



హరివంశరాయ్ బచన్

దామెర్ల కళాఖండాలు

రవి గాంచని చోటుంటుందేమో కాని... కవి గాంచని చోటు, చిత్రకారుడు ఊహించని తావు ఉండవు.

అద్భుతమైన ఊహాశక్తికి రంగులద్ది, కాన్వాసుపై అపురూపమైన కళాఖండంగా మలచడంలోనే చిత్రకారుని సృజనాత్మకత ప్రస్ఫుటమౌతుంది. చిత్రాలను రంగుల కాన్వాసులుగా రూపించినవారు కళాపిపాసుల మదిలో శాశ్వతస్థానం సంపాదిస్తారు.

రామారావు చిత్రాలు ప్రాకృతిక రామణీయంతో, రంగులు అద్దుకున్న భావాలుగా... అనుభూతుల్లా చిత్రింపబడి, ప్రాణమున్న కళాఖండాలుగా నేటికీ నిలిచి ఉన్నాయి. ఆయన చిత్రాల్లో ఊహాశాలిత్వం, దార్శనికత్వం సమపాళ్ళలో రంగరించబడి దోబూచులాడతాయి.

మదిలోని ఆలోచనలకు చేతివేళ్ళలో కదలాడే కుంచెతో రూపమిచ్చి, తీర్చిదిద్దిన చిత్రకళాఖండాలు. జీవముట్టిపడే అలంకార సౌందర్యాన్ని సంతరించుకున్న చిత్రాలు దామెర్ల చిత్రాలు.

రామారావు చిత్రాల్లో ఎక్కువగా పల్లె దృశ్యాలు, పల్లె పడతుల పలు భంగిమలు కనబడతాయి. బావినుంచి,

చెరువునుంచి నీళ్ళు తోడుతున్న స్త్రీలు, పట్టుకు వెడుతున్న స్త్రీలు మనకుకనిపిస్తారు. కొన్ని ప్రకృతి చిత్రాలు, మరికొన్ని నగ్న చిత్రాలు ఎంతోఅద్భుతమైనవి. ప్రకృతి అందాలకు మెరుగులు దిద్ది ద్విగుణీకృతం చేశారు. సాగరతీర చిత్రాలు మరీ అద్భుతమైనవి.

బావివద్ద, కార్తీక పౌర్ణమి, పుష్పాలంకరణ, శ్రీరామ వనవాసము, సిద్ధార్ధ రాగోదయం, నందిపూజ, పావురాలు, పెళ్ళికూతురు, డ్యాన్సర్, ఋష్యశృంగ బంధనం, ద్రోణుడు, భరతవంశపు రాకుమారులు, కైకేయి దురాలోచన, పేరంటము వంటివి ఆయన రూపొందించిన కళాఖండాలు. కొన్ని కళాఖండాలు గురించి సంక్షిప్తంగా తెలుసుకుందాం.


సిద్ధార్ధ రాగోదయం (1922)

సిద్ధార్ధుడు పుట్టినప్పుడు అతని జాతకం పరిశీలించి, అయితే గొప్ప చక్రవర్తి, లేదంటే మహాయోగి అవుతాడన్నారు. పుత్రుణ్ణి గొప్ప చక్రవర్తిగా చూడాలనుకున్న తండ్రి శుద్ధోధనుడు అతణ్ణి చాల జాగ్రత్తగా పెంచాడు. ప్రపంచంలో ఉన్న సౌఖ్యాలను, సౌందర్యాన్ని మాత్రమే పరిచయం చేశాడుగాని, బాధలు, కష్టాలు, నష్టాలు వంటివి ఏమాత్రం దృష్టిలోకి రాకుండా కట్టుదిట్టం చేశాడు. అయినా సిద్ధార్ధుడిలో ఎటువంటి ప్రాపంచిక చింతన ఉండేది కాదు. తండ్రి, రాజ్యాధికార వైభవాన్ని అనుభవంలోకి తెచ్చే ప్రయత్నం చేస్తాడు. భోగలాలసను మప్పే ప్రయత్నమూ చేస్తాడు.

అందులో భాగంగానే ఎందరో అందగత్తెలైన రాకుమార్తెల పరిచయం కలిగిస్తాడు. ఇదీ సందర్భం – సిద్ధార్ధ రాగోదయం. అతిలోక సౌందర్యరాశియైన యశోధరను చూసినప్పుడు సిద్ధార్ధునికి రాగోదయ మవుతుంది.

అతి నాజూకుగా కనిపించీ కనిపించనంత అస్ఫుటంగా ఉంటుంది ఈ చిత్రంలోని రేఖ. ఇక రంగుల విషయానికొస్తే, చాల తక్కువ రంగులే ఉపయోగింపబడ్డాయి. ఇండియన్ రెడ్, ఆకుపచ్చ, పసుపు (ఆకర్), నలుపు, తెలుపు. తక్కువ రంగులతోనే ఎక్కువ ప్రయోజనాన్ని సాధించగలదు, రామారావు కుంచె. ఈ చిత్రం ఆ రోజుల్లో ఎంతగానో ప్రశంసింపబడింది. విమర్శకుల దృష్టిని బాగా ఆకర్షించింది.





సిద్ధార్థ రాగోదయం నీటి రంగులు 1922



పుష్పాలంకరణ (సీమంతం) నీటి రంగులు 1923

పుష్పాలంకరణ (1923)

'పుష్పాలంకరణ'కు ఒక ప్రత్యేకత ఉంది. భార్య శ్రీమతి సత్య వాణిగారికి జరిగిన సీమంతాన్ని కనులారా తిలకించి, పులకించి చిత్రించారని చెప్పుకున్నాం. ఇదొక సాముదాయిక చిత్రం.

ఈ చిత్రంలోని స్త్రీ రూపరేఖా విలాసాలు, వారి వస్త్రధారణ విధానం, కూర్చుని చెప్పుకునే కబుర్లు మనసుకు హత్తుకుంటాయి. పేరంటాళ్ళపై చిలకరించే పన్నీటి జల్లులు మన హృదయాల్లో చిలకరించ బడతాయి.

తల్లి సౌభాగ్యాన్ని, పుట్టబోయే బిడ్డ దీర్ఘాయుష్షునూ కోరుతూ చేసే వేడుక 'సీమంతం' – ఆడువారి పండుగ. ఈ సందర్భంలో భర్త కూడ పాలు పంచుకుంటాడు. గర్భస్థ శిశువు ఆరోగ్యంగా పెరగడానికి తల్లి శారీరక, మానసికోల్లాసాలు ఎంతగానో దోహదం చేస్తాయి. అందుకోసం, ఆమె, భర్త పాటించవలసిన నియమ నిబంధనలు తెలియ జేయడానికే ఈ కార్యక్రమాన్ని ఆరో నెలలోగాని ఎనిమిదో నెలలో గాని నిర్వహిస్తారు.

ఈ వేడుకలో మేడిపండ్లు, వనస్పతి వంటి శుభకరమైన ద్రవ్యాలను ఉపయోగిస్తారు. మేడిచెట్టులా బలంగా ఉండాలని, వనస్పతిలా సంతు సంపదను పొందాలని అర్థం వచ్చే మంత్రాలను భర్తచే చెప్పిస్తారు. ప్రజాపతి అదితికి చేసినట్లు నీకు కూడా చేసే ఈ సీమంతం పుత్రపౌత్రాభివృద్ధిని కలిగించాలని కాంక్షించే మంత్రోచ్చాటన జరుగుతుంది.

ఈ వేడుకలో ముఖ్యాంశం ఏమిటంటే, భర్త దేవతలను ప్రార్థించి గర్భదోషాలు తొలగించేటటువంటి, భవిష్యత్సంతానం కల్యాణకరమై రాజిల్లేటటువంటి అభయం పొందుతాడు.

ఏ శుభకార్యంలోనూ లేనివిధంగా, సీమంతంలో చేతినిండా గాజులు తొడిగి పండంటి బిడ్డను కనమని ముత్తైదువలచే ఆశీర్వచనాలు పలికిస్తారు. గాజులు తొడగడమనే పనికి ఒక నిర్దిష్ట ప్రయోజనం ఉంది. గర్భకోశం మీద ఒత్తిడి కలుగజేసే జీవనాడుల తంత్రులు చేతినరాల్లో ఉంటాయి. ఎక్కువగా గాజులు తొడగడంవల్ల గర్భకోశం ఉద్రిక్తమై సుఖ ప్రసవానికి ఆయత్తమౌతుంది.

ఈ చిత్రాన్ని చూడగానే సీమంతంతో పరిచయం ఉన్నవారికివన్నీ గుర్తొస్తాయి. అంత సహజ వాతావరణాన్ని ఇందులో పొందుపరచారు దామెర్ల.



కృష్ణలీలలు (1924): మలిచిత్రాల దశలో రామారావు ప్రతిభను జగద్విదితం చేసిన సమూహ రచన కృష్ణలీలలు. మొదటగా ఢిల్లీలో ప్రదర్శితమైన ఈ చిత్రం, తదుపరి లండన్‌లోని 'ఇంపీరియల్ గ్యాలరీ ఆఫ్ ఆర్ట్స్'లో ప్రదర్శనకు ఎంపికై పంపబడింది. భారతదేశం నుండి ఎన్నుకొన్న పన్నెండు చిత్రాల్లో ఇది ఒకటి. రామారావు కళాసృష్టిని ప్రపంచ దృష్టికి మొట్టమొదటగా తెచ్చిన చిత్రంగా దీనికి గొప్ప చరిత్రే ఉంది.

సాముదాయిక రచన చిత్రకారుని ప్రతిభను పట్టిచ్చే నికష. ఏ మాత్రం ప్రతిభ లోపించినా, అస్తవ్యస్తమై గజిబిజి అయిపోతుంది. చూస్తుంటే మనసుకు ఆహ్లాదం కూర్చే రచనావ్యూహానికి ఈ చిత్రం అద్దం పడుతుంది.

"నారీ నారీ నడుమ మురారి, హరికీ హరికీ మధ్య వయారి" అంటూ కవులు పలికే కృష్ణలీలావినోదాన్ని రంగుల్లో ప్రదర్శించిన చిత్రమిది.


కృష్ణలీలల సన్నివేశాన్ని వర్ణించే తరి గోపికల చలనోద్వేగాన్ని, వారి మనసుల్లో మసలే పారవశ్య చలనాన్ని కవులు అలతి అలతి పదాలతో వర్ణించడం కద్దు. అటువంటి ఉద్వేగ పారవశ్యాన్ని రామారావు వర్ణరంజితం చేశారీ చిత్రంలో.

"గిరగిర తిరుగుచు – గిరిధరు జూచుచు
చరచర నడుగిడి – చదురుల నాడుచు
దరికిని దరియుచు – దవ్వుల కరుగుచు
వలయము లగుచును – వారగ తొలగుచు
రాజ వదనలును – రమణుడు మురియుచు
రాసము సలిపిరి – రసికత మెరయుచు..."


(గొట్టుముక్కుల వేంకట సత్య నరసింహశాస్త్రి కృత ఖండకావ్యము 'వేణుగీతి' నుండి)

కవి చూపించిన చలనపోకడలన్నీ ఈ చిత్రంలోని గోపికలు మన కట్టెదుట నిలిపేవిధంగా ఈ సమూహ రచనను తీర్చారు దామెర్ల. "వెలవెల బోయే వెన్నెల తళుకులూ, కలకలలాడే కన్నుల బెళుకులూ, వాలుచు సోలుచు వాకలు చను"గతులన్నీ గమక సౌందర్యంతో ప్రదర్శితమౌతాయి. మాధవీలతల్లో మావిగున్నలా, మావి చివురుల్లో మరుగు కోయిల్లా చెలువల గూడి నటనమాడే కృష్ణుని లీలామానుష మాయాజాలక దృశ్యవర్ణనా వర్ణచిత్రం. గొప్ప అద్భుతం!





కృష్ణలీలలు నీటిరంగులు (1924)



పావురాలు — నీటిరంగులు 1924

పావురాలు (1924): రామారావుదైన నిర్దిష్ట రేఖావిన్యాసాన్ని పూర్తి స్థాయిలో చూపే అపురూప చిత్రం 'పావురాలు'.

ఏకరీతి మందంగా సాగే అవిచ్ఛిన్నమైన రేఖ వస్తు ఆకృతులను చక్కగా నిర్వచిస్తుంది. పావురాలకు నూకలు జల్లే దృశ్యం ఈ చిత్రం.

చిత్రానికి చలనశీలత కలిగిస్తుంది రేఖాసరళి. గతిశీలకంగా రూపం ఘనం నుంచి గోళానికి పరిణమించింది. ఈ గతి పరిణామమంతా ఆయా రూపాల్లో ఉన్న రేఖల వైవిధ్యాన్ని బట్టి కలుగుతుంటుంది.

సరళరేఖ పూర్తిగా స్థితిశీలకం. గోళం పూర్ణగతిశీలకం. సరళరేఖలతో ఏర్పడే మూలలు కోణాల మాదిరి ఉంటాయి. అందువల్ల కదలిక కష్టసాధ్యమవుతుంది. వక్రరేఖలతో ఏర్పడే మూలలు వర్తులంగా ఉంటాయి. అందువల్ల కదలిక సుసాధ్యమవుతుంది.

వర్తుల రేఖలతో కూర్పబడినప్పుడు చిత్రం కదలికకు నెలవౌతుంది. చిత్రం మొత్తంగా చూస్తే స్టిల్లైఫ్‌లాగా చలనరహితమైన దృశ్యమే కావచ్చు. కాని, దానిలోని వర్తుల రేఖీయత చిత్రాన్ని చూసే మానసాల్లో చైతన్య రాగాలు పలికిస్తుంది. అటువంటి అరుదైన చిత్రం 'పావురాలు'. చూసేవారి కంటికీ, మనసుకీ వక్రరేఖ ఇచ్చే ఆనందం సరళరేఖ ఇవ్వదు.


సరళరేఖకు సరళరేఖతోను, వక్రరేఖకు వక్రరేఖతోను సామరస్యం ఉంటుంది. భిన్నరేఖలు కలిస్తే వ్యతిరేకత సిద్ధిస్తుంది. చిత్రంలో రేఖావిన్యాసం రెండు రేఖలతోనూ సాధింపబడాలి. అప్పుడా విన్యాసం కంటికింపుగా మనసుకు ఆహ్లాదంగా ఉంటుంది.

పావురాలు చిత్రంలో రెండు రేఖలూ సమతుల్యంగా అమరాయి. మండపాన్ని నిలిపే స్తంభాల్లోనివి నిలువుగా ఉన్న సరళరేఖలు. స్తంభాలు కాక మనుష్యులతో సహా మిగిలిన వస్తువులన్నీ వర్తుల రేఖానిర్మితాలు. నిలువు, అడ్డ సరళరేఖలు లేకుండా పూర్తి వక్రరేఖలతో కూడుకున్న విన్యాసం బాగా చాంచల్యతకు కారణమవుతుంది.

రెండు రకాల రేఖలూ సమతుల్యతను పాటించబట్టి, ఈ చిత్రం చూస్తున్నప్పుడు మనసు చాంచల్యానికి గురి కాకుండా, శాంతి పొందుతూ ఆహ్లాదపడుతోంది. ఇదే రేఖల గమ్మత్తు.

లయమయమైన రేఖలు రేఖావిన్యాసంతో, రేఖాపాతంతో చక్కని దృష్టిక్రమాన్ని సాధించాయి ఈ చిత్రంలో.





బావివద్ద నీటి రంగులు 1925

బావివద్ద (1925): ఈ చిత్రంలో బావివద్ద నీళ్ళు చేదుకునే పడతుల, చేదుకుని తిరిగి వెళ్ళే సుదతుల, వెళ్తూ ఆగి కబుర్లు చెప్పుకునే అమ్మలక్కల హావభావాలు చక్కగా వర్ణరంజిత మయ్యాయి.

ఒక కళాకృతి గొప్పతనానికి నిదర్శనం ఎక్ఫ్రాసిజం. అక్షర రచన కావచ్చు; వర్ణ రచన కావచ్చు, ప్రేరణ కలిగించి మరో కళాకృతికి ఆస్కారం కావడమే ఎక్ఫ్రాసిజం. ఒక కవితను చదివినప్పుడు కలిగిన స్ఫూర్తితో చిత్రరచన చేయవచ్చు; లేదా, ఒక చిత్రాన్ని చూసినప్పుడు కలిగిన ఆనందంతో కవిత రాయవచ్చు –ఇదే ఎక్ఫ్రాసిజం.

దామెర్లవారి 'బావివద్ద' చిత్రంతో స్ఫూర్తి పొందిన వేలూరి వేంకటేశ్వర రావు, అదే పేరుతో పెద్ద కవిత రాశారు. చిత్రం మాట్లాడటమంటే ఏమిటో చూడండి–

"మరి, రెండు బిందెలు తెచ్చావు, మొయ్యగలవుటే?
అడిగింది చేదని బావిలోంచి బయటికి లాగుతూ భారతమ్మ...
చోద్దెం చూస్తావేంట్రా నారిగా? పిల్లమ్మ నెత్తిన బిందెత్తి పెట్టు
తడిసిన తల వెంట్రుకల్ని చేతుల్తో పిండుకుంటూ
అతనివంకే చూస్తున్న చూడామణి గదమాయిస్తోంది..."

సంభాషణలతో చిత్రం ఇలా మాట్లాడితే, సంభాషణలు లేకుండానూ ఎన్నో కబుర్లాడుతుంది.

"ఏమీ పట్టించుకోకుండా, బావిలోకి
తొంగిచూస్తూ నిలబడింది నీలవేణి
ప్రకృతి పిలిచిందేమో చెట్లచాటుకు వెళ్తోంది
వెనక్కి తిరిగి చూడకుండా వెంకటమ్మ..."

చిత్రంలో దృశ్యమెంత ముఖ్యమో పృష్ఠమూ అంతే ముఖ్యం. అదీ సంవేదనల్ని కలిగిస్తుంది–చూసే కళ్ళకు మనసుంటే, ఆ మనసుకు కూడా కళ్ళుంటే!

"ఒంటిని అంటిపెట్టుకున్న ఆ కొద్ది మబ్బుల గుడ్డపీలికల్ని
విప్పి దూరంగా విసిరేసింది నీలాకాశం...
ఆచ్ఛాదన లేని తన దేహ ప్రతిబింబాన్ని
బావి నీళ్ళలో కళ్ళారా చుసుకు మురిసిపోదామని దాని ఉద్దేశం"

ఉత్కృష్ట ఉదాత్త భావంతో కవిత ముగుస్తుంది. మనకూ 'బావివద్ద' చిత్రం గొప్పతనం అర్థమౌతుంది.




డామెర్ల ఆర్ట్ గ్యాలరీ



విరహిణి నీటిరంగులు



నిరంబర (అమాయిక) నీటిరంగులు



క్వీన్స్ టాయిలెట్ (రాణి అలంకరణ) నీటిరంగులు 1925





కర్పూర మంజరి నీటిరంగులు



దామెర్ల కళావారసత్వం

ఆధునికాంధ్ర చిత్రకళా రంగంలో దామెర్ల ప్రభావం ఎలాంటిదంటే, అప్పట్లో కళాకృషి చేసినవారిలో ఒక తరమంతా ఆయన సమకాలికులే. ఆయన భార్య దామెర్ల సత్యవాణి, సోదరి బుచ్చికృష్ణమ్మ, చామకూర సత్యనారాయణ, వరదా వెంకట రత్నం, చామకూర భాష్యకార్లు, వి.వి. భగీరథి వంటి చిత్రకారులెందరో ఆయన ప్రభావానికి లోనై చిత్రకళను ముందుకు తీసుకువెళ్ళారు.

శ్రీమతి దామెర్ల సత్యవాణి గురించి ఇదివరకే చెప్పుకున్నాం. ఆమె చిత్రాల పరిచయమూ బానే చేసుకున్నాం. ప్రతి మగవాని విజయం వెనుక ఒక స్త్రీ ఉంటుందన్న మాట ఈవిడ విషయంలో నూటికి నూరుపాళ్ళు సరి. "తన భర్త యావత్కళా సంపదను ప్రతిఫలాపేక్ష లేకుండా, రిజిష్టర్ పూర్వకంగా జాతికి దానం చేసిన త్యాగశీలి. రామరాయని అదుగుజాడల్లో ఆయన ఆశయ సాఫల్యానికి అహర్నిశం పరిశ్రమించిన ఆదర్శ నారీమణి..." శ్రీమతి సత్యవాణి.





శ్రీమతి బుచ్చికృష్ణమ్మ, దామెర్ల సోదరి. ఈమె గురించి కూడ ఇంతకుముందే చెప్పుకున్నాం. ఇంకొన్ని వివరాల్లోకి వెళితే... ఈమె చిత్రాలన్నీ నీటిరంగులవే. అధికంగా పెన్సిల్ స్కెచ్చులు వేసారు. వంద వరకూ ఈమె చిత్రాలు సేకరించబడ్డాయి. వీటిలో పది రంగుల చిత్రాలు, ఇరవై దాకా నగ్నచిత్రాలు, మిగతావాటిలో గాంధీ, శివాజీ వంటివారి మూర్తి చిత్రాలు, ప్రకృతి చిత్రాలు అధికం. లక్ష్మీసమేత విష్ణుమూర్తి, బుద్ధుడు, భిక్షాటన మొదలైనవి మంచి చిత్రాలు. అలాగే, స్వతంత్ర సమరయోధుడు దిగుమర్తి హనుమంతరావుగారిని వివవాహమాడిన ఈమె జీవితం కూడ ఆ సమరానికే అంకితం చేసి దాన్నే 'ప్రధమ కర్తవ్యం'గా భావించారు. అందువల్ల ఆ ప్రభావంతో వేసిన చిత్రాలూ కొన్ని ఉన్నాయి.



శ్రీమతి బుచ్చికృష్ణమ్మ చిత్రం 'ప్రధమ కర్తవ్యం'

చామకూర భాష్యకార్లు రావు: (1896–1971), సి.బి.రావుగా ప్రసిద్ధులు. ఈయన కూడ రామారావుతో పాటు జెజె. కళాశాలలో కళను అభ్యసించారు. తైలవర్ణ మాధ్యంలో రామారావుకంటె తగినంత కృషి చామకూర



చామకూర భాష్యకార్లు రావు

చేస్తున్నారని కూర్ద్రీ భావించేవారు. అలాగే, రామారావు కంటె కళాశాల జీవితాన్ని ఎక్కువగా కళాసాధనకు చామకూర అంకితం చేస్తున్నారనీ భావించేవారు. ఈ విషయంలో కూర్ద్రీ ఎలా పొరబడ్డారో తెలియదు.

1921లో విజయవాడలో జరిగిన అఖిలభారత కాంగ్రెస్ కమిటీ సమావేశాల్లో గాంధీజీని సందర్శించి ఆయన రూప పటాన్ని చిత్రించి మన్నన పొందారు భాష్యకార్లురావు. వెంబ్లీ చిత్రప్రదర్శనకు 'భగవదన్వేషణము' అనే దానితోపాటు మరో చిత్రం పంపగా కెనడా జాతీయవస్తు ప్రదర్శన సంఘం గైకొన్నది. వీరి 'బాలగంగాధర తిలక్' చిత్రాన్ని రాజమండ్రి మ్యూజియంవారు కొనుగోలు చేసి భద్రపరచారు. రాజమండ్రి టౌన్‌హాల్లో కందుకూరి వీరేశలింగం, చిలకమర్తి లక్ష్మీనరసింహం చిత్రాలు పొందుపరచబడ్డాయి. 'స్టిల్ లైఫ్' రంగులచిత్రం ఛాయాచిత్రమనిపించేంత వాస్తవికతతో ఉంటుంది.

సనారీశ్వరుడు, శకుంతలా దుష్యంతుల పునస్సమావేశము, అనంతునియందు లీనము మొదలగు చిత్రాలు పేరుగాంచాయి. అనంతర కాలంలో ఈయన సృజనాత్మక కళను వదలి కేవలం రూపచిత్రణకే పరిమితమైపోయారు. 21-1-1971న మరణించారు.

భాష్యకార్లు చిత్రం : భగవదన్వేషణము






ఎస్. ఎన్. చామకూర్

చామకూర సత్యనారాయణ కూడ ముంబాయి కళాశాలలో చేరి కళాభ్యసనం చేసినవారే. భాష్యకార్లురావుగారి సోదరుడే. చిత్రకళలో తగినంత కృషి చేశారు. అయితే వీరికి అన్నగారి ప్రోత్సాహం లభ్యం కాలేదు. దానితో దామెర్లను ఆశ్రయించగా రంగులూ, కుంచెలూ ఇచ్చి శిక్షణ కల్పించారు. వేసిన చిత్రాలను తన మిత్రుడు డగ్లస్‌చేత కొనిపించి, ఆ సొమ్మును అవసరార్థం అతని పురోభివృద్ధికే ఖర్చు చేసేవారు దామెర్ల.

మద్రాసు చేరి, 'చామకూర ఆర్ట్ అకాడెమీ' స్థాపించారు. చాలకాలం సౌత్ ఇండియన్ ఆర్ట్ సొసైటీ కార్యదర్శిగా, దక్షిణభారత కళాభివృద్ధికి పాటుపడ్డారు.

ఆంధ్రప్రదేశ్ లలితకళా ఎకాడెమీకి తొలి ఉపాధ్యక్షుడిగా పనిచేశారు. అయితే ఈయన కూడ రూపచిత్రకారునిగానే ప్రసిద్ధి చెందారు. ధ్యానబుద్ధ చిత్రంతో మొదలుపెట్టి సుమారు 150 రూపపటాలను చిత్రించారు. మహాత్మా గాంధి, నెహ్రూ, సి.రాజగోపాలాచారి, టాగోర్, రాధాకృష్ణన్, సి.డి.దేశ్ ముఖ్, ఇందిరాగాంధి వంటివి. ఇతర చిత్రాల్లో ఏటికాడ, గౌరీ కల్యాణం, నాగపూజ, సముద్ర మథనం, రాధాకృష్ణ వంటివి పేరు పొందాయి.

మద్రాసునుండి ప్రత్యేక ఆంధ్ర విడిపోయినప్పుడు, హైదరాబాదు వచ్చేశారు. తన చిత్రాల ఆల్బమ్‌ను కూడ ప్రచురించుకున్నారు. 8-6-1978 న పరమపదించారు.


ఎస్.ఎన్. చామకూర్ చిత్రం 'నమస్తే బాపూజీ'





V. Venkata Ratnam

వరదా వేంకటరత్నం (10–10–1895/ 11–10–1963) దామెర్ల వారసత్వాన్ని ఆలోచనలోను, ఆచరణలోనూ ముందుకు నడిపినవారు. ఆర్థిక పరిస్థితులు అనుకూలించక చిత్రకళను వదిలేసిన మిత్రుడు వరదాను రామారావు కుంచెలు, రంగులు, ఇతర సామాగ్రి ఇచ్చి, తిరిగి బ్రతికించారు. దానికి కృతజ్ఞతగా రామారావు జీవించి ఉండగానే వెంకట రత్నం ఆయనకు అన్నివిధాలా బాసటగా నిలిచారు.

రామారావు, వెంకటరత్నం – ఇద్దరూ మిత్రులు. రామారావుతో పాటు వెంకటరత్నం కూర్డీ శిష్యులే. ఆయన సిఫార్సుతోనే రాజమండ్రి మున్సిపల్ గరల్స్ హైస్కూల్లో డ్రాయింగ్ టీచర్ అయ్యారు. మనలను వీడిన రామారావు పేరును చిరస్థాయి చేసేటందుకు 1925లో 'రామారావు ఆర్ట్ గ్యాలరీ' ఏర్పరచారు. రామారావు కళా వారసత్వాన్ని శిష్యప్రశిష్యంగా విస్తరింపజేసే 'దామెర్ల ఆర్టు స్కూలు'కు




వరదావారి చిత్రం 'విశ్వామిత్ర తపోభంగం'

ప్రిన్సిపాల్‌గా వ్యవహరించి, నాలుగు దశాబ్దాల పాటు ఎంతోమందిని చిత్రకారులుగా తీర్చిదిద్దారు.

శ్రీమతి సత్యవాణిగార్ని వెంకటరత్నమే చిత్రకళలో ఉన్నతురాలిగా తీర్చారు. దాంతో 1938లో ఆమెకు ప్రభుత్వ స్త్రీల బోధనాపాఠశాలలో చిత్రకళోపాధ్యాయినిగా ఉద్యోగం వచ్చింది.

వెంకటరత్నం చిత్రాలెన్నో ప్రసిద్ధ ఆంధ్ర సాహిత్య పత్రిక భారతిలో 1925-33 సంవత్సరాల మధ్య అసంఖ్యాకంగా ముద్రించబడ్డాయి. విశ్వామిత్ర తపోభంగము, దుర్గాలయమున, ద్రాక్షారామ భీమేశ్వరాలయం, లక్ష్మీనారాయణులు, ఇంటికి, పొలము కాపరిబోటి అనేవి ప్రసిద్ధ చిత్రాలు.

ఒక్కమాటలో, రామారావు మనసా వాచా కర్మణా కోరుకున్న ఆదర్శాన్ని ఆయన తదనంతరం ఆచరణలో పెట్టి, ఇరవై ఎనిమిదో యేట మరణించిన ఆయనను తన జీవితకాలమంతా బ్రతికించినవారు వెంకటరత్నం.



వరాహగిరి వెంకట భగీరథి (21-7-1901/ 19-11-1950) ప్రకృతి చిత్రణలో నీరథి. చిన్ననాట రాజమండ్రిలో మేనమామల ఇంటనుండి, దామెర్ల వద్ద ప్రాథమికంగా తనకు తానుగా చిత్రకళను అభ్యసించారు. ఈ సమయంలో నృత్యకారిణి అనే చిత్రాన్ని రచించారు. తరువాత జెజె. స్కూల్లో చేరారు. అయితే, అక్కడి వాతావరణం పడక, అనారోగ్యం పాలై తిరిగి వచ్చేశారు. డ్రిల్లు కమ్ డ్రాయింగ్ టీచరుగా పనిచేసిన భగీరథి, సంవత్సరంలో సగం రోజులు సెలవుమీద పోయి, దేశం నాలుగు చెరగుల విపరీతంగా పర్యటిస్తూ, ప్రకృతి దృశ్యాలను స్కెచ్ పుస్తకంలో పదిలపరచుకునేవారు. వాటినుంచి అందమైన ఉషోదయాలు, సూర్యాస్తమయాలు, పొగమంచు దృశ్యాలు, ఆహ్లాదకరమైన సాయంత్రాలు అనేకానేకమైన దృశ్య చిత్రాలు కేవలం నీటిరంగుల్లో అమోఘమైన వర్ణచిత్రాలుగా మారేవి.




ప్రకృతిలోని వెలుగునీడలనన్నీ తన చిత్రాల్లో బంధించారంటే అతిశయోక్తి కాదు. 'ఆంధ్ర టర్నర్'గా పేరుగాంచారు.

సగం రోజులు పోయినట్లుగానే, సగం పైగా జీతం కూడ కళ నిమిత్తం ఖర్చు పెట్టేసి, దుర్భర దారిద్ర్యంలో జీవించారు. రాజులు, రాణులు, నవాబులు ఆయన చిత్రాలను మక్కువతో కొనేవారు. అలా వచ్చిన డబ్బును కూడ కళాసేవకే


స్పిరిట్యువల్ పవర్‌హౌస్

వినియోగించేవారు.సుఖమయ ప్రభాతం, సంధ్యారాగం, కొండలూ-గుట్టలూ, మంచులోని లోయ, అవసానం, ఒక మంచుతెర, ఆరమా పర్వతం, మాడుగుల మార్గంలో, నందికొండ వద్ద, అస్తమయ కాంతి, మిస్టీ మార్నింగ్, పాపికొండల వద్ద, మొగల్రాజపురం కొండవాలు, వెలుగునీడలు వంటి చిత్రాలు ఆయనకెంతో ఖ్యాతి తెచ్చాయి.



అంకాల వెంకట సుబ్బారావు

(1901-1970) మొదట పాశ్చాత్య విధానంలో చిత్రించేవారు. దామెర్ల పరిచయంతో సంప్రదాయ శైలికి మారారు. తరువాత ప్రమోద్ కుమార్ ఛటర్జీ శిష్యులై వంగశైలిని అధ్యయనం

చేశారు. భీమవరంలో ఏ.వి.ఎస్. స్కూల్ ఆఫ్ ఆర్ట్ స్థాపించి ఔత్సాహిక కుర్రాళ్ళకు చిత్రలేఖనంలో తర్ఫీదిచ్చారు. అంకాల ఆర్ట్ అకాడమీ వ్యవస్థాపక అధ్యక్షులుగా చిత్రకళారంగానికి సేవలందించారు.




విశ్రాంతి వేళ

తులసీదాస్, తక్షకుడు, శ్రీమహా విష్ణువు, శ్రీకృష్ణ అన్వేషణ, సోలో ఫాంటసీ, పగటి కల, నాగార్జునుడు, అదృష్టవంతురాలు, బావివద్ద, పల్లెటూరి పడుచు మొదలైన చిత్రాలు ఆయనకు పేరు తెచ్చాయి. జాతీయోద్యమ కాలంలో గీసిన 'అస్పృశ్యతా నివారణ' అనే చిత్రం గాంధీజీ ఆశీస్సులందించింది.

ప్రాచ్య పాశ్చాత్య విధానాల సమ్మిశ్రిత రీతిలో బెంగాల్ పద్ధతిని ప్రాచీన శిల్పంతో జోడించి చిత్రాలు రచించేవారు. గురుదేవ్, విశ్వశిల్పి వంటి బిరుదులు పొందారు.

మాదేటి రాజాజీ (2-10-1937 /10-7-1990) ప్రాథమిక, మాధ్యమిక విద్యను రాజమండ్రి కళాశాలలో పూర్తిచేశారు. బాల్యంనుంచీ ఉన్న ఆసక్తితో వరదా వేంకటరత్నంగారి శిష్యునిగా చిత్రకళను అభ్యసించారు. 1953లో జెజె. కళాశాల్లో చేరి, 1958లో పట్టాపొంది, మ్యూరల్ పెయింటింగ్‌లో ఒక సంవత్సరం స్పెషలైజేషన్ చేసి 1959లో సర్టిఫికెట్ పొందారు. విద్యార్థిగా ఉన్నపుడే, చిత్రకళమీద ఎన్నో వ్యాసాలు రాసి పత్రికల్లో ప్రచురించారు.



వరదా తర్వాత 1961లో రామారావు చిత్రకళాశాలకు ప్రిన్సిపాలై జీవితమంతా సేవల నందించారు. గురువును మించిన శిష్యుడిగా దామెర్ల వారసత్వాన్ని అత్యంత గౌరవ పురస్సరంగా భుజానికెత్తుకున్నారు.

దామెర్ల రామారావు ఆర్ట్ గ్యాలరీ అనుబంధంగా స్కూల్ ఏర్పడటానికి వరదావారు కారణమైతే, వారిద్దరి ఆశయాలను, ఆదర్శాలను సఫలం చేసినవారు రాజాజీయే.

ముప్పై ఏళ్ళ తర్వాత 1965లో అఖిలభారత చిత్రకళాప్రదర్శన జరిపిన ఖ్యాతి రాజాజీకే దక్కుతుంది. అంతకు ముందు స్వయంగా దామెర్ల వారు ఆంధ్ర సొసైటీ ఫర్ ఇండియన్ ఆర్ట్ ఆధ్వర్యంలో రెండుసార్లు అఖిల భారత చిత్రకళాప్రదర్శనలు ఏర్పరచారు. 1923లో మొదటిసారి ఏర్పరచి నప్పుడు దేశం నలుమూలలనుంచి ఎందరో చిత్రకారులు పాల్గొన్నారు. గంగూలీ తన హిమాలయ-సూర్యోదయ చిత్రాన్ని పంపారు. కర్ణాటక, మహారాష్ట్ర, బెంగాల్, ఒరిస్సాలనుంచి ఎన్నో చిత్రాలు వచ్చాయి. పి.ఆర్.ఓ. ఆఫీసు భవనంలో జరిగిందీ మొదటి ప్రదర్శన. చిత్రకళారంగంలో రాజమండ్రి ఎంతో చైతన్యవంతమైంది. రెండోసారి 1924లో అత్యంత వైభవోపేతంగా జరిగింది.



ఆంధ్రమహాభారతాన్ని నన్నయనుంచి స్వీకరిస్తున్న రాజరాజ నరేంద్రుడు

ఎన్నో చిత్రాలు రచించడంతోపాటు, చిత్రకళకు సంబంధించిన ఎన్నెన్నో వ్యాసాలు రాసి ప్రచురించేవారు రాజాజీ. స్వయంగా 'తూలిక' పేరుతో ఆంధ్రాంగ్లాల్లో ఒకేసారి విడుదల చేస్తూ కళావిషయాలను చర్చించేవారు. కె.పి. పద్మనాభన్ తంపి (త్రివేంద్రం), వి. రాధాకృష్ణ (మద్రాస్), చలసాని ప్రసాదరావు (హైదరాబాద్), వి.కె. పండిట్ (కలకత్తా) వంటి కళావిమర్శకుల వ్యాసాలతో తూలిక కళాకారులను ఆకర్షించేది.

రాజాజీ నీటిరంగుల చిత్రాలను జపాన్ వాష్ టెక్నిక్‌తో సృజించే వారు. జీవితకాలంలో రెండువేలకు పైగా చిత్రాలు వేశారు. పోటీలకు పంపినవాటిని తిరిగి తెచ్చుకోకుండానూ, మిత్రులవద్ద ఉండిపోయినవీ ఎన్నో. దానికి తోడు 1986లో వచ్చిన గోదావరి వరదలో చివికిపోయి వందలాది చిత్రాలు పోయాయి. రాజాజీ అన్నగారి కుమారుడు, కళాప్రేమికుడు మాదేటి రవిప్రకాశ్ 62 చిత్రాలు మాత్రం సేకరించగలిగారు.

రాజాజీ చిత్రాల్లో భువనవిజయం, మొఘల్ వైభవం, ఆదికవి, గరగలాట, దుర్గపూజ, ఊయల మొదలైనవి ఎంతో ప్రసిద్ధి చెందాయి.

కొన్ని కారణాలవల్ల రాజాజీ దామెర్ల ఆర్ట్ స్కూలు ప్రిన్సిపాల్ బాధ్యతలకు కొంతకాలం దూరమయ్యారు. ఆ ఆపత్సమయంలో స్కూలు ఉనికిని కాపాడి, గొప్ప కార్యాన్ని సాధించినవారు, ఆయన శిష్యుడు యెల్లా సుబ్బారావు. ఆ విధంగా ఆర్ట్ స్కూలునుంచి కొందరు విద్యార్థులను చిత్రకారులుగా మలచిన అదృష్టం వీరికి దక్కింది.



ఆనాటి ఫొటో

యెల్లా సుబ్బారావు 1948 జూన్ 15న కళంటే ఎరుగని కుటుంబంలో పుట్టారు. రాజాజీ శిష్యులై కళను అభ్యసించారు. నూనూగు మీసాల నూత్న యువకుడిగా, అదే పాఠశాలలో ఇన్‌స్ట్రక్టరుగా పనిచేస్తున్న రోజుల్లోనే ఎందరిలోనో కళాస్ఫూర్తి రగిలించారు. ఈయన చిత్రిస్తుండగా చూసి, ఉత్తేజితులై ఎందరో చిత్రకళకు ఆకృష్టులయ్యారు. తదుపరి కాలంలో చిత్రకారులుగా రూపొందారు. వేగాన్ని,



ఉద్వేగాన్ని చిత్రించడంలో అందె వేసిన కుంచె వీరిది. సక్రియాత్మకమైన కాన్వాసులు మురిపించే రంగులతో ముద్దులొలుకుతాయి.

కాళహస్తి పార్వతీశం (21-5-1923/8-6-1995) వరదా వారివద్ద శాస్త్రీయ పద్ధతిలో చిత్రకళను అభ్యసనం చేశారు. ముంబాయి, ఢిల్లీ, కలకత్తాల్లో జరిగిన జాతీయ కళాప్రదర్శనల్లో పాల్గొన్నారు. గౌతమ బుద్ధుని జాతక కథల ఆధారంగా సృజించిన చిత్రపరంపర వీరికి మంచి పేరు తెచ్చింది. 1958లో జరిగిన అఖిలభారత బౌద్ధ చిత్రకళా ప్రదర్శనలో 'బోధ' చిత్రానికి ప్రథమ బహుమతి పొందారు.

హొూతా సోమశాస్త్రి వద్ద కూడ కొంతకాలం కళాభ్యాసం చేసి ఆ తరువాత జెజె. కళాశాలకు వెళ్ళి డిప్లమో సాధించారు. చదువుకున్న వీరేశలింగం ఉన్నత పాఠశాలలోనే 1934లో చిత్రకళాధ్యాపకుడిగా చేరారు. లోయర్, హయ్యర్ గ్రేడ్ పరీకక్షలకు ఎందరినో విద్యార్థులను కూర్చోబెట్టి చిత్రకారులుగా మలచారు.

కళను అమ్ముకోకూడదనే ఆదర్శం వీరిది. ఒకసారి ప్రదర్శనకు పెట్టిన నూనె రంగుల చిత్రాన్ని ఆనాటి గవర్నర్ సి.ఎం. త్రివేది కొనుగోలు చేసి పదివేల రూపాయలిస్తే తిరస్కరించారు పార్వతీశం. అప్పుడు గవర్నర్ పేదవిద్యార్థులకోసం ఖర్చుపెట్టమని బలవంతంగా ఇచ్చారు. వెంటనే ఆ సొమ్మును బీద విద్యార్థులకు అందజేశారు సోమశాస్త్రి.

వీరి చిత్రాలు రాజమండ్రి మరంగంటివారి వీథిలోనున్న మరంగంటి సీతారామాచార్యులవారి సొంతింట్లో ఉన్న ఆర్ట్ గ్యాలరీలో పొందుపరచబడ్డాయి.

మరంగంటి సీతారామాచార్యులు (15-4-1912/7-3-1976) రాజమండ్రి ఒసగిన మరో కళాకారుడు. తాపేశ్వరంలో జన్మించిన ఈయన రాజమండ్రిలోని వీరేశలింగం ఆస్తిక పాఠశాలనుండి పదవ తరగతిలో ఉత్తీర్ణులయ్యారు. వరదావారి శిష్యరికంలో చిత్రకళ ప్రాథమిక విషయాలు తెలుసుకుని, జెజె కళాశాలనుండి డిప్లమో పొందారు. చదువుకున్న పాఠశాలలోనే ఆర్ట్ టీచరుగా పనిచేశారు. సొంత ఇంటినే గురుకులంగా మార్చి ఎందరికో చిత్రకళావిద్యను కుల, మతాల కతీతంగా బోధించారు.

బుద్ధా సత్యనారాయణ (జననం 15-7-1948) వీరి అనుంగు శిష్యుడు. గురువుగారిలానే జె.జె. కళాశాలనుండి కళాకారుడిగా వచ్చి తాను చదివిన



వీరేశలింగాస్తికోన్నత పాఠశాలలోనే ఆర్ట్ టీచర్‌గా పనిచేశారు. గురువుగారి పేరిట 'శ్రీసీతారామాచార్య బాల చిత్రకళావికాస్' అనే సంస్థను స్థాపించి, ఎందరినో చిత్రకారులుగా తీర్చిదిద్దారు.

అద్దంకి వెంకటేశ్వరరావు (9-11-1905/26-7-1986) రాజమండ్రి సమీపంలో ఉన్న కాతేరులో జన్మించారు. జె.జె స్కూలులో ఐదు సంవత్సరాలు అభ్యసించి కళాకారులయ్యారు. జ్ఞానసుందరి, వసంత ఋతువు, గ్రీష్మ ఋతువు వంటివి వీరి పేరెన్నికగన్న చిత్రాలు. తిక్కన సోమయాజి చిత్రం 1975 ప్రపంచ తెలుగు మహాసభల్లో ఆవిష్కరింపబడింది. ఈయన చిత్రాల్లో దామెర్ల శైలి కొట్టొచ్చినట్టు కనబడుతుంది.

ఈ విధంగా దామెర్ల ప్రభావంతో ముంబాయి జెజె పాఠశాలనుంచి డిప్లమో పొంది ఎందరో చిత్రకారులై ఆయన కళావారసత్వాన్ని ముసు ముందుకు తీసుకువచ్చారు. వీరంతా రాజమహేంద్రికి ఒక విశిష్ట స్థానాన్ని కల్పించినవారే. ఆ కళావారసత్వం ఇంకా గోదావరితో పాటూ ప్రవహిస్తూనే ఉంది. ఆ ప్రవాహంలో తరగలై, నురగలై ఇప్పటికీ తమ వంతు కృషి చేస్తున్నవారు – ఆశపు అప్పారావు, పి.ఎస్. ఆచారి, ఎన్.ఎస్. శర్మ, గువ్వల కెనడీ, ఎన్.వి.పి.ఎస్. పద్మ (భగీరథి మనుమరాలు), అనిశెట్టి వెంకటేశ్వరరావు, ఎల్లా సుబ్బారావు, తారా నగేష్, కె. అంజయ్య, టేకి మృత్యుంజయరావు, కృష్ణాజీ, రవీంద్ర, ఎం. వెంకటేశ్వరరావు, సినీ పబ్లిసిటీ కళాకారులు గంగాధర్, కళాభాస్కర్, భాస్కరరాజులు, ఉషారాణి, పట్నాల రాధారాణి, నాగేశ్వరరావు, దేవరకొండ మురళీ – వీరంతా రాజాజీ శిష్యప్రశిష్యులై దామెర్ల కళావారసత్వాన్ని తరతరాలకీ అవిచ్ఛిన్నంగా కొనసాగిస్తూ వస్తున్నవారే!



ఉషారాణి దామెర్ల, స్వయంగా రామారావు మనుమరాలు. అయితే ఆమె తన తాతగారిని చూసిందే లేదు. అయినా ఆయన స్ఫూర్తితో అచ్చమైన ఆయన కళావారసత్వాన్ని నిలుపుతోంది. మూడేళ్ళ పసిప్రాయంలోనే చిత్ర రచన ఆరంభించిన ఆమె, తాతగారి కళావైభవాన్ని పునరుద్ధరించడానికి నడుం కట్టింది. మొదట్లో జీవికకు ఏదో మొబైల్ టెలిఫోన్



కంపెనీలో పనిచేసినా, ఇప్పుడు దాన్ని వదిలేసి, పూర్తిగా చిత్రలేఖనానికే అంకిత మైంది. అయితే కాలానుగుణమైన మార్పు ఏమిటంటే, ఆమె ఆధునిక చిత్రకళలో కృషి చేస్తోంది. ఆమె కుమార్తె అహన కూడ పసి వయసు నుండీ రంగులతో ఆడుకుంటోంది. బహుశా ఆమె భవిష్యత్తులో పెద్ద చిత్రకారిణి కావచ్చు.


ఉషారాణి చిత్రం


చి॥ అహన

ఇదీ, దామెర్ల కళావారసత్వం; అవిచ్ఛిన్నంగా తరాల తరబడి సాగుతూనే ఉంది. అయితే ఈ వారసత్వం సజావుగా నిలచి ఉండాలంటే, దాన్ని శ్రద్ధగా జాగ్రత్తచేయాలి. అందుకోసం చక్కని గ్యాలరీ నిర్మించి అందులో కళాఖండాలను భద్రపరచారు. లేకపోతే ఈపాటికి ఆ విలువైన కళ, కలలా కడతేరిపోయుండేంది. రాజాజీ కళాఖండాల విషయంలో జరిగిన నష్టం ఇంతా అంతా కాదు. వందలాది చిత్రాలు వరదనీటిలో చివికిపోయాయి కదా!

రామారావు చిత్రకళాభ్యసనం పూర్తి చేసుకుని వచ్చాకా కేవలం మూడే సంవత్సరాలు చిత్రరచనలో తలమునకలై కళాసృజన చేశారు. అతి త్వరలో తాను చనిపోతానన్న ఎరుక ఉన్నట్లుగా, ప్రతి నిమిషం, ప్రతి సెకనూ ఆయన చిత్రరచనకే

వెచ్చించారు. ఆయన జీవితం మూడేళ్ళ ముచ్చటే అయింది.

అయినా, అత్యంత స్వల్పకాలం లోనే 34 పూర్తి చేసిన తైలవర్ణ చిత్రాలు, 129 నీటిరంగుల చిత్రాలు, 250 పెన్సిల్ అధ్యయన పత్రాలు, 26 స్కెచ్ బుక్కులు, లెక్కలేనన్ని విడివిడిగా ఉన్న పెద్ద స్కెచ్ షీట్లు మనకిచ్చి వెళ్ళారు. అసంపూర్తిగా వదిలేసినవెన్నో! పూర్తికాలం జీవించి ఉంటే, ఆయననుంచి వేల చిత్రాలు మనకు లభించి ఉండేవనడం అతిశయోక్తి ఎంత మాత్రమూ కానేకాదు. అంతకంటే జరిగిన నష్టం ఏమిటంటే. అప్పుడప్పుడే తనదైన ఒక శైలిని ఆయన సృజిస్తూ ఉన్నారు. అందునిమిత్తం ప్రయోగాలూ చేస్తూ ఉన్నారు. అలాంటి కీలక సయయంలో మృత్యువు కాటేసింది. లేదంటే చిత్రకళారంగంలో అద్భుతాలే చేసి ఉండేవారు రామారావు.

విషయానికొస్తే, ఆయన వదలి వెళ్ళిన కళాసంపదను మనం సజావుగా నిలుపుకోగలిగామా? దీర్ఘకాలం చేసిన అశ్రద్ధవల్ల రంగుల కాంతులు కళావిహీనమయ్యాయి. అసలు రామారావు చిత్రాలను భద్రపరచడానికొక గ్యాలరీ



దామెర్ల రామారావు ఆర్ట్ గ్యాలరీ, రాజమండ్రి



నిర్మాణం జరగాలని, ఆయన మరణించిన మరునాడు జరిగిన సంతాప సభలోనే తీర్మానింపబడింది. తీర్మానం ప్రకారం దామెర్లవారి సోదరుడు వెంకటరావు గారింటిలోనే తాత్కాలికంగా గ్యాలరీ ఏర్పరచారు. ఆనాడు ఆ చిత్రకళామందిరాన్ని ప్రారంభించి, దామెర్ల కళాఖండాలను దర్శించిన మహాత్మా గాంధీ ఎంతో పులకించిపోయారు.

18-7-1925న దేశభక్త కాశీనాథుని నాగేశ్వరరావు పంతులు, చిలకమర్తి లక్ష్మీనరసింహం పంతులు మొదలగువారు సభ్యులుగా, విస్సా అప్పారావు కార్యదర్శీ కోశాధికారిగా, వరదా వేంకటరత్నం ఆచార్యునిగా ఎన్నికైన స్మారకసంస్థ 'దామెర్ల రామారావు మెమోరియల్ ఆర్ట్స్ గ్యాలరీ అండ్ స్కూల్' అనే పేరుతో రిజిస్టరైంది. కానీ భద్రత అంతంత మాత్రమే.

గుడ్డిలో మెల్లన్నట్టు, 1957లో నూతన భవనం నిర్మించబడింది. భవనమైతే నిర్మింపబడిందిగాని, గ్యాలరీకి ఉండాల్సిన హంగులేమీ లేవు. వెంకటరత్నంగారి తర్వాత మాదేటి రాజాజీ ఆచార్యులుగా ఉండగా, ఆర్ట్ గ్యాలరీ ఇంకా ఉన్నతినీ, అభివృద్ధినీ సాధించగలదనే ఆశతో 1970లో ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వ సాంకేతిక విద్యాశాఖకు అప్పగించారు. అయితే పరిస్థితిలో ఎట్టి మార్పు రాలేదు.

ఇలాంటి పరిస్థితుల్లో, తూర్పుగోదావరి జిల్లా ఇంటాక్ శాఖ పూనుకుని చిత్రకళాఖండాలను కొంత మెరుగుపరచింది. కంప్యూటర్ సహాయంతో మెరుగుపరచిన రవీంద్రనాథ్ టాగూర్ స్కెచ్చే ఉదాహరణ.


గ్యాలరీ లైటింగ్‌ను కలెక్టర్ రణదీప్ సూడాన్ తన హయాంలో శ్రద్ధగా కల్పించారు




కాలంతో పాటు భ్రష్టత చెందుతాయి కళాఖండాలు. అది వాటి సహజ లక్షణం. 2015 గోదావరి పుష్కరాల సమయంలో గ్యాలరీని సందర్శించిన ప్రభుత్వ సలహాదారు డా॥ పరకాల ప్రభాకర్, "చిత్రాలు మనసును దోచేవిగా వుంటే, చిత్రకళాప్రదర్శన శాల దుస్థితి మనసును కలచివేసిం"దని ఎంతో వాపోయారు. ముఖ్యమంత్రి దృష్టికి తీసుకెళ్ళి కళాప్రదర్శన శాలను మెరుగైన రీతిలో తీర్చిదిద్దేందుకు కృషి చేస్తానన్నారు. కాని ఏ కృషీ ఇంత వరకూ జరగలేదు. కళాఖండాలు మాత్రం పాడవుతూనే ఉన్నాయి.

శ్రీరామ వనవాసం చిత్రం రంగులు పాలిపోయి సరిగా కనబడని దయనీయమైన స్థితి దాపురించింది. మళ్ళీ మరోసారి గ్యాలరీని సంస్కరించ వలసి ఉంది. కార్పొరేటు స్థాయిలో పునః నిర్మించుకోవలసిన అవసరం ఎంతైనా ఉంది.

వందేళ్ళు కూడ కాపాడుకోలేని దుస్థితిలో ఉన్నాం. అదే కేరళలో అయితే రవివర్మ చిత్రాలను ఇప్పటికీ తాజాగా చూడగలం మనం. రామారావు గ్యాలరీలోని చిత్రాలు చాలావరకు ఫంగస్ కారణంగా పాడయ్యాయి. ఈ మాత్రమైనా ఎంతకాలం ఉంటాయన్నది గ్యాలరీ నిర్వాహకులే చెప్పలేకున్నారు.

రామారావు కళాఖండాలతో పాటు సత్యవాణి చిత్రాలు, మరో ముప్పై



నాలుగు మంది కళాకారుల చిత్రాలున్నాయి. పుష్పాలంకరణ, సిద్ధార్థ రాగోదయం, అప్పట్లో మహిళలు ధరించిన పద్దెనిమిది గజాల చీర ఫంగస్ పట్టి మరింతగా పాడైపోతున్నాయి. ముప్పై తైలవర్ణ చిత్రాల రూపు మారిపోయింది. కొందరి ప్రయత్నంంతో ఇంటాక్ (ఇండియన్ నేషనల్ ట్రస్ట్ ఫర్ ఆర్ట్ అండ్ కల్చరల్ హెరిటటేజ్) స్పందించింది. ఇంటాక్ తూర్పుగోదావరి జిల్లా కన్వీనర్ శ్రీమతి శేషు కుమారి చొరవతో ఆ సంస్థ డైరెక్టర్ నీలం సిన్హా గ్యాలరీని సందర్శించారు. 220కి పైగా చిత్రాల్ని పునరుద్ధరించవలసి ఉందని గుర్తించారు. ఇంటాక్ లాబరేటరీని రాజమండ్రికి తరలించి ఏడాది పాటు పనిచేస్తే ఈ చిత్రాలు పునరుద్ధరింపబడతాయని, దీనికి రూ 90 లక్షలు వ్యయమౌతుందని సిన్హా ఒక నివేదిక ఇచ్చారు. ముందుకు రావాల్సిన రాష్ట్రప్రభుత్వం మాత్రం స్పందించలేదు.

కళాఖండాలను, ముఖ్యంగా కాగితం మీద చిత్రించిన జలవర్ణ చిత్రాలు, ప్యాస్టలు చిత్రాలు, డ్రాయింగులు, స్కెచ్‌లు మొదలైన వాటిని గోడమీద ప్రదర్శిస్తూ నిరంతరం కాంతికి, వాతావరణంలోని తేమకి గురికాకుండా చూడాలి. సంరక్షించుకోవాలంటే వాటిని శాశ్వత దర్శనార్థం ఉంచనేకూడదు. అచ్చుమైన ప్రింటులను మాత్రం దర్శనానికి సిద్ధపరచాలి. ప్రసిద్ధి చెందిన ప్రపంచ గ్యాలరీల్లో 'ప్రింట్ స్టడీ రూమ్' అనే ప్రత్యేక నిర్మాణం ఒకటి మ్యూజియంలోనే ఉంటుంది. ఆన్‌లైన్ మ్యూజియాలనే కొత్త విధానం కూడ 'అసలు' చిత్రాలకు కాలదోషం పట్టనీయదు. ఇవన్నీ ఇప్పుడప్పుడే జరిగేవి కాదుగానీ, రామారావు ఆర్ట్ గ్యాలరీని కనీసం కార్పొరేటు స్థాయిలో ఆధునీకరించవలసిన అవసరం ఎంతైనా ఉంది.


అలాగే రాజమండ్రిలో వ్యక్తిగతమైన ప్రైవేటు గ్యాలరీలు కొన్ని ఉన్నాయి. మరంగంటివారిల్లు ఆర్ట్ గ్యాలరీగా మార్చారని తెలుసుకున్నాం. ఈమధ్యనే ఎల్లా సుబ్బారావు తన ఇంటి మొదటి అంతస్తును తన చిత్రాల గ్యాలరీగా మార్చుకున్నారు. ఈ గ్యాలరీల యాజమాన్యానికి, వీటిలోని చిత్రాల సంరక్షణకీ ప్రభుత్వం ఆర్థికపరిపుష్టి కల్పించి, మరికొందరి చిత్రకారుల విలువైన కళాఖండాలకు తావు కల్పిస్తూ చర్యలు తీసుకోవాలి.



ధన్యుడు ... మూర్ధన్యుడు దామెర్ల

ఎంతవారికైనా విమర్శ తప్పదు. రామారావు చిత్రాల విషయంలోనూ కొన్ని విమర్శలు వచ్చాయి. ఆయన జీవించి ఉండగానూ, తర్వాత కూడా. అయితే ఆయన దేనికీ చలించలేదు. ఒక రకంగా రామారావు స్థితప్రజ్ఞుడనే చెప్పుకోవాలి. ఎన్నో ప్రశంసలు కూడ పొందారు రామారావు. ప్రశంసకి పొంగిపోనూలేదు; విమర్శకి కృంగిపోనూలేదు. "అతన్నెవరైన పొగిడినా, తెగడినా చలించేవాడు కాదు, సరికదా, యీ మాత్రానికేనా అని నిర్లిప్తతగా తన కృషి చేసుకునేవా" డంటారు రాజాజీ.

ఆయన చిత్రాల్లో గ్రీకు ప్రభావం ఉందనేది ప్రధానమైన విమర్శ. ఆయన జీవించిన కాలంలోనే మారుమ్రోగిపోయింది. అలాగే నీటిరంగుల చిత్రాలే తప్ప నూనెరంగుల్లో రామారావు చిత్రించలేదన్నది మరో విమర్శ. ప్రకృతి దృశ్యాలు, సాముదాయిక చిత్రాలు, లక్ష్య చిత్రాలు (థీమ్ ఓరియెంటెడ్) మొదలైనవి బాగానే ఉన్నాయికాని రూపచిత్రాలను రామారావు సృజించ లేదన్నది మరో విషయం.



దిడ్యాన్సర్ నీటి రంగులు

ఎవరో అంటే ఏదోలే అనుకోవచ్చు. స్వయానా కూర్డీయే ఈ మాటలనుకున్నారు. *'Memories of Demerla Rama Rao'*అన్న వ్యాసంలో ఆయన ఇలా అంటారు – *"...What he did at Bombay I have only the vaguest idea. My impression at the time was that he was woefully idle. Another youth named Bhashyakarulu; of whom I have since lost trace, went to Bombay about the same time...He used to bring back elaborate studies in oil, of heads and figures, such as grow in Art Schools. I do not clearly remember seeing any such study by Ram, much as I wished him to master the method. Pencil studies of figures he brought home in abundance, as well as landscapes in water colour and various other designs..."*

ఇలా చెబుతూ, ఇంకా ఆయన ఏమంటారంటే, తనకు గుర్తున్నంత వరకు రామ్, చదువులో వెనుకబడి ఉండడం తెలిసిందని, ఆ విషయాన్ని రూఢీ చేసుకుందుకు ఒకసారి రామ్ చదువుతున్న పాఠశాల ప్రధానో పాధ్యాయునికి లేఖ రాసినట్టు చెబుతూ, *"I got merely a routine report from the Headmaster (not the Principal) complaining that he was very irregular in his class work, but otherwise saying nothing of his abilities or prospects..."*అంటారు. ఇదే భావాన్ని ముంబాయిలో రామారావు కళాభ్యసనం పట్ల కూడ ఆయన కలిగి ఉండే వారు. 1916 అక్టోబరు నెలలో ఎలిఫెంటా గుహల్ని చూడటానికి వెళ్తూ, దారిలో ఆగి రామ్ ఎలా ఉన్నాడో, ఏం చేస్తున్నాడో చూదామని జెజె. కళాశాలకు వెళ్ళారు. అప్పుడు కళాశాల సెలవుల్లో ఉంది. అక్కడ ఆయనొక ఆచార్యుణ్ణి కలిశారు. వాకబు చేస్తే, ఆయనేమో రామారావు గురించి తనకేమీ తెలియదన్నారట. దాంతో చాల నిరాశపడ్డానంటారు కూర్డీ. పైగా ఏమంటారంటే – *"Regarding Ram's failure to bring home oil-studies like Bhashyakarlu in my time, I now think it probable that the latter, owing to his greater diligence or docility, had been promoted to the painting class before him, and that Ram was too proud*





కథియవాడ్ గొల్ల పడతులు నీటి రంగులు



నగ్న సుందరి పెన్సిల్ స్కెచ్



to tell me this plainly, and Bhashyakarulu, perhaps, too loyal" – ఈ విధంగా రామారావు కూర్జ్రీ విమర్శకే కాదు, అపార్థానికి కూడ గురయ్యారు. అయితే ఇదంతా, సరైన సమాచార వినిమయం లేకపోవడంవల్ల జరిగిందే కాని మరేమీ కాదు.

ఎంత దగ్గరగా మసలిన వ్యక్తులైనా, దూరమైనప్పుడు కలిగిన ఎడబాటుతో అంతకు ముందులా ఏ అరమరికా లేకుండా మసలలేరు. కొంత రామారావు మనస్తత్వం కూడ కారణం అయ్యుండవచ్చు. అదీకాక వారిద్దరూ సమవయస్కులూ కారు; పైగా వారిది గురుశిష్య సంబంధం.

కళాభ్యసనం నిమిత్తం రామారావు ముంబాయి వెళ్ళడంతో ఇద్దరిమధ్య ఏర్పడిన భౌతికదూరం, మానసికంగా కూడ దూరాన్ని కలిగిం చిందనుకోవాలి. 1920లో కళాశాలనుంచి బయటికి వచ్చేసరికి, కూర్జ్రీ భారతదేశం వదలి వెళ్ళిపోయారు. వినికిడిలోపం ఏర్పడడంతో 1919లోనే ఆయన ఇంగ్లండ్ తిరిగి వెళ్ళిపోయారు. ఈ నేపథ్యమంతా వారిద్దరి మధ్య సమాచార వినిమయలోపానికి కారణమైందనుకోవాలి.

అపార్థానికి తావైన ఈ విషయాలగురించి ముచ్చటిస్తూ, మొదట్లోనే, *"Such were my views at the time less explicitly* formulated..." అంటారు కూర్జ్రీ. అలా అనడంలో, తానలా అనుకున్నానని, ప్రస్తుతం అసలు విషయాలు తెలుసుకున్నానని అన్యాపదేశంగా చెప్పినట్టే కదా!

కూర్జ్రీకు రామారావు భారతీయ శైలిలో చిత్రాలు రచించడం నచ్చేది కాదు. కారణం, అది ఎంతో ప్రాచీనమైన విధానమనే. దాన్ని నొక్కి చెబుతూ ఆయనేమంటారంటే, *"I wanted Rama Rao to be distinctively an Indian painter; but I did not think it essential that an Indian painter should adopt the mannerisms or even the methods of the last millenium, any more than I myself think it necessary to adopt a linear method of painting because the missal-painters of Norfolk and the fresco painters of Winchester excelled in that method as late as the early fourteenth century. Moreover I was not satisfied that the painters of the Bengali renaissance (for*



the choice with Ram lay between Bombay and Calcutta) were infallible interpreters of the essential Indian style in painting. Much of their work seemed and seems to me to be nearer to ancient Greece than to China and Japan" అంటారు. అయితే రామారావుకు అదిష్టం ఉండేది కాదనుకుంటాను. కూర్జీ మాటల్లోనే అది తెలుస్తుంది. *"...last of his Christmas cards...It bears a large self-portrait in brush line, showing that he was already interested in this method"* అంటారు.

దీన్నిబట్టి రామారావు, ప్రాచ్యపాశ్చాత్య విధానాలు రెంటిలో దేన్ని అనుసరించాలన్న విషయంలో ఎంతో సంఘర్షణకు లోనయ్యారని తెలుస్తూంది. ఏటికి ఎదురీదారు.

తానెంతో గౌరవించే గురువుగారికి తాను గీయాలనుకునేది నచ్చేది కాదు. చిన్నప్పట్నించీ నేర్చుకున్నదీ, సాధన చేసిందీ పాశ్చాత్య శైలి. ఆ శైలిలోనే ఎన్నో చిత్రాలు రచించి, వాటికి ఎన్నో బహుమతులు కూడ అందుకోవడం జరిగింది. అయినా ఏదో అసంతృప్తి తనను వెంటాడుతూనే ఉండేది.

ఏదో చెయ్యాలి. ఏమిటది? ఎంతో విచికిత్సకు గురయ్యారు. ఎన్నెన్నో చిత్రాలు రచిస్తున్నా, బహుమతులు అందుకుంటూ కీర్తి పొందుతున్నా ఏదో దిగులు పట్టి పీడించేది. తనదైనదేదో కోల్పోయినట్లు భావించేవారు.

ఈ విచికిత్సతో దేశమంతా తిరుగుతూ, ఎందరో ప్రసిద్ధ కళాకారులను కలుస్తూ, భావాలు కలబోసుకుంటూ, నెమ్మదిగా తన మార్గం ఏమిటో తెలుసుకున్నారు. అయితే దాన్ని సాధించడం అంత తేలిక కాదన్న ఎరుక కూడ ఆయనకు ఉండేది. ఈ యావత్ సంఘర్షణను రాజాజీ తన పుస్తకం, 'సిద్ధహస్తుడు దామెర్ల రామారావు జీవితం–కళాకృషి'లో ఎంతో గొప్పగా వివరించారు. అంతకంటె సవిస్తరంగా చెప్పడానికేమీ లేదు. అందుకే పాఠకుల గ్రహణానికి దోహదపడే ఆయన మాటల్ని యథాతథంగా ఇక్కడ పొందుపరుస్తున్నాను.

"తను చూసి అధ్యయనం చేసిన అజంతా కుడ్యచిత్రాలు (ఫ్రేస్కో పెయింటింగ్స్) జిలుగు పనిలో అలంకారాలతో తర్వాత కాలపు చిత్రకళ కన్నా వాస్తవిక వాదంలో నున్నాయి. ప్రాథమిక వర్ణాలలో అనేక వెలుగు నీడలు చూడకపోయినా, బింకమైన రేఖలతో బుద్ధదేవుని జీవితగాథ అతి రమ్యంగా



చిత్రితమైనది. పోతే వివిధ శైలులలోని రాజస్థానీ సూక్ష్మాకార చిత్రాలు అంతగా వాస్తవికమైనవి కావు. వాటిలో ఎప్పుడూ వ్యక్తుల ప్రక్క దృశ్యమే చూపింపబడినది. మొగల్, రాజస్థానీ చిత్రకళా సంయోగంలో పరాకాష్ఠనందినది కాంగ్రాశైలి చిత్రకళ. తరువాత భారతదేశంలో ఆ కళా ప్రాశస్త్యము క్షీణించిపోయింది. పైగా భారతీయ చిత్ర, శిల్పకళలు మతానికీ కవిత్వానికీ ప్రాధాన్యతనిచ్చాయి. 18వ శతాబ్దం తరువాత 20 శతాబ్దాలకు ప్రారంభమునకు కళాస్తబ్ధత ఏర్పడినది. పరాయి ప్రభుత్వంలో మన కళలకు గ్రహణం పట్టింది.

"ఈ శతాబ్ది ప్రారంభం, బెంగాల్‌లో ఆధునికులు నూతన ప్రయోగాలతో అవనీంద్ర ఆధ్వర్యంలో బెంగాల్ స్కూల్ ఆవిర్భవించింది. భారతీయ శిల్ప చిత్రలేఖనాల నాధారంగా ఏనాటమీకి (దేహనిర్మాణం) ప్రాధాన్యత నివ్వకుండా ఆకృతులను చిత్రించి, జపనీయుల వాష్‌టెక్నిక్, అంటే నీటిరంగులు తేలికగా పూతనిస్తూ పదేపదే నీటిలో కడగడంను స్వీకరించి ఒక క్రొత్త శైలి ప్రారంభించారు. ఇకపోతే దక్షిణాదినే కృషీ లేదు. తాను బొంబాయిలో పూర్తి పాశ్చాత్య రీతుల్లో ప్రకృతికి మానవదేహ నిర్మాణ శాస్త్రానికి ప్రాధాన్యతనిస్తూ అధ్యయనం చేసాడు. గ్రీకు చిత్రకళను కూలంకషంగా మథించాడు. అదే పద్ధతి ననుసరిస్తే భారతీయత లోపిస్తుంది. ఆ చిత్రాలకు యూరోపియన్ చిత్రకళకు నకలుగా ముద్ర పడుతుంది.

"తానొక నూతన శైలిని కనుగొనాలి. క్రొత్త ప్రయోగాలు చేయాలి. రామారావు ప్రాక్పశ్చిమ శైలులను మేళవించి, పాశ్చాత్య వాస్తవిక వాదం భారతీయ ఆధ్యాత్మికతలతో నొక క్రొత్త శైలిని సృష్టించాడు. దీనికే దేశంలోని కళాకోవిదులు 'ఆంధ్రాస్కూల్' శైలి అని పేరు పెట్టారు."

ఈ విషయాన్నే రామారావు తన గురువు కూల్డ్రీకి లేఖద్వారా తెలిపారు. ఆ విషయాన్ని చెబుతూ కూల్డ్రీ అంటారు – *"In February '23 he wrote to me: 'Throughout this whole year I was working very hard. I cultivated a style of painting which is purely Indian and my own. Mr. Abnindranath Tagore who is the greatest artist of the Oriental arts in India now expressed that my style of painting is purely Indian and will form a new school of Indian Art, and all my pictures were highly appreciated by him."* ఇంతకంటే ఏం కావాలి? ఇదే కదా రామారావు



విషయంలో పూర్తి జీవనసాఫల్యం!

ఈ విషయాలన్నీ తెలుసుకున్న తర్వాత *“Memories of Demerla Rama Rao”* అన్న వ్యాసాన్ని కూమ్రోడ్డీ రచించి (త్రివేణిలో అనుకుంటా) ప్రచురించారు. వ్యాసాన్ని ముగిస్తూ, *“What Rama Rao’s final development would have been it is not so easy for ordinary mortals to conjecture. That it remains a matter of conjecture is one of the trajedies of Art. Of the loss which Indian Painting suffered in Rama Rao’s untimely death I fear to say more, for though I know better than most how great it was, I cannot easily separate that knowledge from the feeling of what I have lost myself”* అన్నారు కూమ్రోడ్డీ.

తన మార్గాన్ని ఇష్టపడని గురువుచేత, చివరికి మెప్పు పొందిన శిష్యుడు దామెర్ల ధన్యుడు!

తన మార్గంలోకి ఆకర్షించి వరదా, రాజాజీ వంటి శిష్యులను జాతికి సమర్పించిన గురువు దామెర్ల మూర్ధన్యుడు!

సరేఖీయమైన వెలుగనీడల జిలుగుపనిలో దేశవాళీ ఇతివృత్తాలను భారతీయమైన ఆధ్యాత్మిక రససిద్ధితో ఆవిష్కరించడమే దామెర్ల సాధించిన జీవితాదర్శం. వంగశైలికి సంబంధించిన పేలవమైన తేలిక రంగులు కాకుండా ధాతువర్ణ రూపపుష్టి నిస్తూనే, ఆ శైలిలోని ముఖ్యమైన భారతీయ అలౌకికతకు పట్టం కట్టి అపురూపమైన, అనితర సాధ్యమైన చిత్రరాజాలను జాతికి అందించారు. అందుకే ఆంధ్రులే కాకుండా, యావద్భారత జాతీ ఆయన చిత్రాలను ఆమోదించింది; ఆదరించింది. ప్రపంచ వ్యాప్తంగా ఆయన చిత్రాలు ప్రసిద్ధి చెందాయి.

రామారావు మూర్తి చిత్రణ పెద్దగా చేసిందేమీ లేదన్నది ఒక విమర్శ. ఒక్కసారి మాత్రం మూర్తిచిత్రణను అనుకోకుండా చేశారు. మనం ఇదివరలోనే చెప్పుకున్నాం. భావనగర్ మహారాజు రామారావును తమ ప్యాలెస్‌కు ఆహ్వానించి రాజకుటుంబీకుల చిత్రాలను రచించమని కోరుతూ, దానికితగ్గ ప్రతిఫలం ముట్టచెబుతామన్నారు. ముఖ్యంగా దివాన్ మాట కాదనలేక, మిత్రుడు రావెల్




ప్రోత్సాహంతో ఆ కార్యాన్ని నిర్వహించారు. ఆరు నెలల కాలం వెచ్చించి రాజావారి కుటుంబీకులవి, ఆస్థాన గాయకుడు, దివాన్ మొదలైనవారి చిత్రాలెన్నో నీటిరంగుల్లో, నూనెరంగుల్లో, ప్యాస్టల్స్‌తో, పెన్సిల్ స్కెచ్చులుగా గీశారు. తరువాత ఎప్పుడూ వ్యాపార దృక్పథంతో మూర్తి చిత్రణ చేయలేదు. సాధనలో భాగంగా మాత్రం కొన్ని మూర్తిచిత్రాలను రచించకపోలేదు. భార్య సత్యవాణి వర్ణచిత్రాన్ని అత్యద్భుతంగా చిత్రించారు.

మూల్యానికి మూర్తి చిత్రాలు వెయ్యడమనేది రామారావు ఆలోచనకు అందే విషయమే కాదు. శుద్ధకళను సాధన చేయడమే తన జీవితాదర్శంగా ఆయన భావించారు. కనుకనే చిత్రకళాచార్యునిగా, వైస్ ప్రిన్సిపాల్‌గా వచ్చిన ఉద్యోగాలను ఆయన సునాయాసంగా వదిలేయగలిగారు. చామకూర సోదరులు శుద్ధకళనుంచి విడివడి ప్రత్యేకంగా మూర్తిచిత్రాలు వేస్తూ సొమ్ము చేసుకోవడం తెలిసిందే. రామారావు శిష్యప్రశిష్య పరంపరలో కళను వ్యాపారాత్మక దృష్టితో చూసినవాళ్ళు అధికులే ఉన్నారు.

రామారావు చిత్రణలో గ్రీకు ప్రభావం ఉందన్నది మరో విమర్శ. 1923లో రచించిన రెండు చిత్రాలు – నందిపూజ, పుష్పాలంకరణల్లో పాశ్చాత్య ప్రభావం కొంత పునర్దర్శనం అవుతుందంటూ, గ్రీకు సంబంధ భంగిమలు, వస్త్రధారణం, త్రిమితీయ పరితాపం, వెలుగునీడల గోప్యత వంటివి ఉన్నాయంటూ, చిత్రకారుడు అంతకు ముందరి చిత్రంలో పరమసంతోషంగా సాధించిన దానిపట్ల అంత తృప్తికరంగా లేదని తెలుస్తుందంటారు, కూల్డ్రీ.

పుష్పాలంకరణ చిత్రాన్ని తన భార్య సత్యవాణినే మోడల్‌గా చేసుకుని చిత్రించారు. అలాంటప్పుడు అందులో గ్రీకుఛాయలు వచ్చే వీలు అంతగా ఉండకపోవచ్చు. ఈ విషయంలో రాజాజీ చాల తీవ్రంగా స్పందించారు – "గ్రీకు ప్రభావం వుందని విమర్శ వుందిగాని అది పూర్తి అసత్యం. అతని మోడల్‌లోగాని అతనారాధించిన అర్ధాంగి రూపు రేఖల్లోగాని గ్రీకుచ్ఛాయలు వుంటే ఆ సౌందర్య ప్రతిపాదనే అతని చిత్రాల్లో చేసాడు. అలాంటి మిడిమిడి జ్ఞానంతోనే చేసిన మరో విమర్శ తైలవర్ణ చిత్రాలు, రూపచిత్రాలు లేవని. ఇదికూడ అసంగతము, అవివేకము. స్కూల్ ఆఫ్ ఆర్ట్స్‌లో గడిపిన కాలం అంతా హ్యూమన్ స్టడీ, స్టిల్ లైఫ్‌లో ఆయిల్ కలర్స్‌లోనే అభ్యసించాలి.





Sitarist Abdur Rahman Khan, Chalk

అటువంటి అప్పుడు అతను ఆయిల్ కలర్‌లో చిత్రించలేదా? కొన్ని తైల వర్ణ రూపచిత్రాలు గేలరీలో ఉన్నవే!"అంటూ విస్తుబోతారు.

ఈ అన్ని కారణాలతోనూ రామారావు తన చిత్రాలను మళ్ళీ మార్చి వేసేవారు. గొల్లపిల్లలు చిత్రం తాను కథియవాడ్‌లో ఉన్నప్పుడు వేసింది. అందువల్ల మరాఠీ రూపరేఖావిలాసాలు కొంత ఆ చిత్రమూర్తుల్లో ఉన్నట్లనిపించి, ఆ మూర్తుల్ని పదహారణాల తెలుగు పడుచులుగా మార్చి వేశారు. అలాగే బావివద్ద చిత్రాన్ని డబుల్ ఇంపీరియల్ పరిమాణంలో తిరిగి చిత్రించడం మొదలుపెట్టారు. ఈ ప్రయత్నంగురించి రాజాజీ మాటల్లో – "పాత చిత్రం పరిసరాలు వాతావరణం కథియవాడ్‌కు చెందినవి. కానైతే ఈ చిత్రం పూర్తిగా తెలుగు గ్రామీణ దృశ్యం. తెలుగు పడుచులు బావిచెంత నీరు పట్టుకోవడం, ముచ్చటలాడుకోవడం చిత్రితమైనవి. అయితే చిత్రం పూర్తిచేయక సగంలోనే ఆపుచేశారు. కారణం లోగడ చిత్రాల్లో లేని వెలుగునీడలు కొద్దిగా ప్రవేశపెట్టే ప్రయోగాల్లో ఉన్నందుననే. అందుకు కొన్ని చిన్ని చిత్రాలు ఆవిధంగా సాధన చేసి తయారుచేసి ఫలితాలు (గౌతమ ప్రలోభమనే చిత్రానికి ప్రాథమిక రేఖాచిత్రము) పరిశీలిస్తున్నాడు..." అంటారు రాజాజీ.

ఏదేమైనా, రామారావు ఇదిగో ఇదీ నా శైలి అంటూ కచ్చితంగా ప్రపంచానికి చాటి చెప్పడానికి ముందే తన రంగుల ప్రపంచానికి దూరమయ్యారు. తన శైలిని ధృవపరచే ప్రయోగ దశలోనే కనుమరు గయ్యారు. అదీ విషాదం. ఈ విషయాన్ని తిరుపతి వేంకట పార్వతీశకవులు కవితాత్మకంగా ఎంత బాగా చెప్పారో!

"మృదుల సుమవల్లి పొదలియు బొదలకుండ
దొగరు చిగురాకు తోచియు దోపకుండ
దొడగు ననుమొగ్గ తొడిగియు దొడగకుండ
సురుచిర సుమంబు విరిసియు విరియకుండ
బూవ పిందియ పుట్టియు బుట్టకుండ
మధుర మాసంబునే గ్రీష్మంబు దోప
దాకు వడగాలి చేత నాతపము చేత
గాలి వశమున వసివాడి తూలిపోయె"నన్నారు.

అవనీంద్ర, నందాలాల్ బోసులతో పోలిస్తే తన కృషి ఏ పాటిదన్న



విమర్శను కూడ రామారావు ఎదుర్కొన్నారు. నిజమే అనిపించ వచ్చు. తనదైన విశిష్ట శైలి అనుకున్న విధానంలో ఆయన రచించిన చిత్రాలెన్నని? పట్టుమని పది కూడా ఉండవు. అయితే ఇక్కడ గమనించాల్సిన విషయం ఒకటుంది. అల్పాయుష్కుడు దామెర్ల, కేవలం మూడే మూడు వత్సరాల్లో సృజించినవీ కళాఖండాలు.

అవనీంద్రుడు (7-8-1871/5-12-1951)పూర్ణజీవితాన్ని అనుభవించి (80 సంవత్సరాల 3 నెలల 28 రోజులు) , పూర్తిగా కళకు అంకితమైనవారు. తన మొదటి చిత్రం 'అభిసారిక'ను 1892లో చిత్రించారు. దానితో ప్రారంభించి, 'ఎండ్ ఆఫ్ డాలియన్స్' (1939) వరకు 47 సంవత్సరాల పాటు సాగించిన కళాజీవితంలో ముఖ్యమైనవిగా చెప్పుకునే కళాఖండాలు ముప్పై. (అవనీంద్రుని జీవిత చరిత్ర, ఐ లవ్ ఇండియా.నెట్.రిట్రైవ్డ్, 11-12-2011) ఏమైనా ఏభైకి మించవు. ఈ రీతిగా పోల్చి చూసినప్పుడు రామారావు కళాకృషి అవనీంద్రునికి తీసిపోయిందేమీ కాదని స్పష్టంగా తెలుస్తుంది.

పూర్ణజీవితం ఆస్వాదించలేకపోవడమే ఆయన దురదృష్టం.

కాదు, మన దురదృష్టం.

కాదు కాదు, మన జాతి చేసుకున్న దురదృష్టం.

ఎందుకంటే, కూల్డ్రీ అన్నట్టుగా రామారావు అకాల మరణంతో భారతీయ చిత్రకళ చాలా కోల్పోయింది.





రామారావు ... ఇంకొన్ని విషయాలు

చతుర సంభాషణాశీలి దామెర్ల. ఎవరైనా ఏదైనా అంటే, దానికి ఆయనిచ్చే సమాధానం పైకి చతురంగా ఉంటూనే సవాలు విసిరేదిగా ఉండేది. అవతలి వ్యక్తి మళ్ళీ తిరిగి నోరెత్తకుండా ఉండేదా జవాబు.

శాంతినికేతన్‌ను సందర్శించినపుడు జరుగు తున్న కలకత్తా ఓరియెంటల్ సొసైటీ నిర్వహించిన చిత్ర కళాప్రదర్శనలో ఋష్యశృంగ బంధనం, తూర్పు కనుమల్లో గోదావరి లోయ అనే చిత్రాలను ప్రదర్శించారు రామారావు. మొదటి చిత్రానికి వైస్రాయ్ ఆఫ్ ఇండియా నగదు బహుమతి రూ. 200/– లభించింది.

రెండో చిత్రాన్ని అప్పటి వైస్రాయ్ లార్డ్‌రీడింగ్ కొనుగోలు చేశారని చెప్పుకున్నాం. దాన్ని కొనుగోలు చేస్తూ సరదాగా "*You see in these days of Swadeshi Movement, being a Britisher I am purchasing a Swadeshi painting*" అన్నారు రీడింగ్.

డా॥ అనీబిసెంట్ 'హోం రూల్' ఉద్యమాన్ని నడుపుతున్న రోజులవి. విదేశీవస్తు బహిష్కరణ ముమ్మరంగా సాగుతున్న రోజులు.

స్వదేశీ వస్తువులనే కొనాలనే జాతీయతాభావం పెల్లుబుకుతున్న రోజులు. ఈ విషయాన్ని దృష్టిలో పెట్టుకుని రీడింగ్ చమత్కరించారు. వెంటనే రామారావు, "నిజమైన కళాభిమానానికి, కళారంగానికి ఇటువంటి సంకుచితధోరణి ఉంటుందా?"ని ప్రశ్నించారు.

అలాగే జెజె కళాశాలలో చదువుకుంటున్న ఆఖరి సంవత్సరంలో ప్రిన్సిపాల్ సాల్మన్‌గారి* హయాంలో విద్యార్థులను ఢిల్లీ, ఆగ్రా, ఫతేపూర్ సిక్రీలకు విజ్ఞానయాత్రగా తీసుకు వెళ్ళారు. అప్పటికింకా జరగని న్యూఢిల్లీ నిర్మాణ బాధ్యత అప్పగింపబడిన బ్రిటిష్ వాస్తు, నిర్మాణ శిల్పి లేథియన్ చిత్రకళాఛాత్రులకు తమ ఇంట్లో విందు ఏర్పరచారు. అప్పటికే రామారావు గురించి ఆయన బాగా విని ఉన్నారు. సరే, స్వయంగా చూసే సమయం వచ్చేసరికి రామారావు ఎలా ఉండవచ్చుననుకుంటూ మనసులో కొన్ని ఊహాపోహలు చేసుకున్నారాయన. అయితే రామారావు అనుకోని విధంగా దర్శనమిచ్చారు. చాలా మామూలు, అతి సాధారణ దుస్తులు; పైగా దేశవాళీ ఆహార్యం. పంచె, లాల్చీ, పైన కండువా.

---

* 20వ శతాబ్దం మొదటి సంవత్సరాల్లో ముంబాయి కళాప్రపంచాన్నొక కుదుపుకు గురిచేశారు గ్లాడ్‌స్టన్. జె.జె. కళాశాల ప్రిన్సిపాల్‌గా తన శిష్యుల సామర్థ్యాన్ని భారతీయ, యూరపీయ శాస్త్రీయ విధానాల మేలికలయికగా ఉత్పన్నమైన 'భారతీయ చిత్రకళ నిజశైలి'లోకి మళ్ళించే ప్రయత్నం చేశారు. పాశ్చాత్యంతో పాటు భారతీయచిత్రణ మౌలిక మూలకాలను చేర్చడంద్వారా తన విద్యార్థులు అజంతా కుడ్యచిత్రాల, భారతీయ సూక్ష్మకారక చిత్రాలకు సంబంధించిన భారతీయ వారసత్వాన్ని పొందగలరని నమ్మి ఆయనీ మార్పులు చేశారు. ఇదంతా రామారావుమీద గొప్ప ప్రభావాన్నే చూపింది.

1928లో 'న్యూఢిల్లీ ప్రతిష్ఠాత్మకమైన ప్రాజెక్టు'లో భాగంగా తన విద్యార్థులకు కొత్తగా నిర్మించిన ఇంపీరియల్ సెక్రెటేరియట్‌ను అలంకరించే పనిని సాధించారు. బెంగాల్ స్కూల్‌నుండి గట్టి పోటీ వచ్చినా, దాన్ని సాధించ గలిగారు. ఆయన స్మృత్యర్థం నివాళిగా ఆగస్టు 2007లో 'ప్రవాహ' పేరుతో 19వశతాబ్ది చివరి సంవత్సరాలనుండి 20వ శతాబ్ది మధ్యభాగం వరకు గల ముంబాయి స్కూల్ కళాఖండాలతో ఒక చిత్రకళాప్రదర్శన జరిగింది. పెస్టోంజి బొమాంజి, ఎస్. హల్దంకర్, ఆంటోనియో త్రిందాడి, జె.ఎం. అహివాసి, ఎస్.హెచ్. రజా మరియు కె.హెచ్. ఆరాల చిత్రాలు ప్రదర్శింపబడ్డాయి. మన దామెర్ల చిత్రాలు లేకపోకడం కడు శోచనీయం.



నొసట దిద్దిన చిన్న తిలకంబొట్టు. బాగా నూనె దట్టించిన నుదుటిపై నాట్యం చేస్తున్న ఉంగరాల జుట్టు.

ప్రిన్సిపాల్ సాల్మన్, (సిసిల్ బర్న్స్ తర్వాత వారు, 1918–37 సం॥ల మధ్య పని చేశారు). ఇంటి ప్రవేశద్వారం దగ్గరే లేథియన్‌కు రామారావును పరిచయం చేశారు.

రామారావును చూసి లేథియన్ ఒక్కసారిగా విస్మయం చెందుతూ, చిరునవ్వుతో షేక్‌హ్యాండిస్తూ, “Oh! Mr. Rao, in this dress you are...” అని ఏదో అనబోతుంటే వెంటనే, “Yes, is this dress not so artistic Sir?’ అని ప్రశ్నించారట రామారావు.

సందర్భం కాకపోయినా ఇక్కడొక విషయం చెప్పాలి. కెప్టెన్ డబ్ల్యు ఇ. గ్లాడ్‌స్టన్ సాల్మన్, జె.జె. కళాశాలకు ప్రిన్సిపాల్‌గా వచ్చి, అప్పటివరకు ఉన్న కరిక్యులంలో కొన్ని మార్పులు చేశారు. పాశ్చాత్య అనుకరణలను తగ్గించి, భారతీయతకు అనుకూలంగా కొన్ని విషయాల్ని ప్రవేశపెట్టారు. మొగల్, రాజస్థానీ చిత్రకళపై పరిశోధనకు తావిస్తూ ‘ఇండియన్ ఆర్ట్స్ సెక్షన్’ అనే విభాగాన్ని కొత్తగా కళాశాలలో మొదలుపెట్టారు. మొఘల్ చిత్రకళ ప్రాశస్త్యాన్ని తెలుపుతూ పరిశోధక గ్రంథాన్ని రాసినవారాయన. అజంతా, బాగ్ తదితర కుడ్యచిత్రాలను పరిశోధించి డిప్లమో తీసుకున్న విద్యార్థుల్లో ప్రతిభ కలిగినవారిలో కొందరికి ఉపకారవేతనం ఇచ్చి సంవత్సర కాలం పాటూ ఉండే కుడ్యచిత్ర రచన, శిక్షణ విభాగాన్ని ఏర్పాటు చేశారు.

కరిక్యులంలో ఈ మార్పులను బహుశా కోర్సు మూడో సంవత్సరానికి ముందే సిలబస్‌లో చేర్చి ఉండవచ్చు. అందువల్ల రామారావు ఈ అంశాలు చదివే అవకాశం చిక్కలేదనుకుంటాను. (అయితే ఆ పని కూల్డ్రీ అప్పటికే చేశారు). కానైతే ఆ ప్రభావం కొంతైనా ఉండకపోదు కదా!

జె.జె. స్కూలుకు నిర్దేశించిన ఇంగ్లండ్‌లోని సౌత్ కెనింగ్ ఆర్ట్ స్కూల్ కరిక్యులం స్థానంలో రాయల్ అకాడెమీ సిలబస్‌ను ప్రవేశపెట్టారు. వంగ సంప్రదాయం భారతీయ చిత్రకళావిధానానికి ఎంతమాత్రమూ పనికి రాదని చెప్పే నగ్నచిత్రణను కూడ ఈయనే జెజె స్కూల్ కరిక్యులంలో చేర్చారు. ఈ ప్రభావంతోనే



రామారావు నగ్నచిత్రణ విరివిగా చేశారు. ఆయన్ని అనుసరిస్తూ, ఆడవారైనా, ఆ రోజుల్లో సత్యవాణి, బుచ్చికృష్ణమ్మ కూడ కొన్ని నగ్న చిత్రాలను రచించగలిగారు.

మన్య జ్వరపీడితుడై కూర్డ్లీ వినికిడిని కోల్పోతూ ఉన్న సందర్భంలో రామారావు చేసిన వ్యాఖ్యానం తనకు ఎప్పుడూ గుర్తుకొస్తూ ఉంటుందని తన మెమోయిర్స్‌లో చెబుతారు కూర్డ్లీ. ఆ వ్యాఖ్య అతని సొంతమో లేక ఎవరిదగ్గరనుంచైనా సంగ్రహించాడో తెలియదంటూ, రామారావు మాటను చెబుతారు, "*The feet of Burne-Jones' angels had evidently been disfigured by the practice of wearing boots!*"

మాటల్లోని ఈ నిశితత్వమే కళాసాధనలో కూడ చూపేవారు రామారావు. దేన్నైనా సాధించేవరకూ వదిలేవారు కారు. ఒకసారి తమ కళాశాల్లో ఉన్న రెండు అరటిచెట్లను చిత్రించడానికి విరామం లేకుండా ఎంతో శ్రమించారు. చిత్రంలో తాననుకున్న పరిపూర్ణత వచ్చేవరకు ఎంత శ్రమైనా పడేవారు. కళాకారులే గుర్తించలేని చిన్నచిన్న విషయాలను కూడ పరిగణిస్తూ తన చిత్రాలను అత్యంత వాస్తవికంగా, సహజ సౌందర్యం ఉట్టిపడేలా చిత్రించేవారు. ఈ విషయం గురించి రాజాజీ విపులంగా రాశారు–

"రామారావు చిత్రాల్లో కుమార, యౌవన, వార్ధక్య దశలోనున్న ఏ పురుష స్త్రీ ఆకారాలైన మనోజ్ఞంగా సమాన ప్రతిభతో కనిపిస్తాయి. అంంతెందుకు చిన్నరాయి, చెట్టు కూడ ఎంతో కళాత్మకంగా అత్యంత నైపుణ్యం కనబరుస్తాయి. రామారావు చిన్ని చిత్రమైనా పెద్ద చిత్రమైనా ఎంతో నిర్దిష్టంగా చిత్రించేవారు. అందుకు కారణం తను చిత్రించబోయే చిత్రాల్లో మానవాకృతులుగాని, చెట్టు చేమలుగాని, పశుపక్ష్యాదులుగాని, అవసరమైతే ఆఖరుకు చిన్న బల్ల అయినాసరే ముందుగా వాటిని ఎదుట నుంచుకొని క్షుణ్ణంగా అధ్యయనం చేసి అనేక స్కెచ్‌లు వేసుకుని ఒక అవగాహన ఏర్పడిన తర్వాతనే తన చిత్రాలలో ప్రవేశపెట్టేవా"రంటూ, మంచి ఉదాహరణ చూపారు. 'కుంజవనం' అనే చిత్రాన్ని మొదలుపెట్టి చాల కాలం అసంపూర్ణంగా వదిలేశారట. కొన్నాళ్ళ తర్వాత స్కెచ్చులు వేసుకునేటప్పుడు అనుకోకుండా ఒక మామిడిచెట్టును చూసి, దాని స్వరూపం తన కుంజవనం చిత్రానికి సరిగ్గా అతుకుతుందని, దాని స్కెచ్ వేసుకువచ్చి ఆ



చిత్రంలో దాన్ని ఉపయోగించి చివరికి పూర్తి చేశారట. అప్పుడా చిత్రం అద్భుతంగా పూర్తయిందంటారు రాజాజీ.

చాల తక్కువమందే దగ్గరి స్నేహితులుండేవారు. రూమ్మేట్ మనూభాయ్ బథెకా, సహవిద్యార్థి రావెల్‌లతో పాటు, ముంబాయిలోనే ఉంటున్న హరీంద్రనాథ్ ఛటోపాధ్యాయులు, ఫాల్కే పరంతపే వంటి కొద్ది మంది మాత్రేమే రామారావు ఆత్మీయ మిత్రులు.

రామారావుకు నాటకాల్లోను, సంగీతంలోను అభిలాష ఉండేది. హరీన్ వద్ద హార్మోనియం నేర్చుకున్నారు. సంగీతంలో చెప్పుకోదగ్గ ప్రవేశమే ఉండేది. మధురంగా పాడేవారు. ఈ విషయాన్ని కూల్డ్రీ ధృవపరచారు. రామారావుతో కలిసి వెళ్ళిన ఆఖరి యాత్ర, ఏప్రిల్ 1918లో గోదావరి ముఖద్వారమంటూ, మూడునాలుగు రోజులున్న ఆ క్యాంపులో పడవ తలవరుసపై కూర్చుని రాత్రుళ్ళు పాటలు పాడుకొనేవారమంటారు. ఆయన మాటల్లోనే – "*The number and length of the songs and recitations out of plays, which Ram had by heart, astonished me, and revealed a side of him of which I was hardly aware. My impression is that they were largely of Bombay origin, and probably the Farsi theatre quickened his evident passion for music.*" అంటారు.

కార్తీక పూర్ణిమ నీటి రంగులు







‘భారత మాత’ శ్రీమతి దామెర్ల సత్యవాణి



‘లక్ష్మీనారాయణులు’
శ్రీవరదా వెంకట రత్నం గారు



సిరా చిత్రాలు

సిరా చిత్రాలు అనగానే ఇంకుపెన్నుతో వేసిన చిత్రాలని స్ఫురిస్తుంది కాబోలు. చిత్రకారులందరూ పెన్ & ఇంక్ పెయింటింగ్స్ వేస్తారు.

కవులు, రచయితలైన వారు తమ కలంతో సృజించిన అక్షర చిత్రాలన్నది ప్రకృతార్థంగా గ్రహించాలని మనవి. ప్రముఖ కవులెందరో దామెర్ల కళా విశిష్టత గురించి, అకాల మరణం గురించి స్పందిస్తూ చాల కవిత్వం సృజించారు. కవుల భావనల్లో దామెర్లను ఆవిష్కరించడం కూడ ఆయనకు సంబంధించిన పూర్తి చిత్రాన్ని అందీయగలదనే ఉద్దేశంతో ఈ వ్యాసం రాస్తున్నాను.

ఆంధ్ర దేశంలోని ప్రముఖ కవులు రామారావు గురించి రాశారు. ఆయన జీవితంలో అత్యంత విషాద కరమైన సంఘటన, తరుణ వయసులో అకాల మరణం– కవులూ, రచయితలందర్నీ బాగా కదిలించిన అంశం. కొందరు ఆయన కళ గొప్పతనం గురించి కూడ రాశారు.

“స్వాప్నిక మకరంద పానమత్తుడై
ఒంటరిగా కూర్చుని అంతర్వీక్షణమనే
బంగరు వీణియను మీటినవాడు
వెలుగు నీడల మసక్కాంతుల
ప్రపంచంలో పుటలు తిప్పినవాడు…” అంటూ హరీంద్రనాథ ఛటోపాధ్యాయులు రామారావు కళాతత్త్వాన్ని

తాత్త్వికంగా వర్ణించారు. కలల మకరందం తాగి ఒంటరిగా మన అంతరాళాల్లో ఎక్కడో ఒక బంగరు సితారా వాయిస్తూ నిశ్శబ్దంలో నీడలేని కాంతిని కలగంటూ ఉంటాడంటారు.

నిడమర్తి సత్యనారాయణ, రామారావు చిత్రం గురించి, ఎలా ప్రభవించిందో కవితాత్మకంగా వివరిస్తూ –


“ఉదయగిరి శిఖరావనిపై
బాలభానుడి తెలుగు చిత్రము రచన చేసేను
ప్రజలు మెచ్చిరి, రమ్మిట చూడ తమ్ముడా!

ఆంధ్ర దేశమునందు మొదటగా
గౌతమీ వాఃకరమునందున చిగురు పట్టేను
చిత్రకళల ప్రకాశ రక్తము తమ్ముడా!” అంటూ వర్ణించారు.

గౌతమీ కోకిల మధునాపంతుల సత్యనారాయణ శాస్త్రి, ఒక చిన్న గీతపద్యంలో రామునికి, దామెర్ల రామునికి అభేదాన్ని ప్రకటిస్తారు.

“జీవముల వోసి, బొమ్మల జేసెనొకడు
బొమ్మలే గీసి, జీవము వేసెనొకడు
రాముడాతడు, దామెర్ల రాముడితడు
లేవు కాలావధులు చిత్ర లీలలందు!”

ఈ పద్యం గ్యాలరీవద్ద ఉంచిన దామెర్ల శిలావిగ్రహం పాదపీఠిపై శిలాఫలకంగా అమరింది.



ఆదూరి వెంకట నరసింహ మూర్తి వెళ్తూ వెళ్తూ దామెర్ల చేసి వెళ్ళిన పనులను గుర్తు చేస్తూ అంటారు–

“జారిపోవని కుంచె, జాతి పిల్లలకిచ్చి
స్వర్గ రాజ్యము కళా పోరు గాంచ
వీడిపోవని కీర్తి వాడవాడల నింపి
స్వర్గవాసుల కీర్తి బరువు తెలియ
తగ్గి పోవని రంగు తన జాతిపై బోసి
ఆకాశ రంగులన్ అరయనెంచి

చెక్కు తగ్గని పేరు సీమలన్ దనియించ
పైనున్న వారిపై పంతగించి
నింగి కెగిరెను యోచన పొంగువేళ
పిల్లవాడయ్యు స్వర్గమ్ము పెద్ద తలుపు
ద్రోసిరాజెయ్య నా పీట, దొడ్డవాడు
ఇరువదెనిమి దేండ్లకే ఇలను వీడి!” అంటూ వర్ణించారు.

చనిపోయిన క్షణాల్ని తలుస్తూ పెమ్మిరాజు లక్ష్మీపతి ఆర్తితో పలుకుతారిలా–

“అల్లదె దేశదేశముల నల్లుకొనెంగద నేడు నీ యశో
వల్లిక లాంధ్ర భూస్థలి ప్రభాత విభాకర జోణ దీప్తి రా
జిల్లె నటంచు బొంగితి మసీ మటుమాయము చెంది
యంతలో
కల్లగ మారిపోయె కలగాంచిన లీల నదెల్ల వెల్లువై!

నన్నపార్యుని మేటి గంటంబు దా బ్ర
శాంతి జెందిన చోట విశ్రాంతి జెందె
నౌర! నీ కుంచెయును నేడు, నీ రహస్య
విషపు గర్భమునం దెట్టి వింత గలదొ!” అంటూ విస్తుపోతారు.

తన 'జ్ఞాపకార్థము'ను అక్షరీకరిస్తూ హరీన్ గాద్గదికంగా పలుకుతారు–

"చావులేని కళాకృతులు రచించిన ఆ చేతులు
చావుతో చచ్చుబడిపోయాయి...
గాఢమైన ఆ నల్లని కళ్ళు మూతలు పడ్డాయి
శయనించిన ప్రపంచ ప్రాచీన సౌందర్యానికి విరుద్ధంగా
మృత్యు మార్మిక మాయా శరాఘాతంతో
అతని సద్దు మణగిన అద్భుత హృదయ వేదన
తారక కాంతిలా, గులాబీ శోభలా గతించింది" అంటూ,

అతని చావుకోసం కన్నీరు పెట్టవద్దని హెచ్చరిస్తారు.

"అతడు చావలేదు–
కన్నీళ్ళా ... ఛఛ ... తప్పు తప్పు
కలలుగన్న వాళ్ళెపుడూ
కలలుగానే మిగులుతారు
దేవుళ్ళు వారిని విశిష్టంగా కలగంటా"రంటూ
"మనకోసం మరణం లేని
కళను సృజించినవాడు
ఎలా మరణిస్తాడు?" అని సూటిగా ప్రశ్నిస్తూ అతను మరణించలేదు; మన జ్ఞాపకాల్లో జీవించే ఉన్నాడంటారు.

ఈ మాటలు రాస్తుంటే, నాలో చెప్పనలవికాని వేదన సుడులు రేగి, గుండె గొంతులో కొట్లాడింది. ఈ వ్యాసం తర్వాత అనుబంధ వ్యాసాలు రాద్దామని కూర్చుంటే సాగలేదు కాని, కొన్ని అక్షరాలు సద్యఃస్ఫోరకంగా పెల్లుబికి వచ్చాయి. వాటిని కూడ ఇక్కడ పొందుపరచి, ఈ వ్యాసాన్ని ముగిస్తాను.

మూన్నాళ్ళ ముచ్చటగా
ఎలా బతకాలో చెప్పావు...
క్షణం క్షణం అనుకున్నదే చేశావు
అనుకున్నదే తక్షణం చేసేశావు



జీవితమంత సాధన
మూడేళ్ళలోనే చేశావు, ఏం
మూడిందని...ఏమూహించుకుని?

కాస్తంత సరదా కులాసా
మధ్యమధ్య బొమ్మలేస్తూ
మిధ్యనుకున్నావా అది?

అవిశ్రాంతంగా
బొమ్మలేస్తుంటే చూడలేకనేమో, నీ
బొమ్మకు దండై
మృత్యువు బాగా తొందరపడింది
విశ్రాంతి ప్రసాదించాలనేమో!

నిలువెత్తు నూనెరంగుల్లో
తన చిత్రాన్నెంత బాగా రచించావు
కర్కశి, నీకిచ్చింది చావు
'మృత్యు దేవత'!

సూర్యాస్తమయ
అరుణ వర్ణాంబరం కింద
శ్మశాన ప్రాంగణంలో నిల్చుని
నీరవ నిస్తబ్ధమైన రెండు చేతుల్లో
నిర్జీవ శవాన్ని మోస్తూ
నిలువెత్తు క్రూర దరహాసం చేస్తూ
నిలువునా మోడువారిన చెట్లపై
నిరీక్షిస్తున్న రాబందుల బంధువులా!

మృత్యు రూపాన్ని ప్రతీకించి
తరుముకొస్తుందా అన్నట్టు



నిర్నిద్ర గాన మాలపించావు
నిర్నిమేషుడవై నిలిపావు నీవైన చిత్రాలెన్నో!

రంగుల మర్మాన్ని రూపమయం చేసి
టింగురంగా అంటూ చక్కా పోయావు...
చిత్రకారునిగా ఇక
సాంధించలేనిదేదీ మిగల లేదనా!
సాధించీ మిగుల్చుకునేదేదీ ఉండదనా?
ఎందుకయ్యా, రామయా!

ఆశయాలన్నీ ఆచరించకుండానే
ఆశల స్వప్నాలన్నీ ఆవలకు నెట్టేసి
అలా ఎలా? ... ఎలా అలా!

మృత్యువంటే బుద్ధిలేనిది
నువ్వెందుకు తొందరపడ్డావయా
ఎందుకయా? దేనికయా??

మూన్నాళ్ళ మహోత్సవంగా
ఎలా బతకాలో చెప్పడానికి
నీ జీవితమే గొప్ప ఉదాహరణ
ఈ అక్షరాలే గొప్ప స్ఫురణ!
ఇదే నీకు నా సంస్మరణ!!

-// సమాప్తం //-



దామెర్ల ఆర్ట్ స్కూల్ – విద్యార్థులు

దామెర్ల రామారావు

- దిగుమర్తి బుచ్చి కృష్ణమ్మ
  - దామెర్ల సత్యవాణి
  - దామెర్ల వెంకటరావు
  - దామెర్ల ప్రబోధ్
  - (కుటుంబ సభ్యులు)
- చామకూర సోదరులు
- దాసరి సోదరులు
- వరదా వెంకట రత్నం
  - బంగారు నరసింహారావు
  - పిలకా లక్ష్మీ నరసింహమూర్తి
  - హెచ్.వి. రామ్ గోపాల్
  - **మరంగంటి సీతారామాచార్యులు**
  - కాళహస్తి పార్వతీశం
  - వై. నాగేశ్వరీ బాయ్
  - **మాదేటి రాజాజీ**
  - ఏ.వి. ధర్మారావు
  - పూడి బంగారయ్య
  - పి.వి. నారాయణ
  - దుర్గవరపు సర్వేశ్వరరావు
  - ఎం.ఎస్. మూర్తి, సందిగ అప్పారావు
  - రేకపల్లి ప్రభాకరరావు
  - శీలా వీర్రాజు
  - ఏలిక వెంకటేశ్వర రావు
  - అద్దంకి వెంకటేశ్వర రావు
  - సాంబు, గుప్త , విశ్వనాథం
  - **వీటూరి సత్య హరిశ్చంద్ర శర్మ**
- వి.వి.భగీరథి
- అంకాల వెంకట సుబ్బారావు
- ఏలిక సుబ్బారావు



వరదా వెంకట రత్నం

మరంగంటి సీతారామాచార్యులు

బుద్ధా సత్యనారాయణ
గువ్వల కెనడీ
కరణం నూకరాజు
కె. నారాయణ మూర్తి
ఎం.ఎస్.ఆర్ ఆచార్యులు
సత్యనారాయణ రాజు
గంటశాల శివరామ ప్రసాద్
ధనలక్ష్మి
బాబూనాయుడు
మాదాల లక్ష్మణ్
మాదాల వర్మ
మాదాల ప్రసాద్

వీటూరి సత్య హరిశ్చంద్ర శర్మ

రావాడ కృష్ణ

మాదేటి రాజాజీ

ఆశపు అప్పారావు
పి.ఎస్. ఆచారి
ఎల్లా సుబ్బారావు
చింతపూడి వెంకటేశ్వర్లు
పి. నాగేశ్వరరావు
పట్నాల రాధారాణి
కె. సీతారామ్
యేలుపాటి అన్నపూర్ణ
కొరసాల సీతారామస్వామి
డా॥ ఎన్.ఎస్. శర్మ
దేవాదుల బ్రహ్మానందం
గానుగుల శ్యామ్
ఎ.వి. సోమశేఖర్
ఎం. వెంకటేశ్వర రావు
ఎ. వెంకటేశ్వర రావు
ఎం. సూరిబాబు
మోటూరి శ్రీనివాస్
కృపావతి
కేతినీడి భాస్కర్
భాస్కర రాజు

వెంకట్
దేవరకొండ మురళి
టేకి మృత్యుంజయరావు
తారా నగేష్
బి. ఉష
కె.హెచ్. హరిణి
చిరంజీవి
సిటిఆర్టై నాగేశ్వర రావు
పరశురామ్
జయంతి శ్రీనివాస్
ఎన్.వి.ఎస్.ఎస్. లక్ష్మి (పద్మ)
ఎం. జానకీదేవి, పి. లక్ష్మి
కృష్ణవేణి, సత్యవతి
వరదా ప్రభాసిని
టి. అనిల్ కుమార్
టి. గంగరాజు
ఎల్. ఎన్. శ్రీనివాస్
పట్నాల భాస్కర్
వై. మోహన్ గాంధీ
వరదా వెంకటేశ్వర రావు
కె. జ్యోతి

(టేకి మృత్యుంజయరావు గారి సౌజన్యంతో...)



దామెర్ల రామారావు– టైమ్ లైన్

TIME LINE OF SRI DAMERLA RAMA RAO

1897 : Born on March 8, 1897
1908 : Introduced to the painting of theatrical back-drops by A.S. Ram
1909 : Osward Jennings Couldrey took the charge of Principal, Arts College, Rajahmahendri
1911 : Introduced to O.J. Couldrey by his brother Sri Venkata Rao
1914 : Painted two back-drops for the play Julius Caesar
1916 : May, Couldrey gone to Rama Rao's house to convince his father to send him to Bombay
July, Joined J.J. College of Arts, Bombay as a student
1917 : In spring, Gone Bhuvaneshwar with O.J. Couldrey and Damerla Venkata Rao, Adavi Bapi Raju and Kavikondala Venkata Rao
In October, Visited Ajanta with O.J. Couldry and Adavi Bapi Raju
1918 : April, gone to Godavari Gorge with O.J. Couldry and Adavi Bapi Raju
15 day trip in Gujarat along with Raval and Batheka
Painted Kathiawad Milk-maids, Girnar Forest, Trees and Roots, J.J. School of Arts
Got Maeyo Gold Medal, Washington Griffith Award and Bombay Govt. Award



1919 : O.J. Couldry left for England
June- married Satya Vani, daughter of Sri Digumarthi Srinivasa Rao

1920 : Completed the Diploma Course and got through in First Division;

1921 : Painted Land Scape, Water Falls and The Lake


1922 : Visited the Oriental Society of Indian Art, Calcutta
Returned to Rajahmundry
Developed his own style of art, 'Andhra Style'
Founded Andhra Society for Indian Art
Painted 'Siddhartha Ragodayam' and 'Krishna Leelalu'

1923 : February, wrote a letter to O.J. Couldry, informing the development of his own style in art
Painted 'Pushpalankarana' 'Nandi Puja' and 'Sri Rama Vanavaasam'
Started 'Rajahmundry Chitra Kalashala' to train the youngesters
'The British Empire Review' made an account of Rama Rao's painting

1924 : Conducted the First 'All India Art Exhibition' for the first time in the region
Painted 'The Pegions' and 'Ajanta Vihar'

1925 : January, participated in Wembley Exhibition
Conducted the Second 'All India Art Exhibition'
Painted 'Bavi Vadda'
Visited Lord Venkateswara, Tirumala along with his wife Smt Satya Vani.
February 6th, died of small pox ■





మాకినీడి సూర్య భాస్కర్

కవి–విమర్శకుడు–కథకుడు–చిత్రకారుడు
బాలసాహిత్యకారుడు–కళావిమర్శకుడు
విద్యావేత్త–వక్త–ఉపన్యాసకుడు

ప్రత్యేక కృతజ్ఞతలు

ఈ గ్రంథ రచనకు కావలసిన సమాచార సేకరణలో నాకు సహాయపడిన మిత్రులకు ప్రత్యేక కృతజ్ఞతలు తెలుపుకోవడం నా కనీస ధర్మం.

శ్రీ ఆత్మకూరు రామకృష్ణ, రాజాజీగారి పుస్తకం 'సిద్ధహస్తుడు దామెర్ల రామారావు జీవితం–కళాకృషి'ని స్కాన్ చేసి పంపించారు. అందుకు వారికి నా ప్రత్యేక కృతజ్ఞతలు.

శ్రీ టేకి మృత్యుంజయరావు, దామెర్ల ఆర్ట్ స్కూల్ విద్యార్థినీ విద్యార్థుల జాబితాను తయారుచేసి అందించారు. అందుకు వారికి నా ప్రత్యేక కృతజ్ఞతలు.

మా నాన్నగారు శ్రీ మాకినీడి శ్రీరంగనాయకులు, ప్రూఫ్ రీడింగ్ చేసి ఎంతో కాలాన్ని నాకు మిగిల్చారు. అందుకు వారికి నా ప్రత్యేక కృతజ్ఞతలు.

ఇంకా, వెంటపల్లి సత్యనారాయణ గారికి కూడా నా ప్రత్యేక కృతజ్ఞతలు.

కాకినాడ,
9 జనవరి, 2019

– మాకినీడి సూర్య భాస్కర్
(రచయిత)



సంప్రదించిన గ్రంథాలు, వ్యాసాలు

1. Damerla Rama Rao, brochure released by the Damerla Art Gallery, Rajahmundry
2. Memories of Damerla Rama Rao by Oswald Couldrey, M.A., (Oxon), Author of 'South Indian Hours'
3. A Study of Andhra Society for Indian Art, Chapter IV, Development of Painting
4. Andhra Chitra Lekhalu by Sri Velagapudi Bhujanga Rao, Bharati, 1926 August, pp 45-47
5. 'రామారావు కళారాధన', కవికొండల వేంకటరావు, బి.ఎ., బి.ఎల్., ఆంధ్ర భూమి, ఏప్రిల్ 1942
6. 'ఆస్వాల్డు కూల్డ్రే గురువు', అడివి బాపిరాజు, కిన్నెర
7. 'సిద్ధహస్తుడు దామెర్ల రామారావు జీవితం-కళాకృషి', మాదేటి రాజాజీ, రాజమండ్రి, 1978
8. 'దామెర్ల రామారావు', సుంకర చలపతిరావు, మే, 1996, చిత్రకళా పరిషత్, విశాఖపట్టణం
9. చిరస్మరణీయుడు-దామెర్ల, మాకినీడి సూర్య భాస్కర్, మిసిమి, జూన్ 1997
10. 'రామారావు నుంచి రామారావు దాకా...', మాకినీడి సూర్య భాస్కర్, జనవరి, 2009
11. 'ఆంధ్ర చిత్రకళా వికాసము', ఎన్. వ్యాసరామ్, భారతి, జూన్ 1927 28-30 పుటలు
12. తెలుగు ప్రతిభాప్రభాత రేఖలు, హైదరాబాద్, 1988
13. ప్రకృతీ కృతీ కళాకృతిని అలాగే కుంచెలో చూపిన చిత్రకారుడు దామెర్ల రామారావు, ప్రముఖాంధ్ర 22వ వర్ష హర్ష సంచిక
14. 'చిత్రజగతిలో పున్నమి రేడు... దామెర్ల రామారావు' ఆత్మకూరు రామకృష్ణ, 64 కళలు.కామ్ - మార్చి 2012




15. 'చెరగని సజీవ చిత్రం దామెర్ల రామారావు' ఆత్మకూరు రామకృష్ణ, విశాలాక్షి సాహిత్య మాసపత్రిక – మార్చి 2012
16. 'చెరగని చిత్రం–చెదిరిన జీవితం' నది మాసపత్రిక ఏఆత్మకూరు రామకృష్ణ, మార్చి 2012
17. నల్ల కలువలు (ఖండకావ్యం), శ్రీ మాదేటి సూర్యప్రకాశం, 1949
18. మన దామెర్ల, సంకలన కర్త శ్రీ మాదేటి రవిప్రకాశ్

అంతర్జాల పత్రాలు:

19. www.genl.com/people/Rama-Rao-Damerla/60000000 10865556125
20. www.genl.com/people/Rama-Rao-Damerla/60000000 10812314151
21. www.genl.com/people/Rama-Rao-Damerla/60000000 10828643608
22. www.genl.com/people/Rama-Rao-Damerla/60000000 10829908386
23. www.genl.com/people/Rama-Rao-Damerla/60000000 12348052
24. www.genl.com/people/Rama-Rao-Damerla/60000000 10832157896
25. www.genl.com/people/Rama-Rao-Damerla/60000000 10832141757
26. www.genl.com/people/Rama-Rao-Damerla/60000000 10534344563
27. chaibiket.com/the-forgotten-telugu-painter-damerla.ramarao-and-his-art-gallary
28. USHAHKALAM - The Blog Mag,
29. palukuteniyalu.blogspot.com
30. telugu.godavarimahapushkaram.org/damerla-ramarao/
31. Andhra Jyothi, october 14,
32. telugu.nativeplanet.com
33. telug.com/damerla.html

■





A rare Photograph of Four Friends from L to R

Sarva Sri
Varada Venkata Ratnam
Chamakura Bhashyakarlu Rao (C.B.Rao)
Damerla Rama Rao
&
Chamakura Satyanarayana (SN Chamkur)

కవి, విమర్శకుడు, కథకుడు, చిత్రకారుడు, చిత్రకళా విమర్శకుడు, బాలసాహితీవేత్త, వక్త, విద్యావేత్త, ఫ్రీలాన్సర్ జర్నలిస్టు

మాకినీడి సూర్య భాస్కర్



కళాసాహితీ ప్రస్థాన రేఖాంకన

మాకినీడి ముద్రిత గ్రంథాలు

కవిత్వం:

1. సుమ కవితాంజలి, ఆగస్టు 1997, తిరుమల దేవస్థానముల ప్రచురణ
2. ప్రకృతి గీసిన వికృత చిత్రం, మార్చి 2002
3. సెలవ రోజు, డిసెంబర్ 2003
4. కలల పెదవుల నవ్వుల్లోకి..., జనవరి 2008
5. సామెతకో పద్యం, మార్చి 2009
6. పాపికొండల్లో పడవ పాట, మే 2011
7. ఆమె (దీర్ఘ కవిత), 17 ఆగస్టు 2012
8. తడితడిగా ఆలోచించే... 17 ఆగస్టు 2013
9. నాకు నేను దొరికిన క్షణాలు... జూన్ 2016

హైకు సంపుటాలు:

10. హైకూ చిత్రాలు (హైకు సంపుటి) నవంబరు, 1997
11. ప్రకృతి (ఫొటో హైకు), అక్టోబర్ 1998; ద్వితీయ ముద్రణ- ఏప్రిల్ 2017
12. రాలిన పుప్పొడి, జనవరి 2000
13. ఋతు రాగాలు, జనవరి 2000
14. హైకు-హైగా, ఆగస్టు 2005



బాలసాహిత్యం:

15. జ్యోతి బాల, మే 1996
16. స్వర్ణ భారతి (దేశభక్తి గేయాలు), ఆగస్టు 1997
17. తెలుగు భాష-వెలుగు మార్గాలు (తానాఅవార్డ్ విన్నర్), జనవరి 2006
18. వెన్నెల, 21 డిసెంబర్, 2008
19. బాల్యం ఒక పాట, 21 డిసెంబర్, 2009
20. **కథాసంపుటి : అంతస్సౌందర్యం,** నవంబర్ 2003

సాహిత్య విమర్శ:

21. కళాసాహితీ తోరణం, మార్చి 1998, తెలుగు విశ్వవిద్యాలయం ప్రచురణ
22. హైకూ కవిత్వం-అనుశీలన,జనవరి 1999,హైకుపై తొలి విమర్శ గ్రంథం
23. నానీలు-నాలుగు వ్యాసాలు, ఫిబ్రవరి 2003, తొలి విమర్శ గ్రంథం
24. కలం కలలు, మే 2003
25. దృక్కోణం, సెప్టెంబర్, 2003
26. రెండు ఎలిజీల మధ్య, మార్చి 2004
27. తాత్త్విక రెక్కలు - ప్రస్థానం, మే 2008
28. అద్దేపల్లి కవిత్వం-వ్యక్తిత్వం, తత్త్వం, నవంబర్ 2006
29. అమ్మ - పరీమళ వ్యాఖ్యానం, 2008
30. పద్యం-హృద్యం (పద్య కావ్యాలపై విమర్శ వ్యాసాలు) జనవరి 2014
31. అద్దేపల్లి కవిత్వం-పరిణామం, 6 సెప్టెంబరు 2015, అశీతి ప్రవేశం
32. సత్యాన్వేషణలో...(కళా,సాహిత్యేతర సామాన్య వ్యాసాలు) మార్చి 2003
33. కంచి చేరిన కథలు, ఆగస్టు 2017

కళావిమర్శ

34. కళావిమర్శక వ్యాసాలు, జూన్ 2005
35. కళాస్రవంతి-ఆంజనేయులు, జూన్ 2007
36. ఆర్ట్ స్కూల్ (చిత్రకళ పాఠాలు), జూన్ 2008
37. రామారావు నుంచి రామారావు దాకా, జనవరి 2009
38. మన చిత్రకారులు, ఆగస్టు 2014
39. దామెర్ల - ఆధునికాంధ్ర చిత్రకళ ఆద్యుడు
40. సంజీవదేవ్ - ప్రకృతి 'గీతా'లాపకుడు
41. డా॥ పి.ఆర్. రాజు చిత్రాలు - సౌందర్య వర్ణగీతాలు
42. కళ, కళావిమర్శల పోటుగాడు చలసాని



43. బాపు'రే' – రేఖీయాభివ్యక్తి
44. డా॥ మాచిరాజు – వర్ణసంగీత మాంత్రికుడు
45. రావు వెంకటరావుగారి 'చిత్రమాలిక – స్వర్ణ జ్ఞాపిక'

మాకినీడిపై వచ్చిన పుస్తకాలు:

46. రచన–రసన (మాకినీడి సాహిత్య వ్యక్తిత్వ విమర్శ), అక్టోబర్ 2001
47. దృష్టి–సృష్టి (మాకినీడి కళాసమీక్ష), ఆగస్టు 2001
48. మాకినీడి కళాసాహితీ జీవన రేఖాంకన, మే 2012
49. నింగీ–నేల (దీర్ఘ వ్యాసం)–డా. ఎం.వి.వి.ఎన్; 2005లో రాసిన వ్యాసం పున:సవరణలతో మాకినీడి వ్యాసరజతోత్సవం సందర్భంగా 64కళలు.కామ్‌లో ప్రచురితం, మార్చి 2014
50. ఎం. శేఖర్, 'మాకినీడి వచనకవితా సంపుటాలు–పరిశీలన (ఎం.ఫిల్)
51. ర్యాలి శ్రీనివాస్, 'సంపాదకుడిగా మాకినీడి' (ఎం.ఫిల్)
52. వి. విజయకుమార్, 'మాకినీడి సమగ్ర సాహిత్యం–పరిశీలన' (పిహెచ్.డి)
53. శ్రీహస్త రచించిన 'మనసున్న కవి మాకినీడి'

ఎకడెమిక్ గ్రంథాలు :

54. పాఠశాల పాలన (టిటిసి విద్యార్థుల కోసం), జిల్లా విద్యాశాఖ ప్రచురణ జూన్ 1999
55. ఎయిడ్స్ నియంత్రణ, చికిత్స (బుర్రకథ), ఆం.ప్ర. ప్రభుత్వ ప్రచురణ, (A Folk-lore Art-form executed for propagation about AIDS and its Preventionand Cure, chaired by the Dist Collector Sri Satish Chandra) 2000.
56. చదువుల పండుగ, కాకినాడ పురపాలక సంఘ ప్రచురణ (ఆర్థికశాఖా మంత్రి శ్రీ యనమల రామకృష్ణుడుగారిచే ఆవిష్కరణ) ఆగస్టు 2002
57. సైంటిఫిక్ టెంపర్ (ఎన్.సి.ఇ.ఆర్.టి పత్రం), అబ్దుల్ కలా సైన్స్ సెల్ ప్రచురణ డిసెంబర్ 2002
58. కొలెస్టిరాల్ , తెలుగు అకాడెమీ ప్రచురణ, మార్చి 2003
59. Infant Feeding, Published by Body & Beauty Care, 15 April,1992
60. అల్లూరి సీతారామరాజు (బుర్ర కథ), మే 2005, జనసాహితి ప్రచురణ
61. తరాల మార్పు కోసం బాలసాహితి (మోనోగ్రాఫ్), జిల్లా విద్యాశాఖ ప్రచురణ నవంబర్ 2006, జిల్లా కలెక్టర్ ప్రసాదరావు గారిచే ఆవిష్కరింపబడింది



62. తెలుగు మనుగడకు వెలుగు మార్గాలు (తానా అవార్డు విన్నర్),
జనవరి 2006

చిరుగ్రంథ కానుక – మరుగంధ మాలిక

62. అద్దేపల్లి కవిత్వం – పరిణామం
63. గూడ శ్రీరాములు వ్యాసాలు – నిగూఢ విమర్శక విన్యాసాలు
64. మినీ కథన బ్రహ్మ – కె.బి. కృష్ణ
65. కడలి బ్రతుకుల కల్లోల సరళి
66. రాంషా రచనలు – వైశిష్ట్యం
67. ప్రజాచిత్రకారుడు మోహన్
68. మధునాపంతుల కవిత్వం – తత్త్వం
69. అసిధారావ్రతం (అశోక్ కుమార్ సింగంపల్లి కవిత్వ విమర్శ
70. **దామెర్ల కళ – వారసత్వం...**

INDIAN WRITING IN ENGLISH

Member in 'World Poets' Society, Makineedi's poems translated by himself into English are published in the International Journals and Webzines like Asian American Poetry, The Enchanting Verses, Velvet Illusion, Albatros, Poetry First, All Poetry, Poetry Freak, Poetry that Moves, Akashik, Muse India, Chill Breeze etc.

About 50 poems and 37 articles are published. Some of them are translated into spanish, french, ductch, germanian languages by the Journals and published.

Two anthologis of Poetry in English are published; i. Boat's Song in Papi Hills and ii. PoeTree (Poems exclusively on the Tree.

Three books are ready to print with press-copies.

i. Falcon in the Rain (Poetry Anthology)
ii. Contemporary Indian Poets (in English) and
iii. Contemporary American Poets

IN HINDI

Makineedi translated his poems into Hindi and they are published. A poem , 'Nirantara Baazaar' won National Award, 2012. He translated the 'Boat's Song in Papi Hills' into Hindi and published as 'Papi Pahaadom me Naav kaa Geet'.

It has been appeared as a combined tri-linguistic anthology in Telugu, English and Hindi.